మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ఉత్తమ విద్యే లక్ష్యంగా... ఐఐఐటిని తీర్చిదిద్దుతాం
శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌కు పూర్వవైభవం తెస్తాం
నేడు సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు
వర్సిటీల్లో సమస్యల పరిష్కారానికి వైస్‌చాన్స్‌లర్ల కమిటీ
లోపలి పేజీల్లో



సంపుటి 27, సంచిక: 177 | శనివారం | 14-12-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


## అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి అభిశంసనకు రాజ్యసభలో ప్రతిపక్షాల నోటీసులు

నోటీసుపై 50 మంది ఎంపిలు సంతకం



**న్యూఢిల్లీ :** ఇటీవల విహెచ్‌పి కార్యక్రమంలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్ కుమార్ యాదవ్ అభిశంసనకు రాజ్యసభలో పలు ప్రతిపక్ష పార్టీల సభ్యులు శుక్రవారం నోటీసులు అందజేసారు. అభిశంసన తీర్మానం నోటీసుపై కపిల్ సిబ్బల్, వివేక్ టంఖా, దిగ్విజయ సింగ్,పి.సందోష్ కుమార్, పి.పి.సునీర్, జాన్ బ్రిట్టాస్, మనోజ్ కుమార్ ఝా , సాకేత్ గోఖలే సహా 55 మంది ప్రతిపక్ష ఎంపిలు సంతకం చేశారు. రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు వీరంతా రాజ్యసభ సెక్రటరీ జనరల్‌ను కలిపి అభిశంసన నోటీసును అందజేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సంతకాలు చేసిన వారిలో పి చిదంబరం, రణదీప్ సుర్జేవాలా, ప్రమోద్ తివారీ, జైరాం రమేశ్, ముకుల్ వాస్నిక్, నసీర్ హుస్సేన్, రాఘవ్ చద్దా, ఫౌజియా ఖాన్, సంజయ్ సింగ్, ఎ.ఎ. రహీమ్, వి శివదాసన్ , రేణుకా చౌదరి తదితరులు ఉన్నారు. న్యాయమూర్తుల (విచారణ) చట్టం, 1968, రాజ్యాంగంలోని ఆర్టికల్ 218 ప్రకారం, తరువాయి 2లో


పరారీలో సినీనటుడు మోహన్‌బాబు 03




# వెనుకబడిన జిల్లాలకు రూ.1800 కోట్లివ్వండి

రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరచిన విధంగా పెండింగ్‌లో ఉన్న గ్రాంట్లను విడుదల చేయండి

ఉమ్మడి సంస్థల నిర్వహణ వ్యయం రూ.408 కోట్లు ఎపి నుంచి ఇప్పించండి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపర్చిన విధంగా తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో పార్లమెంట్‌లోని ఆమె ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెనుకబడిన జిల్లాలకు కేంద్రం నుంచి రావల్సిన గ్రాంటుపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. పునర్విభజన చట్టంలో తెలంగాణలోని తొమ్మిది జిల్లాలకు ఏటా రూ.450 కోట్ల చొప్పున గ్రాంటు విడుదలకు అంగీకరించారని సిఎం గుర్తు చేశారు. 201920, 2021 22, 202223, 202324 సంవత్సరాలకు సంబంధించిన గ్రాంట్‌ను ఇప్పటివరకు విడుదల చేయలేదని, నాలుగేళ్లకు కలిపి పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన తర్వాత హైదరాబాద్‌లోని హైకోర్టు, రాజ్ భవన్, లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, జ్యుడిషియల్ అకాడమీ సహా ఇతర ఉమ్మడి సంస్థల నిర్వహణను తెలంగాణ ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రికి సిఎం రేవంత్‌రెడ్డి వివరించారు. వివిధ సంస్థల విభజన పూర్తయ్యే వరకు నిర్వహణకు అయిన రూ.703.43 కోట్లను తెలంగాణ ప్రభుత్వమే భరించిందని, అందులో ఆంధ్రప్రదేశ్ వాటా రూ.408.49 కోట్లను తెలంగాణకు చెల్లించాల్సి ఉందని కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. ఆ మొత్తం చెల్లింపునకు ఆంధ్రప్రదేశ్ సమ్మతి తెలిపిందని, కేంద్ర హోం శాఖ సైతం ఆ మొత్తం తెలంగాణకు చెల్లించాలని ఎపికి లేఖలు రాసిందని సిఎం వివరించారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ఆ మొత్తాన్ని తెలంగాణకు చెల్లించలేదని, ఆ రూ.408.49 కోట్లను వడ్డీతో సహా తెలంగాణకు చెల్లించేలా కేంద్ర తరువాయి 2లో

# రాజ్యాంగం అంటే సంఘ్ రూల్‌బుక్ కాదు

దేశ ఐక్యత, భావప్రకటనాస్వేచ్ఛకు సురక్షా కవచం

లోక్‌సభ తొలి ప్రసంగంలో బిజెపిని ఎండగట్టిన ప్రియాంక



**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగం అంటే సంఘ్‌పరివార్ నిబంధనల పుస్తకం (సంఘ్ రూల్ బుక్) కాదని కాంగ్రెస్‌పార్టీ ఎంపి ప్రియాంకాగాంధీ విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సరిగ్గా అర్థం చేసుకోలేదనీ, భారత్ కా సంవిధాన్ (భారత రాజ్యాంగం) అంటే సంఘ్ కా విధాన్ (సంఘపరివార్ నిబంధనావళి) కాదని అన్నారు. రాజ్యాంగంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో శుక్రవారంనాడు మొట్టమొదటిసారి ఆమె ప్రసంగించారు. 32 నిమిషాలసేపు హిందీలో చేసిన ప్రసంగంలో ప్రియాంకాగాంధీ ఎంతో నిగ్రహంతో బిజెపి విధానాలపై నిశితంగా ఎండగట్టారు. బ్యాలట్ పత్రాలను ఉపయోగించడంద్వారా ఎన్నికల ప్రక్రియలో పాల్గొని ప్రజాతీర్పు పొందాలని ఆమె బిజెపి ప్రభుత్వాన్ని సవాలు చేశారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. బిజెపి రాజ్యాంగాన్ని ఇష్టానుసారంగా మార్చేందుకు ప్రయత్నం చేస్తోందనీ, దేశంలో అదానీ గ్రూపు ఏకస్వామ్యం, ఆధిపత్యం పేట్రేగిపోతోందనీ, మహిళలపై అరాచకాలు, అక్రమాలు పెరగుతున్నాయనీ, సంభాల్‌లో, మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయనీ గుర్తుచేశారు. ఒకవైపు దేశ రాజ్యాంగం ఐక్యత అనే సురక్షా కవచాన్ని అందిస్తే, బిజెపి మాత్రం విభజన రాజకీయాలను, అనుమానాలు, విద్వేష బీజాలను ప్రజల్లో నాటుతోందని విమర్శించారు. అధికార బిజెపి కూటమి తన ఇష్టానుసారంగా రాజ్యాంగాన్ని మార్చేయడం ప్రారంభించిందనీ, కానీ ప్రజలు రాజ్యాంగాన్ని ఇలా మార్చేయడంకోసం ఎన్‌డిఎ కూటమిని గెలిపించలేదని విమర్శించారు. లోక్‌సభలో రాజ్యాంగంపై జరిగిన చర్చలో ప్రియాంకాగాంధీ పాల్గొన్నారు. ''భారత రాజ్యాంగం అంటే న్యాయానికీ, ఐక్యతకూ, భావప్రకటనాస్వేచ్ఛకు ఒక సురక్షణ కవచం'' అని ఆమె లోక్‌సభలో స్పష్టం చేశారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ విషయాన్ని తరువాయి 2లో

## రాజ్యాంగ సూత్రాల ధ్వంసానికి యత్నం

కాంగ్రెస్‌పై రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆగ్రహం



రాజ్యాంగ సూత్రాలను ధ్వంసం చేసేందుకే కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ ప్రయత్నం చేస్తుందని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. 75 సంవత్సరాల రాజ్యాంగ ప్రస్తానంపై లోక్‌సభలో రెండు రోజులపాటు జరిగే చర్చకు శుక్రవారంనాడు రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. కాంగ్రెస్‌పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగంపై తన సత్తాను ప్రదర్శించేందుకే ప్రయత్నం చేస్తూ వచ్చిందని ఆయన విమర్శించారు. బిజెపి ఎల్లప్పుడూ రాజ్యాంగానికి విధేయంగానే వ్యవహరిస్తూ వస్తోందన్నారు. దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్‌పార్టీ అనేకసార్లు రాజ్యాంగాన్ని దుర్మార్గపు ఆలోచనలతో సవరించిందని, క్రమంగా రాజ్యాంగ స్ఫూర్తిని మార్చేసిందని అన్నారు. అవకాశం వచ్చినప్పుడల్లా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగంపై తన తరువాయి 2లో

## 2030 నాటికి 20 గిగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి

దృఢ సంకల్పంతో పనిచేస్తున్నాం : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్

2030 నాటికి 20 గిగా వాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందని, పునరుత్పత్తి (గ్రీన్ పవర్) విద్యుత్ రంగం దిశగా రాష్ట్రం దృఢ సంకల్పంతో పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న 'జాతీయ ఇంధన పొదుపు వారోత్సవా'లలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ పొదుపు వేడుకలు ఘనంగా జరుగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలంగాణ రాష్ట్ర పునరుత్పత్తి విద్యుత్ అభివృద్ధి సంస్థ (టిజిఆర్ఇడిసిఓ) అధికారులు రూపొందించిన 2025 సంవత్సరం విద్యుత్ పొదుపు క్యాలెండర్‌ను డిప్యూటీ సిఎం శుక్రవారం ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ, 2030 నాటికి 20 గిగావాట్స్ పునరుత్పత్తి విద్యుత్, 2035 నాటికి 40 గిగావాట్స్ స్థాపన లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తుందని వెల్లడించారు. విద్యుత్ పొదుపు, విద్యుత్ సమర్థత సాధనకు అన్ని రంగాల్లో టెక్నాలజీ ఆధారిత చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. గత ఏడాదికాలంగా టిజిఆర్ఇడిసిఓ చేపట్టిన కార్యక్రమాలను మేనేజింగ్ డైరెక్టర్ వావిల్ల అనిల డిప్యూటీ సిఎంకు వివరించారు. టిజిఆర్ఇడిసిఓ, విద్యుత్ పొదుపు, విద్యుత్ సమర్థతకు, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బిఇఇ) తో కలిసి వివిధ కీలక కార్యక్రమాలను తరువాయి 2లో



# చంచల్‌గూడ జైలులో అల్లు అర్జున్

- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అరెస్టు
- తాత్కాలిక బెయిల్ ఇచ్చిన హైకోర్టు
- నేడు విడుదల అయ్యే అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

సంధ్య థియేటర్ వద్ద పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి కేసులో సినీనటుడు అల్లు అర్జున్‌ను హైదరాబాద్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నాంపల్లి కోర్టు ఇరువైపుల వాదనలు విన్న మెజిస్ట్రేట్ ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో పోలీసులు అల్లు అర్జున్‌ను సాయంత్రం 6 గంటలకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ లోపు అల్లు అర్జున్ తరపున న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు చివరి నిమిషంలో అల్లు అర్జున్‌కు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అప్పటికే అల్లు అర్జున్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే బెయిల్ పేపర్లు జైలు అధికారులకు రాత్రి 10 గంటల తర్వాత తరువాయి 2లో

## ప్రాణం పోతే కేసు పెట్టొద్దా?

రాజ్యాంగం అందరికీ సమానమే

అందుకు అనుగుణంగా చట్టం పనిచేస్తుంది : సిఎం రేవంత్ రెడ్డి

సినీనటుడు అల్లు అర్జున్ కారులో వచ్చి సినిమా చూసి వెళ్తే ఎటువంటి సమస్య ఉండేది కాదని, కారులో నుంచి బయటికి వచ్చి చేతులు ఊపి హడావిడి చేశారని, దీంతో జనం పెద్ద ఎత్తున ఎగబడ్డారని, ఆ తర్వాత కంట్రోల్ కాలేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే అల్లు అర్జున్‌ను ఈ కేసులో ఎ11 గా నమోదు చేశారన్నారు. ప్రజల ప్రాణం పోతే కేసు పెట్టవద్దా?, సినీ నటులు, రాజకీయ నాయకులకు ప్రత్యేకమంటూ ఏముందని,దేశంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అందరికీ సమానమేనని, దీనికి అనుగుణంగానే చట్టం పని చేస్తుందని సిఎం తెలిపారు. అల్లు అర్జున్‌ను అరెస్టు చేశామని చెబుతున్నారని, ఒక మహిళ చనిపోయిందని, ఆమె కొడుకు ఇంకా జీవన్మరణ సమస్యతో బాధపడుతున్నారని, ఈ ఘటనపైన క్రిమినల్ కేసు నమోదైందని తెలిపారు. 'ఆజ్ తక్ ఇంటర్వ్యూ'లో అల్లు అర్జున్ అరెస్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. మహిళా ప్రాణానికి ఎవరు బాధ్యులని, పది రోజుల తర్వాత పోలీసులు అల్లు అర్జున్ ఇంటికి వెళ్లారన్నారు. తనకు చిన్నప్పటినుంచి అల్లు అర్జున్ తెలుసు అని, అల్లు అర్జున్ మామ చిరంజీవి కాంగ్రెస్ నాయకుడని, అల్లు అర్జున్ కు పిల్లనిచ్చిన మామ చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడని, ఆయన తనకు బంధువు కూడా అని, అల్లు అర్జున్ భార్య తనకు బంధువు అని తరువాయి 2లో



## కులాల లెక్క తేలకుంటే రిజర్వేషన్లు తగ్గొచ్చు

బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సమాచార సేకరణ అధికారికి పూర్తి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

కులాల వారిగా సంఖ్య తెలియకపోతే ఆయా కులాలకు రావాల్సిన సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పథకాలు వారికి న్యాయబద్ధంగా అందాలంటే అన్ని కులాలకు సంబంధించిన సంఖ్య, వారి బలం పూర్తి సమాచారం ఉండాలన్నారు. ఒక వేళ సమాచార సేకరణాధికారి ఇంటికి రాకపోతే,వెంటనే వారిని పిలిచి పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని మంత్రి కోరారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో తెలంగాణ తరువాయి 12లో

## అవిశ్వాసంపై రాజ్యసభలో రగడ

సోమవారానికి సభ వాయిదా



**న్యూఢిల్లీ :** ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్‌పై ప్రతిపక్షాలు అభిశంసన కోరడం రాజ్యసభలో గందరగోళానికి దారితీసింది. ప్రతిపక్షం, అధికార పక్షం మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. చైర్మన్ కూడా ఈ అంశంలో పూర్తిగా మునిగిపోయారు. ఈ వివాదంతో పాటు అదానీ వివాదంపై దుమారం చెలరేగడంతో సభా కార్యక్రమాలు మొదటి శుక్రవారం ఉదయం ప్రారంభమైన మొదటి గంటలోనే వాయిదా పడ్డాయి. తాను ధన్‌ఖడ్ కంటే ముందు రైతు బిడ్డనని, బలహీనతను చూపబోనని రాజ్యసభ చైర్మన్ పేర్కొన్నారు. 'చైర్మన్‌కు వ్యతిరేకంగా రోజురోజుకూ ప్రచారం జరుగుతోంది. ఇది నాకు వ్యతిరేకంగా చేస్తున్న ప్రచారం కాదు, నా వర్గానికి వ్యతిరేకంగా చేస్తున్న ప్రచారం' అని ఆయన అన్నారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా ప్రధాన ప్రతిపక్షం ప్రచారం చేయడంతో తాను తీవ్రంగా బాధపడ్డానని, తనపై తీర్మానం పెట్టే హక్కు వారికి ఉందని, అది వారికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, కానీ వారు రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. ఉదయం 11.45 గంటలకు సభను సోమవారానికి వాయిదా వేయడానికి ముందు సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే, సభా నాయకుడు జెపి నడ్డా తన ఛాంబర్‌కు రావాల్సిందిగా చైర్మన్ విజ్ఞప్తి చేశారు. 'దయచేసి తరువాయి 12లో




## 'ఒకే దేశం– ఒకే ఎన్నిక'తో... నియంత పాలన!

జమిలి ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం

బలమైన ఉద్యమ నిర్మాణమే అమరులకు నివాళి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్

జమిలి ఎన్నికలు జరపాలనుకోవడం దేశ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. జమిలి తరువాయి 2లో

## 'గాంధేయ మార్గం'లో కొనసాగించండి

పంజాబ్-హర్యానా సరిహద్దులో నిరసనలు చేపడుతున్న రైతులకు సుప్రీంకోర్టు 'మార్గనిర్దేశం'

రైతునేత డల్లేవాల్ నిరాహారదీక్షను తక్షణం విరమింపజేసి.. తగిన వైద్యం అందించాలని ఆదేశం



**న్యూఢిల్లీ :** రైతులు, రైతు నేతల ఆందోళన, ప్రాణం విలువ పట్ల కేంద్ర ప్రభుత్వం, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయకుండా భేషజాలకు పోతున్నా సుప్రీంకోర్టు మాత్రం జాలి చూపించింది. పంజాబ్ రైతు నాయకుడు డల్లేవాల్ ఆరోగ్యం క్షీణించడం పట్ల అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. పంజాబ్‌హర్యానా సరిహద్దులో పక్షం రోజులపాటు నిరవధిక నిరాహారదీక్ష చేయడంతో ఆరోగ్యం క్షీణించిపోతున్న పంజాబ్ రైతు నాయకుడు జగ్‌జిత్‌సింగ్ దల్లేవాల్‌కు తక్షణమే వైద్య సహాయం అందించాలని, నిరసన తెలియజేస్తున్న రైతులు గాంధేయ మార్గాన్ని అనుసరించాలని శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఖనౌరీ తరువాయి 12లో

## కేసు పెట్టొద్దా?

(మొదటి పేజీ తరువాయి)

సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. హోం శాఖ తన వద్దనే ఉన్నదని, ఈ కేసుకు సంబంధించిన నివేదిక తన వద్ద ఉన్నదన్నారు. చనిపోయిన మహిళ కొడుకు ఇంకా కోమాలో ఉన్నారన్నారు. సినిమా కోసం పైసలు పెట్టారని, ఇప్పుడు ఆ పైసలు సంపాదించారని,కానీ వాళ్లు ప్రత్యేకంగా దేశం కోసం చేసింది ఏమీ లేదని చెప్పారు.
భారతదేశంలో సల్మాన్ ఖాన్ సంజయ్ దత్‌ను ఎందుకు అరెస్ట్ అయ్యారని సిఎం ప్రశ్నించారు. కేసు పెట్టకపోతే తమను ప్రశ్నించరా.? అని అన్నారు. తన ఫేవరెట్ హీరో కృష్ణ అని ఆ హీరో చనిపోయారని,ఇప్పుడు తానే స్టార్‌ను అని తనకే ఫాన్స్ ఉంటారని అన్నారు. పుష్ప2 బెనిఫిట్ షోకు తామే అనుమతి ఇచ్చామని, సరైన ఏర్పాట్లు లేకుండా అల్లు అర్జున్‌నే థియేటర్ కు వచ్చారని వివరించారు. తాము కావాలని సినిమా నటుడిని అరెస్టు చేశారని చర్చ మొదలు పెట్టారని, ఆయన సినిమా స్టారా? పొలిటికల్ స్టారా? అనేది తమ ప్రభుత్వం చూడబోదని, నేరం ఎవరు చేశారనే విషయాన్ని మాత్రమే చూస్తామని వివరించారు. అల్లు అర్జున్ సినిమా చూడాలనుకుంటే స్టూడియోలో స్పెషల్ షో వేసుకుని చూడొచ్చని, లేదా ఇంట్లో కూర్చొని కూడా చూడొచ్చని, ప్రేక్షకులు, అభిమానులతో కలిసి చూడాలనుకుంటే, ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదంటే, సినిమా హాల్ మేనేజ్‌మెంట్‌కు సమాచారం ఇస్తే, వాళ్లు ఏర్పాట్లు చూసుకుంటారని వివరించారు. ఉన్నపలంగా వచ్చేస్తే కొద్దిమంది సిబ్బందితో పోలీసులు ఎలా సిద్ధంఅవుతారని సిఎంరేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

## రూ.1800 కోట్లివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ఖు సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**రుణాల రికవరీపై పునర్ సమీక్షించాలి**

విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుంచి ఏకపక్షంగా రూ.2,547.07 కోట్ల రికవరీకి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఆదేశాలు ఇచ్చిందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు.
ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీవ్ర నిరసన తెలిపినా పట్టించుకోలేదని, ఈ విషయంపై మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన నిధులన్నింటిని 201415లో కేవలం ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన విషయాన్ని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పునర్‌విభజన చట్టంలోని జనాభా ప్రాతిపదికన ఆ మొత్తంలో ఎపి నుంచి తెలంగాణకు రూ.495.20 కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉందని సిఎం తెలిపారు.

**కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పండి**

కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. రాష్ట్ర పునర్‌విభజన చట్టంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటును పొందుపర్చిన విషయాన్ని కేంద్ర మంత్రికి సిఎం గుర్తు చేశారు. కాజీపేటలో పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ (పిఓహెచ్) వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఆ తర్వాత సైతం కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోరుతూ తాను లేఖ రాశానని సిఎం వివరించారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అనేది కాజీపేట వాసుల కల మాత్రమే కాదని, యావత్ తెలంగాణ స్వప్నమని సిఎం కేంద్ర మంత్రికి వివరించారు. వికారాబాద్‌కృష్ణా స్టేషన్ మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలు మార్గం నిర్మించాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సిఎం రేవంత్‌రెడ్డి కోరారు. కల్వకుర్తిమాచర్ల మధ్య నూతన రైలు మార్గం మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రిని సిఎం కోరారు. కల్వకుర్తి నుంచి వంగూరు కందుకూరు దేవరకొండ చలకుర్తితిరు మలగిరి మీదుగా మాచర్ల వరకు తాము ప్రతిపాదించే నూతన మార్గం ప్రతిపాదిత గద్వాలడోర్నకల్, ఇప్పటికే ఉన్న మాచర్ల మార్గాలను అనుసంధానిస్తుందని సిఎం కేంద్ర మంత్రికి వివరించారు.
డోర్నకల్–మిర్యాలగూడ (పాపటపల్లి–జాన్ పహాడ్), డోర్నకల్–గద్వాల ప్రతిపాదిత రైలు మార్గాలను పునఃపరిశీలించాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ రెండు రైలు మార్గాలు ఖమ్మం జిల్లాలోని సారవంతమైన భూములు, చెరకు పరిశ్రమలు, గ్రానైట్ పరిశ్రమలు, సైబీరియన్ వలస పక్షుల కేంద్రం, భారతదేశంలోని అతి పెద్ద బౌద్ధ స్తూపం, పాలేరు రిక్రియేషన్ ప్రాంతాల మీదుగా ఉన్నాయని సిఎం తెలిపారు. ఇక్కడ విలువైన భూముల సేకరణ రైల్వే శాఖకు భారంగా మారుతుందని, ఆ ప్రతిపాదిత మార్గాలను మార్చి డోర్నకల్ నుంచి వెన్నారంమన్నెగూడెం అబ్బాయిపాలెంమరిపెడ మీదుగా మోతె వరకు రైల్వే లైన్లను మార్చాలని సిఎం కోరారు. ఈ ప్రాంతాలు పూర్తిగా వెనుకబడి ఉన్నాయని, రైలు మార్గాలు కూడా లేవని తెలిపారు.
ఈ రెండు మార్గాల అలైన్‌మెంట్‌ను పునర్ పరిశీలించాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి వెంట ఎంపిలు డాక్టర్ కడియం కావ్య, డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, సురేష్ షెట్కార్, గడ్డం వంశీకృష్ణ, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్ యాదవ్ ఉన్నారు.

## గ్రీన్ పవర్ ఉత్పత్తి

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఎనర్జీ కన్సర్‌వేషన్ బిల్డింగ్ కోడ్ (ఇసిబిసి) అమలులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, ఈ కోడ్ ప్రకారం 879 కమర్షియల్ భవనాలు ఇసిబిసి అనుగుణంగా మార్పు చెందడంతో 392.21 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా జరిగిందని వివరించారు. తెలంగాణ కూల్ రూఫ్ పాలసీ 2023–28 దేశంలోనే మొట్టమొదటి పాలసీ అని, ఇది వేసవి కాలంలో తాపాన్ని తగ్గించి శక్తి వినియోగాన్ని తగ్గిస్తుందని వివరించారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మీడియా ద్వారా విస్తృత ప్రచారం, విద్యుత్ ర్యాలీలు, చర్చలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సిఎంకు వివరించారు. కార్యక్రమంలో టిజి రెడ్కో జిఎం జిఎస్‌వి.ప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

## జైలులో అల్లు అర్జున్


(మొదటి పేజీ తరువాయి)

చేరాయి. జైలు నిబంధనల ప్రకారం ఆ సమయంలో విడుదల చేయడం కుదరదు. దీంతో శుక్రవారం రాత్రి అతను జైలులోనే ఉండాల్సి వచ్చింది. శనివారం జైలు నుంచి విడుదలయ్యే అవకాశాలున్నాయి.
ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఉదయం 8 గంటలకే అతని ఇంటి వద్దనే చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆ తరువాత గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. మరోవైపు, తనపై చిక్కడపల్లిలో నమోదైన కేసును కొట్టివేయాలంటూ అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు జరిగాయి. క్వాష్ పిటిషన్ అత్యవసరమేమీ కాదని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.
దీంతో క్వాష్ పిటిషన్‌లోనే మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి హైకోర్టును కోరారు. సుదీర్ఘ వాదనల అనంతరం అల్లు అర్జున్కు హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జైలు సూపరింటెండెంట్‌కు సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. ఈ ఘటనకు ఒక్కరినే బాధ్యుడిగా చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందారు.
ఈ ఘటనకు సంబంధించి చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. అల్లు అర్జున్, ఆయన టీమ్, సంధ్య థియేటర్ యాజమాన్యంపై కేసులు నమోదు చేశారు.

# 2024లో 54 మంది జర్నలిస్టులు మృతి: ఆర్‌డబ్ల్యుబి

### గాజా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలోనే ఎక్కువ మరణాలు

**పారిస్:** ప్రపంచవ్యాప్తంగా 2024వ సంవత్సరంలో డిసెంబరు 1వ తేదీ వరకూ వేసిన గణాంకాల ప్రకారం 54 మంది జర్నలిస్టులు విధి నిర్వహణలో మరణించారు. వీరిలో ఎక్కువమంది ఇజ్రాయెల్ చేసిన గాజా దాడులలో మరణించారు. ప్రభుత్వేతర స్వచ్ఛంధ సంస్థ రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ (ఆర్‌డబ్ల్యుబి) ఎన్‌జిఓ శుక్రవారంనాడు ఈ విషయం వెల్లడించింది. ఏడాదిలో జరిగిన జర్నలిస్టుల మరణాల్లో గాజా ప్రాంతం ప్రథమస్థానంలో ఉండగా, ఏడుగురు జర్నలిస్టుల మరణాలతో పాకిస్థాన్ రెండోస్థానంలో, ఐదుగురు జర్నలిస్టుల మరణాలతో బంగ్లాదేశ్, మరో ఐదుగురు జర్నలిసుట్ల మరణాలతో మెక్సికో మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి. అదేవిధంగా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌జె) ప్రత్యేకంగా గడచిన మంగళవారంనాడు విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 104 మంది జర్నలిస్టులు విధి నిర్వహణలో మరణించారు. వీరిలో సగానికి సగంమంది గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో మరణించారని ఐఎఫ్‌జె ప్రకటించింది. ఐతే జర్నలిస్టు సంఘాలు చేసిన ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. తాము చేసిన గగనతలదాడుల్లో కొంతమంది జర్నలిస్టులు మరణించి ఉండవచ్చుగానీ, సంఖ్య ఈ స్థాయిలో లేదని బుకాయించింది. ఈ గణాంకాలను తాము సమ్మతించడంలేదని ఇజ్రాయెల్ ప్రభుత్వ అధికార ప్రతినిధి డేవిడ్ మెర్సర్ బుధవారంనాడు పత్రికాగోష్టిలో బుకాయించారు. ఈ గణాంకాలను తాము విశ్వసించడంలేదన్నారు. ప్రెస్ ఫ్రీడమ్ ఎన్‌జిఓ ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ ఏడాది ఇజ్రాయెల్ సైన్యం కారణంగా గాజాలో 18 మంది ప్రపంచస్థాయి జర్నలిస్టులు మరణించారు. వీరిలో 16 మంది గాజాలో, ఇద్దరు జర్నలిస్టులు లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో మరణించారు. ప్రపంచవ్యాప్తంగా గమనించినప్పుడు జర్నలిస్టులకు వృత్తిపరంగా అత్యంత సవాలుగా, హింసాత్మకంగా, ప్రాణాంతకంగా మారినదేశం పాలస్తీనా అని ఈ ఏడాది నివేదికలో వెల్లడైంది. గాజాలో ఇజ్రాయెల్ విచక్షణారహిత దాడుల కారణంగా వందలమంది స్థానిక పాలస్తీనా జర్నలిస్టులు కుటుంబాలతోసహా మరణించారు. గడచిన ఐదు సంవత్సరాలలో ఎన్నడూలేనివిధంగా పాలస్తీనా భూభాగం జర్నలిస్టులకు అత్యంత ప్రాణాంతక ప్రదేశంగా మారింది. అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిసి)లో కూడా అంతర్జాతీయ జర్నలిస్టుల సంఘం మూడు కేసులను ఇజ్రాయెల్ సైన్యంపై నమోదు చేసింది. యుద్ధనేరాలకు పాల్పడిందని, జర్నలిస్టులను పొట్టనపెట్టుకుందని ఐసిసికి ఫిర్యాదు చేసింది. 2023 అక్టోబరు 7వ తేదీన గాజాలో యుద్ధం ప్రారంభమైనప్పటినుండీ ఇజ్రాయెల్ ఆర్మీ దాడుల్లో ఇప్పటివరకూ పాలస్తీనా భూభాగంలో 145 మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని ఆర్‌డబ్ల్యుబి ఫిర్యాదు చేసింది. వీరిలో 35 మంది జర్నలిస్టులు విధులు నిర్వర్తిస్తుండగా ఇజ్రాయెల్ సైన్యం చేతిలో మరణించారు.








# గాజాలో శాంతికి హమాస్ సానుకూల సంకేతాలు!

### శరణార్థ శిబిరంపై ఐడిఎఫ్ దాడి: 33 మంది మృతి



**గాజా:** అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, టర్కీ విదేశాంగమంత్రి హకన్ ఫిదాన్‌లు సమావేశమై గాజాలో శాంతిసాధన, భవితవ్యం గురించి చర్చించారు. ప్రధానంగా బందీల విడుదల, కాల్పుల విరమణ ఒప్పందం, ఇతర సమస్యను చర్చించారు. శుక్రవారంనాడు టర్కీ రాజధాని అంకారాలో వీరిద్దరి మధ్యా ఈ చర్చ జరిగింది. గడచిన రెండు వారాలలో ఎంతో ప్రోత్సాహకరమైన వాతావరణం కనిపిస్తోందని ఈ సందర్భంగా నాయకులు ఇద్దరూ అభిప్రాయం వ్యక్తం చేశారు. టర్కీ దేశాధ్యక్షుడు ఎర్డొగాన్, విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్‌లతో జరిగిన చర్చల సందర్భంగా, హమాస్ సంస్థ గాజాలో యుద్ధ విరమణకు ఎంతో సానుకూలంగా ఉన్నట్లు తేటతెల్లమవుతున్నదని ఆంటోనీ బ్లింకెన్ చెప్పారు. ఈ చర్చల్లో టర్కీ హమాస్‌పై తన ప్రభావాన్ని బాగా చూపిస్తోందని అన్నారు. ఖతార్ బహిష్కరించిన తర్వాత పెద్దసంఖ్యలో హమాస్ అధికారులు టర్కీకి రాకపోకలు ఎక్కువగా కొనసాగిస్తున్నారు. ఇక బైడెన్ అధికారంలో కొనసాగే రానున్న కొద్దిరోజుల్లో బందీల విడుదల, కాల్పుల విరమణకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు అమెరికా జాతీయ భద్రతాసలహాదారు జాక్ సుల్లివాన్ సంకేతాలు ఇస్తున్నారని బ్లింకెన్ అన్నారు.
ఇదిలా ఉండగా, సెంట్రల్‌గాజాలో ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడుల్లో 33 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 50 మంది గాయపడ్డారు. సెంట్రల్‌గాజాలోని నుసైరత్ శరణార్థ శిబిరంపై ఇజ్రాయెల్ సైన్యం గగనతల దాడులు చేసింది. సర్వంకోల్పోయిన పాలస్తీనా ప్రజలు ఒక పోస్టాఫీసులో తలదాచుకుంటున్నారు. ఇజ్రాయెల్ సైన్యం ఈ పోస్టాఫీసుపై దాడిచేసింది. దీంతోపాటు సమీపంలో చుట్టుపక్కల నివాసాలపై కూడా దాడులు చేసింది. కుప్పకూలిన శిథిలాలమధ్య నడివయస్కులైన పిల్లల శరీరాలు మాంసం ముద్దల్లా పడి ఉన్నాయని రాయిటర్స్ వార్తాసంస్థ తెలియజేసింది. 1948లో పాలస్తీనాలో ఏర్పడిన చరిత్రాత్మకమైన ఎనిమిది శరణార్థ శిబిరాలలో నుసైరల్ శరణార్థ శిబిరం కూడా ఒకటి.

# ప్రపంచం దృష్టి సిరియాపైనే

### తొలి శుక్రవారం ప్రార్థనలు

**డమాస్కస్ :** సిరియాలో తండ్రీకొడుకుల 53 సంవత్సరాల పరిపాలన ముగిసిన ఆరు రోజుల తర్వాత మొదటి శుక్రవారం ప్రార్థనలు అత్యుత్సాహంగా జరిగాయి. వేలాదిమంది ప్రజలు ప్రార్థనల నిమిత్తం వీధుల్లోకి వచ్చారు. సిరియా కొత్త ప్రభుత్వానికి చైనా తన పూర్తి మద్దతు తెలియజేసింది. ప్రజల ఆశయాలు, వారి కోరికలు నెరవేర్చేందుకు, దేశాన్ని పునర్నిర్మించేందుకు ఒక సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని అందుకు తమదేశం మద్దతు ఇస్తుందని చైనా విదేశాంగశాఖా మంత్రి వాంగ్ యీ శుక్రవారంనాడు సిరియాకు తెలియజేశారు.
దేశం నుండి పారిపోయి పొరుగుదేశాల్లో తలదాచుకుంటున్న లక్షలాదిమంది శరణార్థులను తిరిగి దేశానికి రప్పించడమే తన ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ కార్యాలయాలను యథాతథంగా పనిచేయించడమే తన ప్రథమ కర్తవ్యమని కొత్త ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అల్ బషిర్ ప్రతిజ్ఞ చేశారు. పొరుగున ఉన్న ఈజిప్టులో 30 లక్షలమంది సిరియా ప్రజలు తలదాచుకుంటున్నారు. అల్ అస్సాద్ ప్రభుత్వం పతనమైందనీ, ఆయన కుటుంబంతోసహా రష్యాకు పారిపోయాడని తెలిసిన తర్వాత పొరుగున టర్కీలో తలదాచుకున్న లక్షలాదిమంది సిరియన్ ప్రజలు వీధుల్లోకి వచ్చి సంబురాలు చేసుకున్నారు. ఇప్పుడు సిరియా సమస్యపైనే ప్రధానంగా ప్రపంచ దేశాలు దృష్టిపెట్టి ఆలోచిస్తున్నాయి. ఇక సిరియాలో ప్రధాన రాష్ట్రమైన అలెప్పో తిరిగి సాధారణస్థితికి చేరుకుంటున్నది. ఈనెలారంభంలో తిరుగుబాటుదారులు పక్క ప్రణాళికలో ప్రభుత్వసైన్యంపై దాడులుచేసి వారిని హతమార్చి అలెప్పోను స్వాధీనం చేసుకోవడంతో సిరియా చరిత్ర మలుపు తిరిగింది. ఆ తర్వాత వారం రోజులకే దేశాధ్యక్షుడు అల్ అస్సాద్ ప్రభుత్వం పతమైంది. అలెప్పోలో అస్సాద్ పరిపాలనాకాలంనాటి అవశేషాలను తొలగించేపనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయని, ప్రజలు సాధారణ జీవితంలోకి వెళుతున్నారని అంతర్జాతీయ జర్నలిస్టులు తాజా నివేదికలు సమర్పించారు. ఈ తిరుగుబాటుద్వారా అవతరించిన కొత్త నాయకుడు అహ్మద్ అల్ షారా (అబూ మహ్మద్ అల్ జొలానీ) అల్ అస్సాద్ స్థానంలో సిరియా దేశాధిపత్యం సాధించారు. పాత ప్రభుత్వాన్ని కూల్చివేశారు. జొలానీ నాయకత్వంలో హయత్ తహ్రిర్ అల్–షామ్' ఉగ్రవాద సంస్థ (హెచ్‌టిఎస్) ఇతర ఉగ్రవాద సంస్థలను కూడా కలుపుకుని అస్సాద్ ప్రభుత్వాన్ని కూల్చివేసింది. అల్ బషిర్‌ను ఆయన కొత్త ప్రధానమంత్రిగా నియమించారు.ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ ప్రభుత్వం ఒక ప్రకటన చేస్తూ, తమ సైన్యం గురువారంనాడు సిరియాకు చెందిన గగనతలక్షిపణి వ్యవస్థలను 90 శాతం మేరకు ధ్వంసం చేశామని పేర్కొంది. భూతలం నుండి గగనతలానికి ప్రయోగించే సిరియా క్షిపణి వ్యవస్థలను ధ్వంసం చేశామని ప్రకటించింది.



## నియంత పాలన!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల వలన లాభాల కంటే నష్టాలే ఎక్కువ ఉన్నాయని బిజెపి అధికార కాంక్షతోనే జమిలి ఎన్నికలను ఎజెండా మీదకు తీసుకు వచ్చిందని ఆయన ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా సమితి సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ఎన్నిక అనే నినాదం కారణంగా నిరంకుశత్వం పెరిగి నియంత పాలనకు దారి తీసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రాంతీయ పార్టీలకు ముఖ్యంగా రాష్ట్రాలకు సంబంధించి హక్కులకు భంగం కలిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జమిలి ఎన్నికలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని కూనంనేని తెలిపారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన అనేక అంశాలను విషయంలో న్యాయ స్థానాల తీర్పులు సైతం చర్చనీయాంశమవుతున్నాయని ఆయన తెలిపారు. కొన్ని అంశాలకు సంబంధించి సానుకూల తీర్పులొస్తున్నా మొత్తంగా ప్రజాభిప్రాయాన్ని ప్రస్ఫుటింపజేయడం లేదని ఆయన అన్నారు. ఇటీవల జరిగిన కొన్ని రాష్ట్రాల ఎన్నికలను పరిశీలించినప్పుడు ఈవిఎం దుర్వినియోగానికి సంబంధించి పలు ఆరోపణలు వచ్చాయని మారిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం నేపథ్యంలో ఈవిఎంల ట్యాంపరింగ్‌లకు అవకాశం ఉందని అభివృద్ధి చెందిన దేశాలు సైతం బ్యాలెట్‌ను ఉపయోగిస్తున్న విషయాన్ని కూనంనేని గుర్తు చేశారు. బిజెపి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతుందని కులాన్ని కాదంటూనే మతాన్ని రెచ్చగొడుతుందని ఆయన ఆరోపించారు. మత ఉన్మాదం దేశానికి ప్రమాదకరంగా పరిణమించిందని లౌకిక ప్రజాస్వామిక శక్తులతో కలిసి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని కూనంనేని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలను చీల్చడం ప్రాంతీయ పార్టీలను దెబ్బ తీయడం ద్వారా బిజెపి రాష్ట్రాలలో గెలుపు సాధిస్తుందని మహారాష్ట్రలో శివసేనను చీల్చి అదే చీలక వర్గానికి మొండి చేయి చూపిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ప్రజల తీర్పులు పరిశీలిస్తే కొన్ని అధికారానికి వ్యతిరేకంగా మరికొన్ని చోట్ల స్వేచ్ఛ అనుకూలంగా తీర్పులొచ్చాయన్నారు. దేశంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని కమ్యూనిస్టుల అవసరాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. ఈ దశలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా పనిచేయాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిస్తుందన్నారు. ప్రజల సమస్యలు అభిప్రాయాలకనుగుణంగా ఐక్య ఉద్యమ నిర్మాణం అవసరమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతంలోకి అడుగిడుతున్న వేళ పార్టీ నిర్మాణం పై దృష్టిసారించాలని సాంబశివరావు కోరారు. బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణమే అమరులకు మనమిచ్చే నివాళి అని కూనంనేని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపైన గ్రామస్థాయి నుంచి ప్రజా ఆందోళనలు ఉద్యమాలు చేపట్టాలన్నారు. పార్టీ శతజయంతి ప్రారంభ సభ ఈనెల 30న నల్లగొండలో జరుగుతుందని జాతీయ స్థాయి ముగింపు సభ 2025 డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగుతుందని ఈ సందర్భంగా రెండు లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు కూనంనేని తెలిపారు. సమావేశానికి ముందు ఇటీవల మృతిచెందిన సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌కు, వివిధ స్థాయిల్లో పనిచేసి మృతిచెందిన వారికి నివాళులర్పించారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల నివేదికను దండి సురేష్ ప్రవేశపెట్టారు.

**సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

విద్యాశాఖలో సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగీకరించిన న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి జాప్యమెందుకని ఆయన ప్రశ్నించారు.
కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిఆర్‌పి ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులకు కూనంనేని సాంబశివరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సెలవులను కస్తూర్బా బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని బోధన, బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు వారం రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమన్నారు.

## సంఘ్ రూల్‌బుక్ కాదు

(మొదటి పేజీ తరువాయి)

అర్థం చేసుకోకుండా గడచిన పది సంవత్సరాలుగా భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించేందుకు, విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నం చేస్తూనే ఉందని విమర్శించారు. ప్రతిపక్షాలు ఉమ్మడిగా దేశంలో ప్రస్తావిస్తున్న డిమాండ్లను, కీలకమైన నినాదాలను ఆమె ఈ సందర్భంగా ఉటంకించారు.
అదేవిధంగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌పై కూడా తీవ్ర స్థాయిలో ఆమె విమర్శలు గుప్పించారు. కేంద్రంలో ఉన్న అధికారపార్టీ తరచు గతం గురించి మాత్రమే విమర్శలు చేస్తోందనీ, కానీ వర్తమానంలో ప్రజలకోసం అధికారపార్టీ ఏం చేస్తోందో మాత్రం చెప్పడంలేదని ప్రియాంకాగాంధీ విమర్శించారు. ''అసలు మీ బాధ్యత ఏమిటి? లేకపోతే బాధ్యత అంతా జవహర్‌లాల్ నెహ్రూమీదే ఉందని అనుకుంటున్నారా?'' అని ఆమె బిజెపి కూటమిని నిలదీశారు. దేశ మొదటి ప్రధానమంత్రి నెహ్రూపై మోదీ పదే పదే చేస్తున్న విమర్శలపై ప్రియాంకాగాంధీ పైవిధంగా నిలదీశారు. ''మన భారత రాజ్యాంగంలో ఆర్థిక న్యాయం చేయడానికి మూలాలు ఉన్నాయి. రైతులకు భూమి పంపిణీ చేయాలి,పేదలకు, అవసరార్థులకు భూమిని ఇవ్వాలి...ఎవరైతే ఈనాడు ప్రతిసారీ ఒక నాయకుడు (జవహర్‌లాల్‌నెహ్రూ) పేరును వారి ప్రయోజనాలకోసం ఉపయోగించుకుంటూ విమర్శలు చేస్తున్నారో, ఆ నాయకుడే దేశంలో అనేక ప్రభుత్వ రంగ పరిశ్రమలు సృష్టించాడు, హాల్, భెల్, సెయిల్, గెయిల్, ఓఎన్‌జిసి, ఎన్‌టిపిసి, రైల్వేలు, ఐఐటి, ఐఐఎం వంటి అనేక సంస్థలను సృష్టించాడు'' అని ప్రియాంకాగాంధీ గుర్తుచేశారు. ''కానీ ఇప్పుడు పుస్తకాల్లోంచి ఆయన పేరు చెరిపేయాలనుకుంటున్నారు, కానీ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్రను జాతి నిర్మాణంలో ఆయన పాత్రను ఎవరూ చెరిపేయలేరు, ఈ దేశంలోంచి ఎన్నటికీ చెరిపేయలేరు'' అని ప్రియాంకా గాంధీ తన తాతగారి ఘనతను చాటిచెప్పారు. ఎమర్జెన్సీపై చేస్తున్న విమర్శలకు కూడా ఆమె సమాధానం చెప్పారు. బిజెపి దాని నుండి గుణపాఠాలు నేర్చుకోవాలని, తాను చేసిన తప్పులకుగాను క్షమాపణలు చెప్పాలని అన్నారు. ''అధికారపార్టీలో నా సహచరులు గతాన్ని తిరగదోడుతున్నారు, ఇలా జరిగింది, అలా జరిగిందీ అంటున్నారు, 1975లో ఏం జరిగింది? మీరు కూడా అందులోంచి గుణపాఠాలు నేర్చుకోవాలి, మీరు కూడా మీరు చేసిన తప్పులకు క్షమాపణలు చెప్పాలి, మీరు రాజకీయ న్యాయం గురించి మాట్లాడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నికల ద్వారా ప్రభుత్వాలకు అధికారాన్ని కట్టబెడతారు, మీ ప్రభుత్వాలన్నీ ధనబలంపైనే ఆధారపడి ఉన్నాయి, నేను మరో ఉదాహరణ చెబుతాను, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో రాజ్యాంగం అమలులో లేదు'' అని ప్రియాంకా గాంధీ విమర్శించారు. ''దేశానికి ఇచ్చిన ఐక్యత అనే సురక్షా కవచ్చాన్ని విచ్ఛిన్నం చేశారు, రాజ్యాంగాన్ని ఆయన తలకేసి బాదుకుంటున్నారు, కానీ మణిపూర్‌లో, సంభాల్‌లో, హత్రాస్‌లో న్యాయం కావాలని ఎంతగా అరిచి నాగానీ ఏదీ ఆయన బుర్రకు ఎక్కడంలేదు, భృకుటి ముడిచి ఆ సమస్యలకేసి తీక్షణంగా ఆయన చూడటంలేదు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాజ్యాంగాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నట్లు లేదు, రాజ్యాంగం అంటే సంఘపరివార్ నిబంధనావళి కాదు'' అని ప్రియాంకాగాంధీ విమర్శించారు. ''ఈరోజున ప్రజలు నిజం మాట్లాడటానికి భయపడుతున్నారు, ఒక జర్నలిస్టు కావచ్చు, ప్రతిపక్ష నాయకుడు కావచ్చు, ఒక ప్రొఫెసర్ కావచ్చు, ప్రతిఒక్కరూ నోరు మూసుకుంటున్నారు, ప్రతిపక్ష నాయకులపై ఇడి, సిబిఐ, ఐటి దాడులు చేస్తున్నారు, వారిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు, ఈ ప్రభుత్వం ఎవ్వరినీ వదిలిపెట్టడంలేదు, ప్రభుత్వ అనుకూల మీడియా యంత్రాంగం విస్తరించింది, ఆరోపణలు చేస్తోంది, ఐతే దేశం ఎప్పటికీ పిరికిపందల చేతుల్లో ఉండదు, దేశం తల ఎత్తుతుంది, పోరాటం చేస్తుంది, న్యాయాన్ని అడగుతుంది'' అని ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.

**మైనారిటీలను దిగజార్చే యత్నం :అఖిలేశ్ యాదవ్**

మైనారిటీ వర్గాలను ద్వితీయశ్రేణి పౌరులస్థాయికి దిగజార్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని సమాజ్‌వాదీపార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. 75 సంవత్సరాల భారత రాజ్యాంగ ప్రస్తానంపై చర్చ సందర్భంగా శుక్రవారంనాడు లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా ముస్లింలను ద్వితీయశ్రేణి పౌరులస్థాయికి దిగజార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. వారి హక్కులను, వారి ఆస్తులను ఒక పద్ధతిప్రకారం హరించివేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం దేశంలో అసమానతలను పెంచిపోషిస్తోందనీ, రాజ్యాంగ హక్కులు రక్షించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాజ్యాంగం అంటే నిజమైన రక్షకురాలు, అది మనకు ఎప్పుడైనా అవసరం ఐతే బలం చేకూరుస్తుంది,కానీ రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారు, నిర్లక్ష్యం చేస్తున్నారు, అణచివేస్తున్నారు, అణగారిన వర్గాలను దూరం చేస్తున్నారు, రాజ్యాంగ రక్షణ జీవన్మరణ సమస్యగా మారింది'' అన్నారు. ప్రభుత్వం మైనారిటీ వర్గాలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 20 కోట్లకంటే ఎక్కువగా ఉన్న మైనారిటీ జనాభాను ద్వితీయశ్రేణి పౌరులుగా దిగజార్చేందుకు యత్నిస్తున్నారన్నారు. దేశంలో కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. న్యాయ సాధనలో ఉన్న లొసుగులను, లోటుపాట్లను ఈ కులగణన భర్తీ చేయగలదన్నారు.

## ప్రతిపక్షాల నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ యాదవ్‌పై అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టడం కోసం నోటీసు ఇచ్చారు.
విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ యాదవ్ చేసిన ప్రసంగం 'భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించేలా ద్వేషపూరిత ప్రసంగం, మత సామరస్యాన్ని రెచ్చగొట్టేలా' ఉందని నోటీసులో పేర్కొన్నారు.ఆయన మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నారని, వారికి వ్యతిరేకంగా పక్షపాతాన్ని ప్రదర్శించినట్లు న్యాయమూర్తి ప్రాథమికంగా వెల్లడైందని నోటీసులో పేర్కొన్నారు. న్యాయ జీవిత విలువల పునరుద్ధరణ, 1997ను ఉల్లంఘిస్తూ, కామన్ సివిల్ కోడ్ నియమావళికి సంబంధించిన రాజకీయ విషయాలపై జస్టిస్ యాదవ్ బహిరంగ చర్చకు దిగారని లేదా బహిరంగంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారని పేర్కొన్నారు. న్యాయమూర్తి బహిరంగ వ్యాఖ్యలు ఉద్రేకపూరితమైనవని, పక్షపాతంతో ఉన్నాయని, నేరుగా మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకున్నాయని నోటీసులో వివరించారు.జస్టిస్ యాదవ్ తన ఉపన్యాసంలో 'భారతదేశంలోని మెజారిటీ అభిప్రాయం ప్రకారం దేశం పని చేస్తుంది' అని పేర్కొన్నట్లు తెలిపారు. 'న్యాయమూర్తి యాదవ్ చర్యలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ (ఇ) కింద పొందుపరచబడిన ఆదేశిక సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని, ఆ ఆర్టికల్ ప్రకారం ప్రకారం సామరస్యాన్ని ప్రోత్సహించడం , వ్యక్తుల గౌరవాన్ని కించపరిచే పద్ధతులను త్యజించడం తప్పనిసరి' అని అభిశంసన నోటీసులో ఎంపిలు పేర్కొన్నారు. ఈ ప్రకటనలు విస్తృతంగా ప్రచురితమై వివిధ మతాలు, మత సమూహాల మధ్య శత్రుత్వం , విభజనను ప్రోత్సహించాయని, భారత రాజ్యాంగంలోని లౌకిక తత్వానికి విరుద్ధంగా ఉన్నాయని వారు తెలిపారు.తమ తీర్మానాన్ని అంగీకరించి, న్యాయమూర్తుల (విచారణ) చట్టం, 1968 ప్రకారం గౌరవనీయులైన రాష్ట్రపతికి పంపాలని, ద్వేషపూరిత ప్రసంగం, మత సామరస్యానికి సంబంధించిన ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని, చైర్మన్‌ను అభ్యర్థిస్తున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. ఆరోపణలు రుజువైతే జస్టిస్ యాదవ్‌ను పదవి నుంచి తొలగించేందుకు చైర్మన్ తగిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. డిసెంబర్ 8న జరిగిన విహెచ్‌పి కార్యక్రమంలో జస్టిస్ యాదవ్ మాట్లాడుతూ, సామాజిక సామరస్యం, లింగ సమానత్వం , లౌకికవాదాన్ని ప్రోత్సహించడమే కామన్ సివిల్ కోడ్ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఒక రోజు తర్వాత సోషల్ మీడియాలో వైరలైన న్యాయమూర్తి మాట్లాడుతున్న వీడియోలుపై ప్రతిపక్ష నాయకులతో సహా, అనేక వర్గాల నుండి తీవ్రమైన స్పందనలు వచ్చాయి. జస్టిస్ యాదవ్ వివాదాస్పద ప్రకటనలపై వార్తాలను, నివేదికలను సుప్రీంకోర్టు మంగళవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ అంశంపై అలహాబాద్ హైకోర్టు నుండి వివరాలను కోరింది.

## ధ్వంసానికి యత్నం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతాపాన్ని ప్రదర్శించిందని విమర్శించారు. ఎల్లప్పుడూ రాజ్యాంగాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నం చేసిందన్నారు. ఎమర్జెన్సీని విధించిందనీ, అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలను రద్దుచేసిందని, నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వంపై తిరగబడిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులను తొలగించిందనీ, ఈనాడు రాజ్యాంగ సంరక్షకురాలుగా కాంగ్రెస్‌పార్టీ ప్రసంగాలు చేస్తోందనీ విమర్శించారు.రాజ్యాంగాన్ని రక్షించడం అందరి కర్తవ్యం, కానీ ఎవరు రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నారన్న విషయాన్ని మనం అర్థం చేసుకోవాలని అన్నారు.

## ఉత్తమ విద్యే లక్ష్యంగా ..

# ఐఐఐటిని తీర్చిదిద్దుతాం

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్‌పి జానకి షర్మిల, విసి ప్రొఫెసర్ గోవర్ధన్





**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** ఉత్తమ విద్యే లక్ష్యంగా బాసర ఐఐఐటిని తీర్చిదిద్దుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా పర్యటనలో భాగంగా ఆర్‌జియుకెటి బాసరను మంత్రి సందర్శించారు. క్యాంపస్‌కు చేరుకున్న మంత్రికి జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైస్ ఛాన్సలర్, విద్యార్థులు పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తదనంతరం సమావేశ మందిరంలో అధికారులతో కలిసి మంత్రి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, విసి విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కోర్సులు, భోజనశాల, వసతి గృహాల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న వసతులు, సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను మంత్రికి వివరించారు. విద్యార్థుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందించాలని, ఫ్యాకల్టీ సరిపడా లేక సిలబస్ పూర్తి కావడం లేదన్నారు. స్టూడెంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలని,అమ్మాయిల కోసం గైనకాలజిస్ట్‌ను ప్రత్యేకంగా ఇక్కడే ఉంచాలని కోరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉత్తమ విద్యే లక్ష్యంగా ఐఐఐటీ తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వివిధ అభివృద్ధి పనులకు తక్షణం 1 కోటి రూపాయలను మంజూరు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. విద్యార్థులందరినీ కలవడం ఆనందంగా ఉందని, బాసర సరస్వతీ దేవి ప్రాముఖ్యతను గుర్తించి అప్పటి ప్రభుత్వం 2008లో ఐఐఐటి ప్రారంభించిందని తెలిపారు. ఆర్‌జియుకెటి బాసరను ఉత్తమ విద్యా సంస్థగా ఎదిగేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో పనిచేస్తుందని, ప్రీ ప్రైమరీ నుండి ఉన్నత విద్య వరకు ప్రతిష్టాత్మకమైన పాలసీ తీసుకురాబోతున్నట్లు చెప్పారు. క్యాంపస్‌లో దాదాపు 9వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, నాణ్యమైన విద్యానందించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు, ప్రజాప్రతినిధులు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు రామారావు పటేల్, ఎంఎల్‌సిలు బాలూరి వెంకట్, దండే విట్టల్, ఆర్‌డిఒలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపిడివొ అశోక్, అధికారులు, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌కు..

# పూర్వవైభవం తెస్తాం

వచ్చే ఐదేళ్లలో 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు

ఎస్‌ఆర్‌ఎస్‌పి ప్రాజెక్టు సందర్శన

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి





**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌కు పూర్వ వైభవం చేకూరుస్తామని వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో కొత్తగా 30లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మెండోరా మండలంలోని ఎస్‌ఆర్‌ఎస్‌పి ప్రాజెక్టును మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఎమ్మెల్యేలు పి.సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, లక్ష్మీ కాంత్‌రావు, నీటిపారుదల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శ్రీరాంసాగర్ జలాశయం స్థితిగతులను అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఎస్సారెస్పీ ద్వారా గడిచిన ఐదేళ్లుగా వానాకాలం యాసంగి సీజన్లలో ఆయకట్టు పరిధిలోని పది జిల్లాల్లో ప్రతి యేడాది సగటున 12.5 జిల్లాల ఎకరాలకు సాగుజలాలు అందించగలిగామని తెలిపారు. కాకతీయ, సరస్వతి, లక్ష్మి కాలువల ద్వారా విడుదల చేస్తున్న సాగు, తాగునీటి వివరాలు, ఎస్‌ఆర్‌ఎస్‌పి ఆధారంగా ఎత్తిపోతల పథకాలకు అందుతున్న జలాలు తదితర అంశాలను మంత్రి చర్చించి అధికారులకు కీలక సూచనలు చేశారు. యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పామని ఐటిఐలలో ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టి అప్‌గ్రేడ్ చేశామని వివరించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్, ఇరిగేషన్, సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా హెలికాప్టర్ ద్వారా ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పూల బొకెలు అందించి ఘనస్వాగతం పలికారు.

**నాగమడుగు, లెండి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం**

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** త్వరలోనే నాగమడుగు, లెండి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావుతో కలిసి ఆయన నిజాంసాగర్ నీటిని దిగువకు విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. జుక్కల్ నియోజకవర్గంలో ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, నిజాంసాగర్ ప్రాజెక్టు జుక్కల్ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ కేవలం 3600 ఎకరాలకు మాత్రమే జుక్కల్‌లో సాగునీరు అందుతుందన్నారు. నాగమడుగు, లెండి ప్రాజెక్టులు పూర్తి చేస్తే జుక్కల్ నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని ఎమ్మెల్యే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా నీలం రాజశేఖర్ రెడ్డి వర్ధంతి


నివాళులర్పించిన సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** స్వాతంత్ర సమర యోధులు, సిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపనలో ప్రముఖులు, దివంగత నీలం రాజశేఖర్ రెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా సిఆర్ ఫౌండేషన్ కొండాపూర్, హైదరాబాద్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి విచ్చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీలం రాజశేఖర్ రెడ్డి కమ్యూనిస్టు నిబద్ధతతో ఉన్న ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చినప్పటికీ అలనాటి భారత దేశ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డి స్వయాన సోదరుడైనప్పటికీ వారు కమ్యునిస్టు పార్టీ సమున్నతికి నిర్విరామంగా కృషిచేశారు. ముఖ్యంగా పార్టీలో యువకులను, మేధావులను ప్రోత్సహించారని వక్తలు రాజశేఖర రెడ్డి సేవలను గుర్తుచేసుకున్నారు. సిఆర్ ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి భారత మహిళా సమాఖ్య ఎఐటియుసి మాజీ కార్యదర్శి బివి విజయలక్ష్మి, ఫౌండేషన్ సెక్రటరీ చెన్నమనేని వెంకటేశ్వరరావు నీలం రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ నీలం రాజశేఖర్ రెడ్డి , చంద్ర రాజేశ్వరరావుతో పాటు ఢిల్లీ కేంద్రంగా జాతీయ కార్యదర్శిగా చాలా సంవత్సరాలు పనిచేసి రిటైర్డ్ అయిన తర్వాత హైదరాబాద్ వచ్చారని, నీలం రాజశేఖర్ రెడ్డి విద్యార్థులను, యువకులను, పార్టీలో వారిని ప్రోత్సహించారని తెలియజేశారు. సిఆర్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్, నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ కన్వీనర్ కంభంపాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ నీలం రాజశేఖర రెడ్డి రీసెర్చ్ సెంటర్లో జరుగుతున్న కార్యక్రమాల గురించి తెలియజేశారు. బివి.విజయలక్ష్మి మాట్లాడుతూ నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్లోని లైబ్రరీ విస్తరణకు డిజిటలైజేషన్ ద్వారా విద్యార్థులకు, యువకులకు అందరికీ ప్రోత్సాహం లభిస్తుందని తెలియజేశారు. సిఆర్.ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవరావు, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోస్య భట్ల కల్పన, సభ్యులు, జ్యోత్స్న, లలిత, ఆశ్రమవాసులు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెంటర్ విద్యార్థినిలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పరారీలో మోహన్‌బాబు

రాచకొండ పోలీసులు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మీడియా ప్రతినిధిపై దాడి కేసులో సినీ నటుడు మోహన్‌బాబును అరెస్టు చేసేందుకు రాచకొండ పోలీసులు వెతుకుతున్నారు. శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లిన పోలీసులు మోహన్‌బాబు పరారీలో ఉన్నాడని, అతని కోసం ఐదు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదని చెప్పారు. మంచు మోహన్‌బాబు పరారీలో ఉన్నట్టు పోలీసులు పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడి ఘటనలో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైన విషయం తెలిసిందే. కాగా ఈకేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని, తదుపరి దర్యాప్తు చేపట్టకుండా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో మోహన్‌బాబు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు అభ్యర్థనను కొట్టివేసింది. ఈ నేపథ్యంలో మోహన్‌బాబును అరెస్ట్ చేయడానికి పోలీసులు ఆయన ఇంటికి వెళ్ళగా.. ఆయన ఇంట్లో లేరు. పరారీలో ఉన్న మోహన్‌బాబు కోసం 5 చోట్ల పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా.. ఎక్కడా ఆయన ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం మోహన్‌బాబు ఇంటి వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. ఫ్యామిలీ వివాదం, కేసుల నేపథ్యంలో న్యూస్ కవర్ చేసేందుకు మోహన్‌బాబు ఇంటి వద్దకు వెళ్లిన కొందరు జర్నలిస్టులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బూతులు తిడుతూ, లోగోలు లాక్కుని దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులు పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు అయింది.

# 'ఆరోగ్య తెలంగాణ'గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలి

ఎన్‌సిఎపి సమీక్షా సమావేశంలో అధికారులకు సూచించిన మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణకు చేపట్టే కార్యక్రమాలకు సంబంధిత అన్ని శాఖలు సహాయ, సహకారాలను అందిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం సెక్రటేరియట్‌లో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సిఎపి) పై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి వ్యక్తికి ఆరోగ్యంగా జీవించే హక్కు వున్నదని, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కాలుష్య నియంత్రణ, వాతావరణ పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నదని మంత్రి సురేఖ తెలిపారు. ఈ సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్ట్, ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ ఆధ్వర్యంలో అమలవుతున్న నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సిఎపి) కార్యాచరణ ప్రణాళికలను టిజిపిసిబి ఎన్ క్యాప్ నోడల్ ఆఫీసర్ డి.ప్రసాద్ మంత్రి సురేఖకి సోదాహరణంగా వివరించారు. దేశవ్యాప్తంగా 131 నాన్ అట్టెయిన్‌మెంట్ సిటీల (అత్యంత కాలుష్య నగరాలు)ను గుర్తించగా, తెలంగాణ నుంచి హైదరాబాద్, నల్గొండ, సంగారెడ్డిలను నాన్ అట్టెయిన్‌మెంట్ సిటీలుగా గుర్తించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. గాలి నాణ్యత రోజు రోజుకీ క్షీణిస్తూ పోతుండటంతో తలెత్తున్న ఆరోగ్య సమస్యలపై మంత్రి సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌తో పాటు చుట్టు పక్కల బొగ్గు ఇంధనంగా వినియోగించే పరిశ్రమలు ప్రత్యామ్నాయ ఇంధనంగా గ్యాస్‌ను వినియోగించే దిశగా గట్టి చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం, నూతన ఈవీ పాలసీ, పరిశ్రమల నుండి విడుదలయ్యే ఉద్గారాల నియంత్రణకు ఎమిషన్ మానిటరింగ్ సిస్టమ్‌లు, రోడ్లు, ఫ్లైఓవర్లు, ట్రాఫిక్ నియంత్రణ, సిగ్నలింగ్ సిస్టమ్స్ ఆధునీకరణ తదితర కార్యక్రమాల ద్వారా వాయునాణ్యతను పెంపొందించేందుకు పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.



# కెసిఆర్ వియ్యంకుడిపై అట్రాసిటీ కేసు

రాంకిషన్‌రావు ఇద్దరు అనుచరులపై కేసు నమోదు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** మాజీ సిఎం కెసిఆర్ వియ్యంకుడు, ఎమ్మెల్సీ కవిత మామ రాంకిషన్‌రావుతో పాటు అతని అనుచరులపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు చేశారు. 2020లో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ కవిత మామ రాంకిషన్‌రావు చిన్నకుమారుడు అరుణ్‌కుమార్ నుంచి ప్లాట్ నెం.305 కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని బాధితుడు గోపి వెల్లడించారు. ప్రస్తుతం ఆ అపార్ట్‌మెంట్ 30 ప్లాట్లు ఉన్నాయని, 28 కుటుంబాలు నివాసముంటున్నారన్నారు. ఆ అపార్ట్‌మెంట్‌కు ప్రధాన రహదారి నుంచి రోడ్డు ఉందని నమ్మించటంతో మరికొందరు ఆర్‌కెఆర్ అపార్ట్‌మెంట్ ప్లాట్లను కొనుగోలు చేయటం జరిగిందన్నారు. రాంకిషన్‌రావు అపార్ట్‌మెంట్ రోడ్డుపై కన్నువేసి అతని అనుచరులతో కలిసి రహదారిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారని, దానిని అపార్ట్‌మెంట్‌వాసులు అడ్డుకున్నారన్నారు. రాంకిషన్‌రావుతో పాటు అతని అనుచరులు చాలాసార్లు బెదిరించినా భయపడకపోవటంతో రాంకిషన్‌రావు సహచరులతో కలిసి ఈనెల 10న రోడ్డుపై ఇనుప గ్రిల్ చుట్టి రోడ్డుపై రేకులతో కప్పి రహదారికి అడ్డు వేశారన్నారు. అక్రమంగా భూమిని లాక్కొని రోడ్డును ఎందుకు మూసివేస్తున్నారంటూ ప్రశ్నించినందుకు రాంకిషన్‌రావు అతని అనుచరులు సూదం రవిచందర్, నగేష్ తదితరులు గాదరి గోపిని తిడుతూ దుర్భాషలాడటమే కాకుండా కొట్టేందుకు ప్రయత్నించారు. మాజీ సిఎం వియ్యంకుడు, ఎమ్మెల్సీ కవిత మామ రాంకిషన్‌రావు పాటు అతని అనుచరులు సూదం రవిచందర్, నగేష్‌లపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆరిఫ్ తెలిపారు.

# సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ద్వితీయ శ్రేణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని సిఎం రేవంత్‌రెడ్డి విస్మరించడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా స్థాయిలో సిస్టం అనలిస్ట్, టెక్నికల్ పర్సన్స్, ఆపరేటర్లు, డాటా ఎంట్రీ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్, స్పెషల్ ఆఫీసర్స్, అటెండర్స్ తదితర విభాగాలలో వేలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రతతో కూడిన వేతన స్కేల్ ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటు అని విమర్శించారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి..

# తక్షణమే పాలకవర్గం నియామకం

ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాలరాజు

అంజయ్య భవన్ ముందు భవన నిర్మాణ కార్మికుల ధర్నా

కార్మిక శాఖ సంయుక్త కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిథ్యం కల్పించి పాలకవర్గాన్ని నియమించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.బాలరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయం అంజయ్య భవన్ ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు భారీ ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాను ఉద్దేశించి బాలరాజ్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల కుటుంబాలకు పెన్షన్ సౌకర్యం కల్పించి, వృద్ధాప్యంలో ఉన్న అర్హులైన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ సెస్ రూపంలో కార్మికుల శ్రమతో జమ అయిన డబ్బులను వారి సంక్షేమం కోసమే ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్‌కుమార్ గౌడ్, ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ లేబర్ అడ్డాల దగ్గర మంచినీరు, టాయిలెట్స్, ఐదు రూపాయల భోజనం వసతి కల్పించాలని కోరారు. జాయింట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.మల్లేష్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.చందు యాదవ్, సిపిఐ జిల్లా నేత బాత్‌రాజు నరసింహ, ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సక్కురు నాయక్ రాములు గౌడ్, శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి వెంకట్ కృష్ణ, శివ, రాములు, రాజు, బి.నరసింహ పాల్గొన్నారు.

# నేడు సంక్షేమ హాస్టళ్ళలో ఆకస్మిక తనిఖీలు

## వ్యక్తిగతంగా సందర్శించనున్న సిఎం, మంత్రులు, అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని సంక్షేమ హాస్టల్లో పరిస్థితులను స్వయంగా అంచనా వేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో సహా మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు సీనియర్ ఐఎఎస్ ఐపిఎస్ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు గురుకుల, రెసిడెన్షియల్ హాస్టళ్లను శనివారం వ్యక్తిగతంగా సందర్శించనున్నారు. అక్కడే విద్యార్థులతో కలసి భోజనం చేసి పరిస్థితులను అంచనా వేయనున్నారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ హాస్టళ్లలో మరింత ప్రామాణికమైన ఆహారాన్ని అందించడంతోపాటు మెరుగైన విద్య బోధనా అవకాశాలను పెంపొందించడానికి సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో శనివారం ప్రభుత్వ యంత్రాంగం మొత్తం రాష్ట్రంలోని అన్ని గురుకుల సంక్షేమ హాస్టళ్లలోపర్యటించి పరిస్థితులను సమీక్షించనుంది.

**ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన వివరాలు :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలలోని ఏదో ఒక సంక్షేమ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లాలోని ఎంజెపిబిసిడబ్ల్యుఆర్‌జెసి (బాలికలు) మధిర పాఠశాల, బోనకల్‌లో తనిఖీలు నిర్వహించనున్నారు. మంత్రులు దామోదర రాజనరసింహ భూపాలపల్లి జిల్లాలోని ఎంజెపిబిసిడబ్ల్యుఆర్‌జెసి (బాలికలు), మైలారం గ్రామం, ఘన్‌పూర్‌లలో, డి.శ్రీధర్‌బాబు భూపాలపల్లి జిల్లాలోని ఎంజెపిబిసిడబ్ల్యుఆర్‌జెసి (బాలికలు), మైలారం గ్రామం, ఘన్‌పూర్‌లో, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం జిల్లాలోని టిజిటిడబ్ల్యుర్‌జెసి(బాలికలు), మాదిరిపురం, తిరుమలాయపాలెంలో, పొన్నం ప్రభాకర్ ఎంజెపిబిసిడబ్ల్యుఆర్‌జెసి (బాలికలు) (బాలుర) హైదరాబాద్ షేక్‌పేట్‌లో, కొండా సురేఖ ఎంజెపిబిసిడబ్ల్యుఆర్‌జెసి (బాలురు), హతనూర, సంగారెడ్డిలో, డి.అనసూయ సీతక్క, ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు), నేరడిగొండ, ఆదిలాబాద్‌లో, తుమ్మల నాగేశ్వరరావు ఏకలవ్య మోడల్ ఆర్‌ఐ టిడబ్ల్యుడి, గండుగులపల్లి, దమ్మపేట మండలం, భద్రాద్రి కొత్తగూడంలో, జూపల్లి కృష్ణారావు, ఎంజెపిబిసిడబ్ల్యుఆర్‌జెసి (బాలికలు), కొల్లాపూర్, నాగర్ కర్నూలలో తనిఖీలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ గురుకుల హాస్టళ్లలోని దాదాపు 8 లక్షల మంది విద్యార్థులకు డైట్ చార్జీలు 40 శాతం కాస్మోటిక్ చార్జీలు 200 శాతంపెంచుతూ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు రాష్ట్రంలోని పాఠశాలలో రూ.667.25 కోట్లతో మౌలిక సదుపాయాలను కూడా ప్రభుత్వం కల్పించింది. హాస్టళ్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ఆకునూరి మురళి అధ్యక్షతన స్టేట్ ఎడ్యుకేషన్ కమిషన్ కూడా ఏర్పాటు చేసిందని ప్రభుత్వం తెలియజేసింది.

## వర్శిటీల్లో సమస్యల పరిష్కారానికి

# 'వైస్‌చాన్స్‌లర్ల కమిటీ'



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో నియామక, సూపర్‌యాన్యుయేషన్ విధానాలు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్, పదోన్నతులకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించేందుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్స్‌లర్లతో కమిటీని ఏర్పాటు చేసింది. యుజిసి నిబంధనలు, జిఒ.ఎం.ఎస్ నంబర్ 15కు అనుగుణంగా బోధన సిబ్బంది నియామకానికి విధి విధానాలను సిద్ధం చేసేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చైర్మన్‌గా అంబేద్కర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్, సభ్యులుగా ఉస్మానియా, మహాత్మా గాంధీ యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లు, మరో ఇద్దరు సభ్యులుగా నిపుణులను కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టిజిసిహెచ్‌ఇ) చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల వైస్‌చాన్సలర్ల సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర విద్యామండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె.మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తో పాటు వైస్ చాన్స్‌లర్లు ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, (ఉస్మానియా యూనివర్సిటీ), ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి (కాకతీయ యూనివర్సిటీ), ప్రొఫెసర్ టి.యాదగిరి రావు (తెలంగాణ యూనివర్సిటీ), ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ (ఎం.జి. యూనివర్సిటీ), ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ (పాలమూరు యూనివర్సిటీ), ప్రొఫెసర్ యు.ఉమేష్ కుమార్ (శాతవాహన విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ (వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి (డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ), ప్రొఫెసర్ వి.నిత్యానంద రావు (పిఎస్‌టియు), ప్రొఫెసర్ ఎం.వినోద్ గణేష్, (డిఎపి,జెఎన్‌ఎ,ఎఫ్‌ఎయు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వైస్‌చాన్సలర్లు తమ విశ్వవిద్యాలయాలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లను గుర్తించి, వివరణాత్మక నోట్‌ను ముఖ్యమంత్రికి సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్‌చాన్సలర్లు తమ ప్రధాన సమస్యలైన రిక్రూట్మెంట్ ప్రక్రియ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, బడ్జెట్ పరిమితులు, స్కాలర్‌షిప్‌ల కేటాయింపు, మెస్ ఛార్జీ బకాయిలు వంటి పలు అంశాలు వివరించారు. అకడమిక్ ఎక్స్‌లెన్స్, విద్యార్థుల సంక్షేమం, విశ్వవిద్యాలయల్లో సౌకర్యాలను ప్రస్తావించారు. కాగా ఈ సమావేశంలో టిజిసిహెచ్‌ఇ వార్తాలేఖను ఆవిష్కరించారు.

# ఫోకస్




## 'క్వింటిలియన్' కదలికల పరిశీలన!

ఒక సెకనులో 100వ వంతును 'జిఫ్ఫీ' అంటారు. అలాంటి కాల పరిమాణాన్ని ఊహించడం కష్టం. అలాంటిది 'క్వింటిలియన్' అనేది మన ఆలోచనలకు అందంత సూక్ష్మాతిసూక్ష్మ మైన కాలగణన. సాధారణంగా మనం ఇప్పటికీ వాడుతున్న వందలు, వేలు, పదివేలు, లక్ష తర్వాత.. పది లక్షలు.. కోటి.. పది కోట్లు.. వంద కోట్లు.. ఇలా గుణిస్తాం. కానీ, ఇటీవల కాలంలో పది లక్షల నుంచి గుణించే విధానం మారింది. పది లక్షలను ఒక మిలియన్ అంటున్నారు. మిలియన్ అంటే, ఒకటి తర్వాత ఆరు సున్నాలు. 10,000 మిలియన్లు ఒక బిలియన్. అంటే 6+3= 9 సున్నాలు. ఇక ట్రిలియన్ అంటే 9+3= 12 సున్నాలు. క్వాడ్రిలియన్ అంటే 12+3= 15 సున్నాలు. క్వింటిలియన్‌లో 15+3 అంటే, 18 సున్నాలు (1 000 000 000 000 000 000) ఉంటాయి. అంతటి సూక్ష్మ మైన కాలంలో, ఒక కణంలో జరిగే చలనాన్ని కూడా శాస్త్రవేత్తలు గుర్తించగలగడం ఊహకు అందని అద్భుతం. ఆరిజోనా విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్, ఆప్టికల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ మహమ్మద్ ఫసన్ బృందం ఎన్నో సంవత్సరాలు కష్టపడి కనుగొన్న టెలిస్కోప్ ద్వారా అత్యంత వేగవంతమైన కదలికలను కూడా చూడడం సాధ్యమవుంది. ఈ బృందం వెల్లడించిన వివరాల ప్రకారం, క్వింటిలియన్ కదలికలను కూడా వీరు అభివృద్ధి

| | | |
|---|---|---|
| | 1 | ఒకటి |
| 1000 x | 1000 | వెయ్యి |
| 1000 x | 1,000,000 | మిలియన్ |
| 1000 x | 1,000,000,000 | బిలియన్ |
| 1000 x | 1,000,000,000,000 | ట్రిలియన్ |
| 1000 x | 1,000,000,000,000,000 | క్వాడ్రిలియన్ |
| 1000 x | 1,000,000,000,000,000,000 | క్వింటిలియన్ |



చేసిన అత్యాధునిక సూక్ష్మ దర్శిని ద్వారా గమనించవచ్చు. ఈ బృందం ప్రకటన ప్రకారమే ఈ అత్యాధునిక మైక్రోస్కోప్ క్వింటిలియన్ కదలికలను కూడా పరిశీలించగలిగితే, అణు స్థాయిలో జరిగే క్లిష్టమైన ఎలక్ట్రాన్లు, న్యూట్రాన్ల ప్రవర్తనల ప్రాథమిక కూర్పుపై సరికొత్త అధ్యయనాలకు దారులు తెరుచుకుంటాయి. ఈ ఆవిష్కరణ నిజ సమయంలో ఎలక్ట్రాన్లను దృశ్యమానం చేయగల సామర్థ్య రసాయన ప్రతిచర్యల నుండి విద్యుత్ వాహకత వరకు వివిధ ప్రక్రియలపై మన అవగాహనలో విప్లవాత్మక మార్పులు తెస్తుంది. అనేక రంగాలలో పురోగతికి మార్గం సుగమం చేస్తుంది. ఇప్పటి వరకూ నిజ సమయంలో ఎలక్ట్రాన్లను గమనించడం ఎవరికీ సాధ్యం కాలేదు. కానీ, హసన్ బృందం ఈ సమస్యను పరిష్కరించింది. ఎలక్ట్రాన్లను నియంత్రించడానికి అల్ట్రాఫాస్ట్ లేజర్ పల్స్‌ను ఉపయోగించే ట్రాన్స్‌మిషన్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌ను ఈ బృందం రూపొందించింది. 'అటామిక్రోస్కోపీ' అని పిలువబడే ఈ సాంకేతికత, అటోసెకన్లలో కొలవబడిన సమయ ప్రమాణాలలో ఎలక్ట్రాన్ కదలికలను సంగ్రహిస్తుంది. ఆటో సెకనును వివరించడం కష్టం. స్థూలంగా చెపద్దాలంటే, విశ్వం ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ ఎన్ని సెకన్లు ఉన్నాయి, ఒక సెకనులో అన్ని అటోసెకన్లు ఉంటాయి. భౌతిక శాస్త్రంలో ఈ మార్గదర్శకులు అటోసెకన్లలో కొలవగలిగేంత చిన్నదైన మొదటి అతినీలలోహిత వికిరణం పల్స్‌ను రూపొందించడాన్ని ఒక గొప్ప ఆవిష్కరణగా పేర్కొంటున్నారు.


# అంచనా తప్పలేదు..

ఈ విశ్వంలో ద్రవ్యరాశిగానీ, ధనావేశంగానీ లేని ఒక కణం ఉందని ఆస్ట్రియన్ శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత వోల్ఫ్‌గ్యాంగ్ పౌలి (1900–1958) చేసిన ప్రతిపాదన అప్పట్లో సంచలనం సృష్టించింది. అలాంటి కణం ఒకటి ఉండితీరుతుందని ఆయన అంచనా. 1931లో చేసిన ఈ ప్రతిపాదనకు అవసరమైన సాక్ష్యాలను ఆయన సంపాదించలేకపోయాడు. ఆధారాలు మచ్చుకు కూడా కనిపించకపోవడంతో తన అంచనా తప్పని అనుకున్నాడు. 'నేను చాలా తప్పు చేశాను.. ఆ కణం అసలు ఉనికిలోనే లేదు.. అసలుండదు కూడా. నా అంచనా తప్పు' అని బహిరంగంగా ప్రకటించాడు. కానీ, పౌలి చేసిన ప్రత్యేక కణం ప్రతిపాదన తప్పుకాదని తర్వాతి కాలంలో రుజువైంది. అనేక ప్రయోగాలు ఈ విషయాన్ని నిరూపించాయి. పౌలి ప్రతిపాదిన సిద్ధాంతాన్ని మరింత అభివృద్ధి పరచిన ఇటాలియన్ శాస్త్రవేత్త , నోబెల్ బహుమతి గ్రహీత ఎన్రికో ఫెర్మి (1901–1954) అజ్ఞాత కణాల ఉనికిని నిరూపించే వివరాలు సేకరించాడు. అంతేగాక, ఆ కణానికి 'న్యూట్రినో' అని పేరుపెట్టాడు. అనంతర కాలంలో పలువురు శాస్త్రవేత్తలు అధ్యయనాలను కొనసాగించి, మూడు రకాల న్యూట్రినోలను ఆవిష్కరించారు. పౌలి అంచనా తప్పుకాదని ఆయన మరణాంతరం జరిగిన పరిశోధనలు నిరూపించాయి. కానీ, ఆ పరిణామాలను పౌలి చూడలేపోకపోవడం దురదృష్టకరం.




భౌతిక శాస్త్రంలోనూ ప్రవేశం ఉన్న ప్రఖ్యాత గణితశాస్త్రవేత్త పాల్ ఆడ్రియెన్ మౌరిస్ డైరాక్ (ఎడమ), భౌతికశాస్త్రవేత్త రుడాల్ఫ్ ఎర్నెస్ట్ పెరీల్స్ (కుడి)తో వోల్ఫ్‌గ్యాంగ్ పౌలి (మధ్య)


# చంద్రుడి మరో రూపం..



శతాబ్దాలుగా చంద్రుడిపై వచ్చింత సాహిత్యం మరే ఇతర గ్రహం లేదా ఉపగ్రహాలపై రాలేదు. చల్లదనానికి, శాంతికి, ప్రేమకు, ఆకర్షణకు మారుపేరుగా చంద్రుడిని పేర్కొంటారు. అయితే, చంద్రుడిలో మనకు కనిపించని మరో కోణం కూడా ఉంది. ఇంత వరకూ మనకు చందమామపై ఉన్న అభిప్రాయాలను, అక్కడి ఉత్తర ధ్రువానికి దగ్గరగా ఉన్న హెర్మైట్ క్రేటర్ లేదా హెర్మైట్ బిలం పటాపంచలు చేస్తుంది. ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త చార్లెస్ హెర్మైట్ పేరుమీద దీనిని హెర్మైట్ క్రేటర్‌గా పిలుస్తున్నారు. ఇది సుమారు 3.91 బిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడి ఉండవచ్చని శాస్త్రవేత్తల అంచనా. దీని వ్యాసం 108.64 కిలో మీటర్లు. అక్కడి ఉష్ణోగ్రత 26 కెల్విన్లు , అంటే –413 డిగ్రీల ఫారెన్‌హీట్ లేదా –247 డిగ్రీల సెల్సియస్. ఇది అంతరించిపోయిన ఒక బిలంలోని భాగంగా భావిస్తున్నారు. ఒకప్పుడు అక్కడ నీరు లేదా మంచు ఉండవచ్చన్న వాదన కూడా ఉంది. అయితే, ఈ ప్రాంతానికి సూర్యుడి కాంతి ఎన్నటికీ చేరదు కాబట్టి, భూమిపై ఉన్నట్టు జీవ జాలం అభివృద్ధి చెందే అవకాశం లేదు.


# మార్స్‌పై మురికి నీటి మంచు!





అంగారక గ్రహాన్ని అధ్యయనం చేసేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' ప్రయోగించిన మార్స్ రికనైసెన్స్ ఆర్బిటర్ (ఎంఆర్‌ఒ) పంపిన చిత్రాల్లో టెర్రా సైరెనమ్ అనే ప్రాంతంలోని మార్టిన్ గల్లీ అంచుల్లో మురికి నీటి మంచుగా భావిస్తున్న తెల్లని పదార్థాన్ని శాస్త్రవేత్త లు కనుగొన్నారు. ఈ మంజులోని ధూళి కణాల ను పరిశీలిస్తే, అవి భూమిపై హిమానీనదాలపై పడే ధూళిని పోలి ఉన్నాయని అంటున్నారు. సూర్యకాంతిలో నీరు వేడెక్కడం వల్ల ఉరితలంలో ఇలాంటి పదార్థాలు ఏర్పడతాయి. భూమిపైన హిమానీనదాలపై ఏర్పడే ధూళిని క్రయోకోనైట్ అని పిలుస్తారు. అది ఏర్పడే పాకెట్లను క్రయోకోనై ట్ రంధ్రాలు అని పిలుస్తారు. మన గ్రహం మీద ఉన్న ఈ నీటి పాకెట్స్ తరచుగా ఆల్గే, శిలీంధ్రా లు, సైనోబాక్టీరియాతో సహా సాధారణ జీవితంతో నిండి ఉంటాయి. శాస్త్రవేత్తలు అంగారక గ్రహంపై ఇలాంటి నిస్సారమైన నీటి కొలనులు ఉండవచ్చని ఊహిస్తున్నారు. రెడ్ ప్లానెట్లో జీవం కోసం శోధించడా నికి తాజా చిత్రాలు ప్రోత్సాహకాలవు తాయి. గల్లీల దిగువన ఉన్న నీలం రంగు ముతక ఇసుక (మంచు కాదు); రంగు వాస్తవానికి మానవ కంటికి కనిపించదు. రంగును చాలా ఇన్ఫ్రారెడ్ తరంగదైర్ఘ్యాలలో చూడటం ద్వారా గుర్తించగలుతారు. టెక్సాస్ (అమెరికా)లోని అరిజోనా విశ్వవిద్యాలయం, కొలరాడోలోని బౌల్డర్లోబాల్ ఏరోస్పేస్ అండ్ టెక్నాలజీస్ కార్పొరేషన్ నిర్మించిన హైరైజ్ (HiRISE)ను నాసా నిర్వహిస్తోంది. దాని సాయంతోనే మార్స్‌పై ఉన్న ఇన్ఫ్రారెడ్ తరంగాలను గుర్తించి, అధ్యయనాన్ని మరింత విస్తృతపరుస్తున్నారు.

# రసాయన శాస్త్రంలో పదాలు..



రసాయన శాస్త్రంలో అటామిక్ స్ట్రక్చర్ అనేది అణువులు పదార్థ నిర్మాణ పొరలను వివరిస్తుంది. అణువు కేంద్రకంలోని ప్రోటాన్ల సంఖ్యను పరమాణు సంఖ్య అంటారు. ప్రోటాన్లు, న్యూట్రాన్ల మొత్తం సంఖ్యను ద్రవ్యరాశిగా పేర్కొంటారు. కాగా, ఆవర్తన పట్టిక అనేది మూలకాల పట్టిక అమరికను, వాటి పరమాణు సంఖ్యను వివరిస్తుంది. వాటి రసాయన లక్షణాల ద్వారా నిర్వహించబడుతుంది. మూలకాలు కుటుంబాలు (నిలువు నిలువు వరుసలు), విరామాలు (క్షితిజ సమాంతర వరుసలు)గా దీనిని వర్గీకరించవచ్చు. పరమాణువులు ఎలక్ట్రాన్లను పంచుకున్నప్పుడు లేదా మార్పిడి చేసినప్పుడు రసాయన బంధాలు ఏర్పడతాయి. అయానిక్ బంధాలు (ధనాత్మకంగా మరియు ప్రతికూలంగా చార్జ్ చేయబడిన అయాన్ల మధ్య), సమయోజనీయ బంధా లు (ఎలక్ట్రాన్లను పంచుకునే పరమాణువుల మధ్య), లోహ బంధాలు (లోహ పరమాణువుల మధ్య) సహా అనేక రకాల బంధాలు ఉన్నాయి. వీటి వివరణలను కెమికల్ బాండింగ్‌గా పేర్కొంటారు. ఇక, రసాయన ప్రతిచర్యలు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పదార్థాలను కొత్త పదార్థాలుగా మారుస్తాయి. ప్రతిచర్యలను సంశ్లేషణ ప్రతిచర్యలు (రెండు లేదా అంతకంటే ఎక్కువ పదార్థాలు కలపడం), కుళ్ళిపోయే ప్రతిచర్యలు (ఒక పదార్థం విచ్ఛిన్నమయ్యే చోట) లేదా స్థానభ్రంశం ప్రతిచర్యలు (ఒక పదార్థం మరొకటి స్థానభ్రంశం చెందుతుంది)గా వర్గీకరించవచ్చు. ఇలావుంటే, ఆమ్లాలు హైడ్రోజన్ అయాన్లను దానం చేసే పదార్థాలు, అయితే ధాతువులు హైడ్రోజన్ అయాన్లను అంగీకరించే పదార్థాలు. ఆమ్లాలు, క్షారాల యొక్క అర్హేనియస్ నిర్వచనం నీటిలో వాటి ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది, అయితే బ్రోన్స్టెడ్‌లోరీ నిర్వచనం ప్రోటాన్లను దానం చేసే లేదా అంగీకరించే వారి సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. రసాయన శాస్త్రంలో ఎక్కువగా వినిపించే పదం ఆర్గానిక్ కెమిస్ట్రీ. కార్బన్ ఆధారిత సమ్మేళనాల అధ్యయనాన్ని ఆర్గానిక్ కెమిస్ట్రీ అంటారు. హైడ్రోకార్బన్లు కార్బన్, హైడ్రోజన్‌ను మాత్రమే కలిగి ఉండే సమ్మేళనాలు. అణువు యొక్క రసాయన లక్షణాలను నిర్ణయించే నిర్దిష్ట అణువుల సమూహావరస ఫంక్షనల్ గ్రూపులుగా పిలుస్తారు.

## యాదగిరిగుట్ట ప్రజల సమస్యలు పరిష్కరించండి

సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట స్థానిక ప్రజలు, దేవాలయం విషయములో వ్యాపారుల సమస్యలు అధికంగా ఉన్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు కోరారు. శుక్రవారం యాదగిరిగుట్టకు వచ్చిన హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్ట స్థానిక ప్రజలు, దేవాలయం విషయములో వ్యాపారుల సమస్యలు అధికంగా ఉండటం, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం పట్టింపులేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యాదగిరిగుట్ట కొండ కింద నుంచి పైకి వెళ్ళుటకు బ్రిడ్జి నిర్మాణం స్థానిక ప్రజలు వ్యతిరేకించినా, ఆందోళనలు నిర్వహించినా బ్రిడ్జి నిర్మాణం గావించారు. ఈ కారణంగా కొండ కింద నుంచి అన్ని రకాల వాహనాలు నేరుగా పైకి వెళ్ళుచున్నవి, ఆర్‌టిసి బస్సులు కూడా నేరుగా వెళ్ళడం వల్ల కింద భక్తులు ఉండకపోవడంతో వ్యాపారులు పూర్తిగా తమ వ్యాపారాలు నడవడం లేదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, స్థానిక ప్రజలు ఏకాభిప్రాయంతో బ్రిడ్జిని తొలగించాలని ప్రభుత్వానికి పలు విజ్ఞాపనలు పంపించారు. స్థానిక శాసనసభ్యులు బీర్ల అయిలయ్య కూడా బ్రిడ్జిని తొలగించాలని నిర్ణయించారు. కాని అమలుకావడం లేదన్నారు. దేవాలయానికి వస్తున్న వేలాది మంది భక్తులకు వసతి గృహాలు లేక చాలా ఇబ్బందులు పడుచున్నారు. ఆర్‌టిసి బస్టాండు ఎదురుగా దేవాలయానికి చెందిన యోగానంద నిలయం కాటేజీలు పూర్తిగా చెడిపోయి, నిరుపయోగంగా ఉన్నవి మరో నాలుగు ఎకరాలు స్కూలు ఖాళీ స్థలంలో కొత్తగా అన్ని రకాల వసతులతో భక్తులకు వసతి గృహాలు నిర్మించాలని కోరారు.

## పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండా ఒక్కటే

హనుమకొండ జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** పేదల పక్షాన పోరాడే పార్టీ ఎర్రజెండా ఒక్కటే అని హనుమకోండ జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. హనుమకోండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రములో శుక్రవారం బట్టు మల్లయ్య అధ్యక్షతన ధర్మసాగర్ కౌన్సిల్ సమావేశం జరిగింది ఈ సమావేశంలో హనుమకోండ జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిషన్ ద్వారా జెమిలి ఎన్నికల విధానం తీసుకువచ్చి ఒకే ఎన్నిక ఒకే దేశం అనే నినాదంతో ముందుకు సాగడం జరుగుతుందని అన్నారు. ఈఎన్నికలు ప్రజాస్వామ్యానికి భారత సమాఖ్య విధానానికి గొడ్డలి పెట్టు అని ఇది అసాధ్యం అని అన్నారు. మన దేశంలో అనేక రాష్ట్రాలలో ఇప్పటికే ప్రాంతీయ పార్టీలు కొనసాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇతర ప్రాంతీయ పార్టీలతో జతకట్టి ఒకే ఎన్నిక ఒకే దేశం అనే నినాదంతో జమిలి ఎన్నికల విధానాన్ని తీసుకరావడం అసాధ్యమన్నారు. రాష్టంలో కోనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు పథకాలను వేగంగా అమలు చేయాలని రైతులకు రుణమాఫి చేయాలని కోరారు. సిపిఐ 99వ వార్షికోత్సవాలు డిసెంబర్ 27న హనుమకొండలో వేలాది మందిలో జరిగే భారీ ప్రదర్శన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనువాసరావు హాజరవుతారని తెలిపారు. ఈకార్యక్రమములో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్,మండల కార్యదర్శి కోట్టే వేంకటేష్,జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి,కోట్టే తదితరులు పాల్గోన్నారు.



# సమసమాజ స్థాపనకు సిపిఐ నిరంతర పోరాటం

సిపిఐ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, చాడ వెంకటరెడ్డి





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** భారతదేశంలో సమ సమాజ స్థాపన కోసం వివిధ రంగాల్లో పనిచేస్తూ దోపిడీకి గురవుతున్న వర్గాలకు నిరంతరం సిపిఐ అండగా ఉంటుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుటకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఎల్ఐసి ఏజెంట్ల సంఘం కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యుల, గ్రామశాఖ కార్యదర్శుల సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండాలని సంకల్పంతో, దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా మార్క్సిజం సిద్ధాంత పునాదులపై భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్‌లో ఆవిర్భవించిందని, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైందని, దేశంలోని అనేక సంస్థానాలలో ప్రజలను వెట్టిచాకిరీ చేయించడాన్ని, బానిసత్వాన్ని వ్యతిరేకంగా ఆయా సంస్థానాల పాలకులకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. అలాంటి సిపిఐ పార్టీ ఆవిర్భవించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 సంవత్సరాల్లోకి అడుగిడుతున్న నేపథ్యంలో గ్రామశాఖ నుంచి ఢిల్లీ స్థాయి వరకు పార్టీ జెండాలు ఎగురవేయాలని, పండుగ వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష, కమ్యూనిస్టు బావాలు కలిగిన దేశాల్లో, ప్రాంతాల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, అనేక దేశాల్లో విజయకేతనాలు ఎగురవేస్తున్నారని, శ్రీలంక అధ్యక్ష ఎన్నికలే ఇందుకు ఉదాహరణ అని, భారతదేశంలో వామపక్షాల ప్రభావం రోజు రోజుకి పెరిగే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి ప్రభావం తగ్గిన విషయం దేశ ప్రజలందరికీ తెలుసని, రానున్న రోజుల్లో దేశానికి వామపక్షాలే ప్రత్యామ్నాయంగా ఎదగడానికి అనేక అవకాశాలున్నాయన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలుగా, నాయకులుగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలక ప్రభుత్వాలపై పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాలని, పార్టీని బలోపేతం చేసుకోవడం కోసం శక్తివంచన లేకుండా పార్టీ నాయకత్వం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పార్టీని విస్తృత పరచడానికి గ్రామాల్లో , మండలాల్లో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. పార్టీని, ప్రజాసంఘాలను బలోపేతం చేసుకునే దిశగా అన్ని మండలాలతో పాటు జిల్లా స్థాయి సమావేశాలు, సభలు జరుపుకోవాలని, పార్టీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా అన్ని గ్రామశాఖలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు విస్తృతంగా చేయాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, అందె స్వామి, గూడెం లక్ష్మి, టేకుమల్ల సమ్మయ్య, బత్తుల బాబు, కసిరెడ్డి సురేందర్‌రెడ్డితో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు థంబ్ సిస్టమ్‌ను రద్దుచేసి ఆన్‌లైన్ సిస్టమ్‌ను పునరుద్ధరించాలి

ఎఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అజ్జ వేణు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** భవన నిర్మాణ కార్మికులకు థంబ్ సిస్టంను రద్దుచేసి ఆన్‌లైన్ సిస్టంను పునరుద్ధరించాలని ఎఐటియుసి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కడారి రాములు, అజ్జ వేణులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ భవన నిర్మాణంలో సుతారీలు, సెంట్రింగ్ కార్మికులు, ప్లంబర్లు, ఎలక్ట్రిసియన్లు, పేయింటర్లు, మార్బుల్ కార్మికులు, ట్రాక్టర్ లేబర్, వడ్డెర మొదలగు వేలాది కార్మికులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో భవన నిర్మాణంలో పనిచేస్తున్నారని వారి చేతి వేళ్ళు అరిగి ఆన్‌లైన్‌లో థంబ్ సిస్టం రావడం లేదని, కావున ప్రభుత్వం థంబ్ సిస్టంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన లేబర్ కార్డులను, పెండింగ్ ఫైల్స్‌ను క్లియర్ చేయాలని, అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్ రూంలను ఇవ్వాలని, వలస కార్మికుల వలన స్థానిక కార్మికులకు ఉపాధి కరువైనందువలన, వెంటనే స్థానిక కార్మికులకు ఉపాధి చూపాలని అన్నారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు 5 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏసిఎల్, డిసిఎల్‌లను నియమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, రేషన్ కార్డునేఫ్యామిలీ మెంబర్ కార్డుగా గుర్తించి, చనిపోయిన కార్మిక కుటుంబాలకు పూర్తి బెనిఫిట్స్ అందించాలని, రేషన్ కార్డు లేని కార్మికులకు ఆధార్ కార్డునే గుర్తింపు కార్డుగా లేబర్ కార్డుల జారీ చేయాలని, చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాజుల పోశెట్టి, దుంద్రపెల్లి రవీందర్, శ్రీరాముల నర్సయ్య, పోచమల్లు, మల్లయ్య, లక్ష్మి రాజాం, మల్లేశం, శేఖర్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలను చైతన్య పరిచేందుకే 'బిసి హక్కుల సాధన సమితి'

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు




**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** బిసిలను రాజ్యాధికారం వైపు నడిపించేందుకే బిసి హక్కుల సాధన సమితి ఏర్పాటు అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు అన్నారు. బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా సమావేశం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో శుక్రవారం బొట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ధనుంజయ నాయుడు మాట్లాడుతూ వెనక్కి నెట్టివేయబడ్డ బిసి కులాలను ఆర్థిక, సామాజిక రాజకీయ రంగాలలో తమ వాటా సాధించుకునే దిశగా చైతన్య పరచే బాధ్యతను బిసి హక్కుల సాధన సమితి తీసుకుంటుందని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో తెలంగాణ బిసి హక్కుల సాధన సమితి బలమైన నిర్మాణ సంఘంగా అవతరించి, ఉత్పత్తి శక్తులైన బిసిలను రాజ్యాధికారం వైపు నడిపిస్తుందని అన్నారు. సకల రంగాల్లో తమ వాట సాధించుకోవాలంటే మోడీ నాయకత్వాన ఉన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే దేశంలో కులగణన జనగణన చేయాలని, ఈ కులగణన జనగణన లెక్కల ప్రకారం ఎవరి వాటా వారికి ఇవ్వాలని, ఆ రకంగా బిసిల జనాభా నిష్పత్తి ప్రకారం విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంటు, స్థానాలలో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు తమ కమిటీలలో బిసిలకు వారి నిష్పత్తి ప్రకారం స్థానం కల్పించాలన్నారు. హిందూ మతానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకుంటున్న బిజెపి, మోడీ ప్రభుత్వం హిందూ మతంలోని బిసి కులాలను ఎందుకు లెక్కించడం లేదని ప్రశ్నించారు. బిసిలకు రిజర్వేషన్లు అనేసరికి యాభై శాతం పరిమితిని గుర్తుచేసే సుప్రీంకోర్టు ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను ఏ ప్రాతిపదికన సామాజిక స మానత్వంగా పరిగణించిందో అర్థం కావడం లేదన్నారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు పెంచడం వలన 50% రిజర్వేషన్ల పరిమితిని దాటలేదా అనీ ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో బిసి హక్కుల సాధన సమితి అన్ని జిల్లా కమిటీలు, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలలో నిర్మాణం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ బిసి హక్కుల సాధన సమితి విస్తృతంగా కార్యక్రమాలు చేయబడుతుందని అందులో భాగంగానే డిసెంబర్ 25న నిచ్చెన మెట్ల వ్యవస్థను నిర్మించి బిసిలను దళితులను గుడికి బడికి దూరం చేసిన మనస్మృతిని దగ్ధం చేసే కార్యక్రమాన్ని తీసుకున్నామన్నారు.ఈ సమావేశంలో, హన్మకొండ జిల్లా బిసి హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి పాల్గొని మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిసిలను ఒకే వేదికపై సమీకరించటానికి బిసి హక్కుల సాధన సమితి కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మోటం కుమారస్వామి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న 4వ రోజు నిరవధిక సమ్మె శిబిరానికి హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ విద్యాశాఖలోని సమగ్ర శిక్ష మన రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నదని ఇందులో పనిచేస్తున్న ఉద్యోగులను రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్,రాత పరీక్ష ద్వారా జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీచే ఇంటర్వ్యూలలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసి వివిధ స్థాయిలలో విధులు నిర్వహిస్తున్నారు. గత 18 నుండి 20 సంవత్సరాలుగా సర్వ శిక్ష ఉద్యోగులు పాఠశాల విద్య అభివృద్ధి కోసం వారి నైపుణ్యాన్ని కృషిని అందిస్తున్నారు. వీరిలో చాలామంది ఆర్థికంగా వెనుకబడిన పేద మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, పేస్కేల్ వర్తింపచేయాలని, ప్రతి ఉద్యోగి కి జీవిత బీమా రూ.10 లక్షలు ,ఆరోగ్య బీమా రూ.10లక్షలు సౌకర్యం కల్పించాలని, పదవి విరమణ చేస్తున్న వారికి రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెపుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా శ్రమదోపిడికి పాల్పడుతున్నాయని ఆరోపించారు. కాంట్రాక్టు వ్యవస్థ దోపిడి వ్యవస్థ అని కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి అందులో పని చేస్తున్న వారందరిని పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్వ శిక్ష ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి ఎఐటియుసి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు.ఈ సమ్మెలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మెలుగురి కృష్ణ, ప్రధాన కార్యదర్శి బొమ్మగాని రాజు, క్రాంతి లింగయ్య,క్రాంతికుమార్, మహేందర్, నీలాంబరి తదితరులు పాల్గొన్నారు.



# ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం..

## ఏడుగురు మృతి

**చెన్నై :** తమిళనాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. దిండిగల్ జిల్లా గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఆసుపత్రిలో చిక్కుకుపోయిన రోగులను రక్షించి ఇతర ఆసుపత్రులకు తరలించారు. పొగ కారణంగా స్పృహ కోల్పోయిన కొందరు సిబ్బందిని సైతం రక్షించి చికిత్స నిమిత్తం వేరే ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఓ బాలుడు కూడా ఉన్నట్లు తెలిసింది. మెడికల్ ఫెసిలిటీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అనేక రాష్ట్రాలలో విజృంభిస్తున్న గవదబిళ్ళల వ్యాధి

## తక్షణం టీకా తిరిగి ప్రవేశపెట్టండి

## కేంద్ర ఆరోగ్యమంత్రికి సిపిఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా లేఖ

**న్యూఢిల్లీ :** గవదబిళ్ళల వ్యాధి విపరీతంగా వ్యాప్తి చెందుతున్నందువల్ల దాని నివారణకు తక్షణం టీకాను పునఃప్రవేశపెట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శి అన్నీ రాజా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలోపెట్టుకుని తక్షణం ఈ టీకాను అమలులోకి తీసుకు రావాలని కోరారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖామంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు ఈ మేరకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. గవదబిళ్లల నివా రణకు వీలుగా టీకాను తక్షణం పునఃప్రవేశపెట్టాలని శుక్రవారంనాడు కేం ద్రమంత్రికి అన్నీరాజా ఒక లేఖ రాశారు. మంత్రి జోక్యం ద్వారా గవదబిళ్ళల నివారణ టీకాను కూడా సార్వత్రిక రోగనిరోధకశక్తి పెంపు కార్యక్రమం (యు ఐపి)లో రెగ్యులర్ ప్రక్రియగా చేరుస్తారని ఆశిస్తున్నట్లు అన్నీరాజా ఆ లేఖలో ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 194 దేశాలలో 123 దేశాలు ఈ టీకాను గత ఏడాది డిసెంబరులోనే సార్వత్రిక రోగనిరోధ శక్తి పెం పు కార్యక్రమంలో చేర్చాయని ఆమె ఈ సందర్భంగా మంత్రిదృష్టికి తీసుకు వచ్చారు. అనేక రాష్ట్రాలలో గవదబిళ్లల వ్యాధి భారీగా విస్తరిస్తోందని, దీనిని అరికట్టేందుకు టీకాను పునఃప్రవేశపెట్టాలని ఆయన కోరారు. ఇటీవల వస్తు న్న వార్తల ప్రకారం ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలలో ఈ గవదబిళ్లల



వ్యాధి బాగా విస్తరిస్తున్నదని అన్నీరాజా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గడచిన కొద్ది సంవత్సరాలుగా ఈ రాష్ట్రాలలో ఈ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయని, ప్రత్యేకించి కేరళ రాష్ట్రంలో గవదబిళ్లల వ్యాధి కేసులు చాలా ఎక్కువగా నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 2000 కేసులు గత ఏడాది కేరళలో నమోదైనట్లు ఆమె మంత్రిదృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుత 2024 సంవత్సరంలో కూడా తాను ఈ లేఖ రాసే సమయానికి 69,000 కంటే ఎక్కువగా కేసులు నమోదైనట్లు అన్నీరాజా పేర్కొన్నారు. పిల్లలలో పెద్దలలో తీవ్రమైన మెదడుపొర శోథ (మెనింజోసెఫలటిస్) నొప్పి కేసులు బాగా పెరుగుతున్నాయని ఆరోగ్యశాఖ నిపుణులు ప్రముఖంగా చెబుతున్న విషయాన్ని ఆ లేఖలో అన్నీరాజా ప్రస్తావించారు. ప్రతిపదిమందిలో ఒక రు మెదడు పైపొరలో తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నారని ఆమె మంత్రి దృష్టికి తీసుకువచ్చా రు. దీనిని తక్షణ సమస్యగా పరిగణించి చర్యలు తీసుకోవాలని మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాను కోరారు. చాలా అసాధారణమైన పద్ధతులలో కేంద్రీయ నాడీ వ్యవస్థపై చెవి లోపల ఈ గవదబిళ్లల వైరస్ లక్ష్యంగా చేసుకుని తీవ్రమైన నొప్పిని కలగజేస్తున్నదని, ఈ కేసుల పరిష్కారానికి టీకాను తిరిగి తక్షణం ప్రవేశపెట్టాలని కోరారు. క్లోమగ్రంథిలో, స్త్రీలకు సంబంధించిన బీజకోశాలలో ఈ వైరస్ అభివృద్ధిచెంది తీవ్రంగా బాధిస్తోందని, దీనివల్ల నాడీమండలంలోని పొరల్లో తీవ్రమైన నొప్పితోపాటు మెదడువాపు వ్యాధి, తీవ్రమైన చెముడు, క్లోమములో నొప్పి, స్త్రీలలో స్తనాలకు సంబంధించిన వాపులు, వృషణాలవాపు వంటి అనేక సమస్యలు శరీరంలో వస్తున్నాయని, దీని వల్ల ఒకరకంగా చెముడు వస్తోందనీ, ఆకస్మికంగా ఏమీ వినిపించకుండా పోతోందనీ, ఈ విధంగా ప్రతి 20 వేలమందిలో ఒకరు ఈ వ్యాధులబారిన పడి రోగులుగా మారుతున్నారని అందువల్ల వెంటనే టీనాను తిరిగి ప్రవేశపెట్టాలని అన్నీరాజా కేంద్రమంత్రికి ఆ లేఖలో డిమాండ్ చేశారు.

పైన పేర్కొన్న వాస్తవాలన్నింటీనీ పరిగణనలోకి తీసుకుని గవదబిళ్లల కేసులు, సంబంధిత వైరస్ విపరీతంగా వ్యాప్తి చెందకుండా అడ్డుకోవాలని, ఈ విషయంలో తక్షణం జోక్యం చేసుకుని తగిన ఆదేశాలు జారీ చేయాలని కేంద్రమంత్రికి అనీ రాజా విజ్ఞప్తి చేశారు.

## 'ఒకే భారతదేశం, సమున్నత భారతదేశం'

# స్ఫూర్తితో మహా కుంభమేళా



**ప్రయాగరాజ్:** కులమతాలకు అతీతంగా ప్రజలందర్నీ ఏకం చేసే మహా యజ్ఞమే కుంభమేళా అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'ఒకే భారతదేశం, సమున్నత భారతదేశం' అనే సందేశాన్ని సంగమ స్నానం ద్వారా దేశవాసులు చాటుతారని అన్నారు. ఎంతరెందరో సాధువులు, సన్యాసులు, రుషులు, పండితులు, సాధారణ ప్రజానీకం కలిసికట్టుగా మూడు నదుల సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తారని, కులాల మధ్య అంతరాయాలు, మత ఘర్షణలు ఇక్కడ మటుమాయమవుతాయని చెప్పారు. మహాకుంభమేళా ద్వారా దేశానికి, సమాజానికి సానుకూల సంకేతాలు వెళ్తాయన్నారు. ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమం (గంగ–యమున–సరస్వతి కలిసే చోటు)లో శుక్రవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ప్రధాని అనంతరం జరిగిన 'మహాకుంభ్' కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. వచ్చే ఏడాది జరిగే మహాకుంభ మేళా దేశ సంస్కృతి, ఆధ్యాత్మికతను సమున్నత శిఖరాలకు చేరుస్తుందన్న ఆశాభావాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. మహాకుంభ మేళా విజయవంతానికి పాటుపడుతున్న వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులను ప్రధాని అభినందించారు. ప్రయాగరాజ్ గడ్డ సరికొత్త చరిత్రను సృష్టించడం ఖాయమని అన్నారు. ఒకే మాటలో చెప్పాలంటే మహాకుంభ మేళాతో జరిగే ఈ ఐక్యతా మహాయజ్ఞం గురించి యావత్ ప్రపంచం చర్చించుకుంటుందన్నారు. ఎలాంటి కమ్యూనికేషన్ లేని రోజుల్లోనే మహాకుంభమేళా వంటి కార్యక్రమాలు సామాజిక మార్పులకు పునాది వేశాయని, ఇలాంటి సందర్భాలే దేశ ఐక్యతా సంకేతాన్ని దశదిశలా చాటుతాయని తెలిపారు. కుంభ్, ఇతర మతపరమైన తీర్థయాత్రలను గత ప్రభుత్వాలు సరైన అవగాహన లేక నిర్లక్ష్యం చేశాయని ప్రధాని విమర్శించారు. భక్తులు అనేక ఇక్కట్లకు గురయ్యేవారని, కానీ ఈసారి ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు. ఇప్పుడు భారత సంస్కృతిని గౌరవించే ప్రభుత్వాలు అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఉన్నట్టు తెలిపారు. రాబోయే కుంభమేళాకు సౌకర్యాల కల్పనను డబుల్ ఇంజన్ గవర్నమెంట్ ఒక బాధ్యతగా తీసుకుంటుందని తెలిపారు. కాగా, ప్రధానితో పాటు ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందిబెన్ పటేల్ పాల్గొన్నారు.

# దల్లేవాల్‌ను పరామర్శించిన టికాయత్

**ఖచండీగఢ్:** నౌరీ సరిహద్దువద్ద ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న పంజాబ్ రైతు నాయకుడు జగ్‌జిత్ సింగ్ దల్లేవాల్‌ను శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు రాకేష్ టికాయత్ కలిసి పరామర్శించారు. ఆయన ఎస్‌కెఎం నాయకుడు లఖోవాల్‌తో కలిసివెళ్లి దల్లేవాల్‌ను పరామర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జగ్‌జిత్‌సింగ్ దల్లేవాల్ చేస్తున్న ఆమరణ నిరాహారదీక్ష నేటికి 18వ రోజుకు చేరుకుంది. టికాయత్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల గ్రూప్‌లన్నీ సంఘటితమై ''సంయుక్త పోరాటం' చేయాలని పిలుపునిచ్చారు.విలేకరులు అడిగిన ప్రశ్నకు భారతీయ కిసాన్ యూనియన్ అధికార ప్రతినిధి కూడా అయిన రాకేష్ టికాయత్ సమాధానమిసూ 'దల్లేవాల్ జీ మాకు పెద్ద నాయకుడు. మేం ఆయన ఆరోగ్యం పట్ల ఆందోళన చెందుతున్నాం. మేమే కాదు యావత్ భారతదేశం కూడా ఆందోళన చెందుతోంది. ప్రభుత్వం అపరాధం చేస్తోంది. ఆయన ఆమరణ నిరాహారదీక్షను విరమింపజేసేందుకు, డిమాండ్లపై చర్చలు జరిపేలా లేదు అనేది స్పష్టమవుతోంది' అని తెలిపారు. సంయుక్త పోరాటం చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటుచేసి అన్ని రైతుల గ్రూప్‌లతో మాట్లాడుతున్నామని విలేకరులకు వివరించారు. భవిష్యత్ కార్యాచరణ కోసం ఒక వ్యూహం ఉన్నదని టికాయత్ తెలియజేశారు.ఈసారి జాతీయ రహదారి చుట్టుపక్కలఅను కలిపే కెఎంపి



(కుండ్లిమానేసర్‌పల్వాల్ ఎక్స్‌ప్రెస్ వే) వద్ద ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు. ఢిల్లీ సరిహద్దులో 13నెలలపాటు ఆందోళనలు జరిగాయి. ప్రభుత్వానికి మరోసారి 4లక్షల ట్రాక్టర్లు కావాలి. ఈ సారి ఆందోళన కెఎంపి మీద ఉంటుంది. మేం కెఎంపిని సరిహద్దులుగా చేసుకోవాలి అని టికాయత్ విలేకరులు అడిగిన మరో ప్రశ్నకు సమాధానం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వారి ఎజెండాను అమలుపరిచేందుకు రైతుల సంఘాలు అన్నీ చీలిపోవాలనే ఎజెండా విధానాన్ని కలిగి ఉన్నట్లు అర్థమవుతోందనిత టికాయత్ ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటమే లక్ష్యం అని టికాయత్ స్పష్టం చేశారు.

# తమిళనాడులో భారీ వర్షాలు..

## పొంగిపొర్లుతున్న జలపాతాలు



**చెన్నై :** కుండపోత వర్షాలు తమినాడు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గత మూడు నాలుగు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో వరదలు పలు ప్రాంతాలను ముంచెత్తాయి. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పలు కాలనీలు నీట మునిగాయి. పలు ఇల్లు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా మరో 48 గంటల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం(ఐఎండి) హెచ్చరించింది. చెన్నై, మధురై, సేలం సహా 10 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాష్ట్రంలోని 10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. దీంతో అప్రమత్తమైన తమినాడు ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. మరోవైపు, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జలపాతాలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పర్యాటకులకు అనుమతి నిషేధించింది ప్రభుత్వం. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు అలర్ట్ చేశారు.

## తీర్పు ఇచ్చిన బెంచ్ ముందుకే

# 'ఇవిఎం వేరిఫికేషన్ పిటిషన్'

## సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** పాత పేపర్ బ్యాలెట్లను తిరిగి తీసుకురావాలన్న డిమాండ్‌ను తిరస్కరిస్తూ ఏప్రిల్‌లో తీర్పు వెలువరించిన ధర్మాసనంలోనే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఇవిఎం) విధానాన్ని రూపొందించాలనే కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేయాలని శుక్రవారం సుప్రీంకోర్టు తెలిపింది. ఇవిఎంల అభ్యర్థన పిటిషన్ విచారణకు వచ్చిన సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, పిబి వరాలే ద్విసభ్య ధర్మాసనం పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణను ఉద్దేశించి ఈ అంశంపై విచారణ ఇంతకు ముందున్న బెంచ్‌లోకే ఎందుకు వెళ్లకూడదు అని ప్రశ్నించింది. ఇవిఎంపై దాఖలైన పిటిషన్ల బ్యాచ్‌పై ఏప్రిల్‌లో తీర్పు వచ్చింది అని తెలియజేస్తుండగా జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందిస్తూ 'అందుకే నేను చెబుతున్నా. ఈ పిటిషన్ అదే బెంచ్ ముందుకు వెళ్లాలని చెబుతున్నాను' అని జస్టిస్ నాథ్ పునరుద్ఘాటించారు. దీనిపై బెంచ్ మాట్లాడుతూ 'మా అవగాహన ప్రకారం..భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32ప్రకారం ఈ పిటిషన్ ద్వారా క్లెయిమ్ చేయబడిన రిలీఫ్‌లకు 2024 సంవత్సరం ఏప్రిల్ 26 నాటి తీర్పు ప్రకారం ఈ కోర్టు జారీ చేసిన ఆదేశాలకు వివరణ / సవరణ/ అమలు చేయవలిసి ఉంటుంది. ఏప్రిల్ 26న సుప్రీంకోర్టు ఇవిఎంలలో అనుమానాస్పద తారుమారు 'నిరాధారమైనది'అని పేర్కొంది.

## గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద

# గృహ నిర్మాణానికి సహాయం పెంచాలి

## పార్లమెంటరీ స్థాయి సంఘం సిఫార్సు

## పెన్షన్ మొత్తాన్నీ పెంచాలని సూచన





**న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం (పిఎంఎవై–జి) కింద ఇచ్చే ఆర్థిక సహాయాన్ని సముచితంగా పెంచాలని పార్లమెంటరీ స్థాయి సంఘం సిఫార్సు చేసింది. రెండు కోట్ల ఇళ్ళను అదనంగా నిర్మించే లక్ష్యంతో ఈ పథకాన్ని ఇప్పటికే 2029 మార్చి వరకు పొడిగించారు. కాంగ్రెస్ ఎంపి సప్తగిరి శంకర్ ఉలక నేతృత్వంలోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ పార్లమెంటరీ స్థాయి సంఘం పథకం కింద ఇచ్చే నిధుల గురించి చర్చించింది. ఏళ్ల తరబడి ఆవాస్ యోజన పథకం కింద రూ.1.2 లక్షలు మాత్రమే ఆర్థిక సహాయం చేస్తున్నారని, దీంతో అనేక ఇళ్ళు నిర్మాణం పూర్తికాకుండా అసంపూర్తిగా నిలిచిపోయాయని పేర్కొంది. లబ్దిదారులకు 'చేయి తిరిగేలా సరైనరీతిలో' సరైన సమయంలో , సరైన మొత్తాన్ని ఆర్థిక సహాయం కింద అందించే వరకు పథకం లక్ష్యం నెరవేరదని లోక్‌సభ ముందుంచిన స్థాయి సంఘం నివేదికలో తెలిపింది. ఇళ్ళు లేని సుమారు 2 లక్షల మంది లబ్దిదారులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమి కోసం లేదా సహాయం కోసం ఎదురు చేస్తున్నారని, ఇది కూడా లక్ష్యాన్ని చేరుకోవడంలో జాప్యానికి కారణమవుతుందని నివేదిక వివరించింది. పిఎంఎవై–జి కింద యూనిట్‌కు మైదాన ప్రాంతాలలో రూ.1.2 లక్షలు, కొండ ప్రాంతాలలో రూ.1.3 లక్షల చొప్పున ఆర్థిఖ సహాయం చేస్తుందని, చాలా కాలంగా ఆ మొత్తం అలాగే ఉందని స్థాయి సంఘం తెలిపింది. ముడి సరుకు, రవాణా, లేబర్ ఖర్చు తదితరాలపై పెరిగిన ద్రవ్యోల్బణం ప్రభావం చూపుతుందని, దీంతో పిఎంఎవై–జి కింద పేదలు, అవసరమైన లబ్దిదారులకు గృహ నిర్మాణం కష్టతరంగా మారిందని నివేదిక తెలియజేసింది. అవసరమైన నిధులు లేక అనేక చోట్ల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయని, దీంతో లక్ష్య సాధనలో ఈ పథకం వెనబడిందని పేర్కొంది. వచ్చే ఏడాది మార్చి నాటికి 2.66 కోట్ల ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంలో భాగంగా అక్టోబర్ 22 నాటికి 2.66 కోట్లు నిర్మాణమయ్యాయని, 29 లక్షలు ఇప్పటికీ పూర్తికాలేదని కమిటీ తెలిపింది. వచ్చే ఐదు ఆర్థిక సంవత్సరాల(2024 – 2029)లో రెండు కోట్ల అదనపు గృహాలు నిర్మించాలనే లక్ష్యానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని పేర్కొంది. యూనిట్‌కు ఇచ్చే సహాయాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని సమీక్షించాలని, ప్రత్యేకించి 2029 మార్చి వరకు పెంచిన తరుణంలో అత్యంత అవసరమని కమిటీ సూచించింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం గడువులోగా పూర్తి చేసేలా , ఆ పనిలో భాగస్వాములైన ఏజెన్సీలతో గ్రామీణాభివృద్ధి శాఖ అవకాశాలను పరిశీలించాలని సిఫార్సు చేసింది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం 5.73 లక్షల భూమిలేని లబ్దిదారులను పిఎంఎవై–జి కింద గుర్తించారని, అందులో 59 శాతం మంది అంటే 3.60 లక్షల మందికి ఇంటి నిర్మాణం కోసం భూమి కేటాయించారని తెలిపింది. భూమి లేకపోవడమనే అంశం ఈ పథకం పురోగతిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, ఇది కూడా లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆలస్యానికి కారణమవుతుందని కమిటీ పేర్కొంది. జాతీయ సామాజిక సహాయ పథకం (ఎన్ఎస్ఎపి) గురించి కూడా స్థాయి సంఘం పరిశీలన జరిపింది. కేంద్ర ప్రాయోజిత పథకం కింద వయోవృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బిపిఎల్ కుటుంబాలలో ఇంటి యజమాని చనిపోతే కుటుంబాలకు ఇచ్చే పెన్షన్‌లు సుదీర్ఘ కాలం రూ.200 నుంచి రూ.500 మాత్రమే ఇవ్వడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. గడిచిన రెండేళ్ళలో జీవన వ్యయం విపరీతంగా పెరగడంతో పెన్షన్ మొత్తంతో అతి తక్కువ పెన్షన్‌తో జీవనం దుర్భరంగా మారిందని కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది.

# స్కూళ్లకు మరోసారి బాంబు బెదిరింపు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని పలు పాఠశాలలకు ఫేక్ బాంబు బెదిరిం పులు మరోసారి కలకలం రేపా యి. నగరంలోని సుమారు 33 పాఠశాలలకు శుక్రవా రం ఉదయం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చా యి. దీంతో ఆయా స్కూళ్లలో తనిఖీలు నిర్వహించామని పోలీసులు వెల్లడించారు. అయితే అను మానాస్పదంగా ఏమీ కనిపించలేదని పేర్కొన్నారు. మెయిల్స్ అన్నీ ఒకే ఇ–మెయిల్ నుంచి వచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈస్ట్ కైలాష్‌లోని ఢిల్లీ పబ్లి క్ స్కూల్, పశ్చిమ్ విహార్‌లోని భట్నాగర్ ఇంటర్నేషనల్ స్కూల్, శ్రీని వాస్ పురిలోని కేంబ్రిడ్జ్ స్కూల్, ఇతర పాఠశాలకు బెదిరింపులు వచ్చాయి. బాంబు స్క్వార్డ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో చాలా పేలుడు పదార్థాలు ఉన్నాయని... విద్యార్థులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించినప్పుడు వారి బ్యాగ్‌ను తరచుగా తనిఖీ చేయరని అన్నారు. ఒక రహస్య డార్క్ వెబ్ గ్రూప్ ఈ కార్యకలాపంలో పాల్గొంటుందని పోలీసులు తెలిపారు. స్కూల్స్‌లో పేరెంట్–టీచర్ సమావేశం, క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యా ర్థులు మైదానంలో ఉన్నప్పుడు పేలుడు జరగవచ్చని ఇ– మెయిల్‌లో ఆగం తకులు పేర్కొన్నారు. డిసెంబర్ 9న 44 స్కూల్స్‌కి ఇ– మెయిల్ ద్వారా ఫేక్ బాంబు బెదిరింపులు వచ్చాయి. 30 వేల డాలర్లు ఇవ్వకపోతే స్కూల్స్ పేల్చే స్తామని బెదిరించారు.ఫేక్ బాంబు బెదిరింపు ఇ–మెయిల్ ఐపి అడ్రస్ న్యూ యార్క్‌లో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు.

**ముమ్మర తనిఖీలు.. :** దాదాపు 30 పాఠశాలలకు ఈ తరహా బెదిరింపులు అందడంతో.. ఒక్కసారిగా కలకలం రేగింది. దీంతో పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను మళ్లీ ఇళ్లకు పంపివేశారు. అనంతరం ఆయా పాఠశాలల్లో పోలీసులు, భద్రతా సిబ్బంది ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇవి నకిలీ బెదిరింపుగా గుర్తించామని ఢిల్లీ పోలీస్ పిఆర్‌ఒ సంజయ్ త్యాగి వెల్లడించారు. అయితే దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అందులోభాగంగా బాంబు బెదిరింపులు అందిన ఇ–మెయిల్ ఇపి అడ్రస్ ఎక్కడ నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**భద్రత కల్పిస్తాం: సంజయ్ త్యాగి**

నగరంలోని అన్ని స్కూళ్లు, విద్యార్థులకు భద్రత కల్పిస్తా మని ఈ సందర్భంగా సంజయ్ త్యాగి భరోసా ఇచ్చారు. డిపిఎస్ ఆర్కే పురం, జీడీ గోయెం కా తోపాటు దాదాపు 44 స్కూళ్లకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయని వివరించారు. ఈ నేపథ్యంలో స్కూల్ యాజ మాన్యం.. విద్యార్థులను ఇంటికి పంపి.. అనంతరం దీని పై పోలీసులకు సమాచారం అందిం చాయని తెలిపారు. ఆదివారం రాత్రి 11.38 గంటలకు పాఠశాల భవనాల్లో పలు బాంబులు అమర్చినట్లు ఇ– మెయిల్ ద్వారా పాఠశాలల యాజమా న్యాలకు బెదిరింపులు వచ్చాయన్నా రు. ఈ బాంబులు పేలకుండా ఉండాలం టే.. రూ. 30 వేల యూఎస్ డాలర్లు తమకు అందజేయాలని ఈ మెయిల్ పంపిన వ్యక్తులు డిమాండ్ చేశారని వివరించారు.

**అరవింద్ కేజ్రీవాల్ ఆందోళన.. :** మరోవైపు దేశ రాజధానిలో శాంతి భద్రతల పరిస్థితిపై మాజీ సిఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో శాంతి భద్రతలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. గతంలో ఈ తరహా ఘటనలు ఎప్పుడు లేవని గుర్తు చేశారు. దీనిపై ఢిల్లీ ప్రజలకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని తన ట్విట్టర్ వేదికగా మాజీ సీఎం కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.

**ఢిల్లీలో శాంతి భద్రతలు విఫలం: ముఖ్యమంత్రి అతిషి**

ఇక ఢిల్లీ వేదికగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై ముఖ్యమంత్రి ఆతిశీ సైతం స్పందించారు. ఢిల్లీలో శాంతిభద్రతల పరిస్థితి ఇంతకు ముందెన్నడూ ఇలా లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రజలకు భద్రత కల్పించడంలో కేంద్రంలోని బిజెపి ఘెరంగా విఫలమైందని ఆరోపించారు. ఇక ఆప్ నేత, మనీశ్ సిసోడియా సైతం స్పందించారు.తమ పిల్లలు సుర క్షితంగా లేరనే విషయం.. తమను తీవ్ర ది గ్భ్రాంతికి గురి చేస్తుంద న్నారు.

ఢిల్లీలో బిజెపి భయా నక వాతావ రణాన్ని సృష్టిం చిందని ఆయ న ఒకింత ఆం దోళన వ్యక్తం చేశారు.

ఢిల్లీ లో శాంతి భద్ర తలు కుప్ప కూలాయని మనీశ్ సిసోడి యా విమర్శించారు.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE AT BHUPALPALLY

O.S.No. 275 OF 2024

Between:

1) Puli Hari Krishna, S/o Late Puli Ramchander Rao, Aged: 41 Years, Occu: Employee, R/o Q.No.MD 1007, 8 Incline Colony, Chelpur Village, Ghanpur (M) Mandal, Jayashankar Bhupalpally District, N/o H.No. 27-300/1, Hamali Wada, Mancherial.
2) Jonna Rajyalakshmi, W/o Koti Surya Prasad (D/o Late Puli Ramchander Rao), Aged: 39 Years, Occu: Housewife, R/o Q.No. MD 1007, 8 Incline Colony, Chelpur Village, Ghanpur (M) Mandal, Jayashankar Bhupalpally District, N/o H.No.5-14, Mangalapuram, Pathapadu, Krishna Rural District.

...Plaintiff

And

1. The State of Telangana through, District Collector, Mancherial District.
2. The Tahsildar, Mancherial Mandal & District.
3. The General Manager, Singareni Collieries Company Ltd. Bhupalpally, Jayashankar Bhupalpally District
4. To whom so it may ever concern

...Defendants

NOTICE

Please take notice that the above Plaintiffs filed the suit against the Defendants to declare them as legal heirs of the diseased i.e. Late **Puli Ramchander Rao, S/o Late Subba Rao** any person or persons having any objection may file their objections before the above mentioned Hon'ble Court on **03-01-2025 at 10-30 A.M.** either personally or through an advocate with due objections. If nobody appears before the Hon'ble Court on the said date, the matter will be heard and decided on merits.

//By Order of the Hon'ble Court//

Sd/- PAGADALA ANANDA RAO
ADVOCATE
Bhupalpally
Jayashankar Bhupalpally District.

## అవి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కాదు..

# ఇవిఎం ప్రభుత్వాలు : సంజయ్ రౌత్

**న్యూఢిల్లీ :** జమిలి ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఉద్ధవ్ థాక్రే శివసేన పార్టీ ఎంపి సంజయ్ రౌత్ తీవ్ర విమర్శలు చేశారు. జమిలి ఎన్నికల నిర్వహణపై సరైన పరిశోధన, సరైన సవరణలు జరగలేదని రౌత్ వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాక ప్రధాని నరేంద్రమోదీ 2029 వరకు పదవిలో కొనసాగుతాడనే నమ్మకం తనకు లేదని అన్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించి సరైన సవరణలు, పరిశోధన జరగలేదు. ప్రధాని ఎప్పుడూ తన మనసులోని మాటలు చెబుతుంటాడు. కానీ ప్రజల మనసులో ఏముంది..? ప్రతిపక్షాల మనసులో ఏముంది..? అనే విషయాలను గురించి ఆయన ఆలోచించరు. మోదీ 2029 వరకు ప్రధానిగా కొనసాగుతారనేది నాకు అనుమానమే. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పు. కేంద్రంలో, మహారాష్ట్రలో ఏర్పాటైన మీ ప్రభుత్వాలు ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కావు. అవి ఇవిఎంల ద్వారా ఏర్పాటైన ప్రభుత్వాలు' అని రౌత్ వ్యాఖ్యానించారు. మరోవైపు పలువురు కాంగ్రెస్ ఎంపిలు



కూడా జమిలి ఎన్నికలపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే అవకతవకలు జరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని అభిప్రాయపడ్డారు. జమిలి ఎన్నికలు జరగడంవల్ల ఎన్నికల ఖర్చు భారీగా తగ్గిపోయి దేశ జిడిపి 1.5 వరకు పెరిగే ఛాన్స్ ఉందని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ చెప్పడాన్ని కొందరు కాంగ్రెస్ ఎంపిలు తప్పుపట్టారు.

# పొరుగుదేశాలు ఒడిదొడుకుల పరిస్థితులు ఎదుర్కొంటున్నాయ్



**న్యూఢిల్లీ :** పొరుగుదేశాలలో వారి రాజకీయాలు వారికి ఉన్నాయని, వారి దేశాలలో ఒడిదొడుకు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని, ఆ పర్యవసానాలు మన దేశం మీద కూడా ఉంటుందని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. సంబంధాలు ముఖ్యమని, మనం పరిణతి చెందామని, పైచేయి సాధించేందుకు మనం పరిణామాలను ఉపయోగించుకోబోమన్నారు. లోక్‌సభలో శుక్రవారం నాడు భారత చైనా మధ్య సంబం ధాలుపై అడిగిన ప్రశ్న, దానికి అనుబంధంగా పొరుగుదేశాల పరిణమాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పొరుగుదేశాలలో అభివృద్ధి కార్యక్రమాలపై స్పందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు భారతదేశం, సంబంధిత దేశం రెండూ సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మనం ప్రాజెక్టుల సంఖ్య, వాణిజ్య పరిమాణం, జరుగుతున్న పరస్పర మార్పిడిని పరిశీలిస్తే, సమాధానం చాలా స్పష్టంగా ఉందని తాను భావిస్తున్నట్లు చెప్పారు. లద్దాఖ్‌లోని దేప్సాంగ్ లో తూర్పువైపున హద్దుల వరకు అన్ని పెట్రోలింగ్ పాయింట్‌లకు భారత భద్రతా బలగాలు వెళ్తున్నాయని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. చారిత్రకంగా ఇవి భారత పెట్రోలింగ్ ప్రాంతాలని వెల్లడించారు. చైనాతో ఒప్పందంలో భాగంగా దేప్సాంగ్, దేమ్చోక్ ప్రాంతాలు బలగాల ఉపసంహరణలో చివరివి అని లోక్‌సభకు తెలియజేశారు. భారత భూభాగంలో కొంత భాగాన్ని తమది అని ఆరోపి స్తున్న నేపాల్ కరెన్సీ చిత్రంపై అడిగిన ప్రశ్నకు జైశంకర్ సమాధానమిస్తూ, సరిహద్దు విషయంలో భారత్ వైఖరి చాలా స్పష్టంగా ఉందని అన్నారు.భారతదేశం పొరుగు దేశాల్లో ఎవరైనా ఏదైనా చేయడం ద్వారా భారతదేశ స్థితిని మార్చాలనుకుంటున్నారని భావిస్తే, అది జరగదని ఆయన అన్నారు. మయన్మార్‌లో చాలా గందరగోళ పరిస్థితుల కారణంగా, భారతదేశం మయన్మార్ సరిహద్దుకు దగ్గరగా నివసించే ప్రజలు ఎటువంటి పత్రాలు లేకుండా ఒకరి భూభాగంలోకి మరొకరు 16 కి.మీ.కి వెళ్లేందుకు వీలు కల్పించే ఫ్రీ మూవ్‌మెంట్ రెజిమ్ (ఎఫ్ఎమ్ఆర్)ని భారతదేశం సమీక్షించాల్సి వచ్చిందన్నారు. అయితే సరిహద్దు వర్గాల అవసరాల పట్ల ప్రభుత్వం సున్నితంగా వ్యవహరిస్తోందని, ఆ దిశగా ఏదో ఒక పని చేస్తోందని ఆయన చెప్పారు.మయన్మార్ సరిహద్దు వెంబడి సవాలులో భాగమే మిటంటే, సరిహద్దుకు అవతలి వైపు చాలా తక్కువ ప్రభుత్వ అధికారం ఉంద ని, ఏది చేయవలసి వచ్చినా భారతదేశం స్వయంగా చేయాల్సి ఉంటుందని జైశంకర్ అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్‌ను సందర్శించే ముం దు 17 ఏళ్లుగా ఏ ప్రధాని కూడా నేపాల్‌కు వెళ్లలే దని, అయితే భారత్‌లో ఎవ రూ నేపాల్‌ను పట్టించుకోలేదని జైశంకర్ అన్నారు. శ్రీలంక దేశంలో మోదీ పర్యటించడానికి ముందు, 30 సంవత్స రాలుగా, ద్వైపాక్షిక పర్యటన లేదని ఆయన అన్నారు. మాల్దీవులలో భారతదేశం నిధులు సమకూర్చిన అడ్డూ లింక్‌రోడ్ ,పునరుద్ధరణ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి తానే స్వయంగా హాజరయ్యానని, అలాగే మనదేశంలో ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాల్దీవుల అధ్యక్షుడు హాజరయ్యారని, ఆ దేశంతో సంబంధాలపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష సభ్యుడు ఏదో ఒకవిధంగా ఈ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని చెడుగా చూపాలని కోరుకుంటే, అది సభ్యుడి హక్కు అని జైశంకర్ అన్నారు. శ్రీలంకలో హంబన్‌తోటను 2008లో చైనా నిర్మించిందని, అదే బంగ్లాదేశ్ 2014 వరకు ఉగ్రవాదులకు మద్దతు ఇస్తోందని, అదే మయన్మార్ భారతలో చొరబడే వారికి ఆతిథ్యం ఇస్తోందన్నారు.


ప్రజాపక్షం
శనివారం, డిసెంబరు 14

# ఇది ప్రారంభం మాత్రమే!

దొమ్మరాజు గుకేష్.. యావత్ దేశంలోనేకాదు, ప్రపంచమంతా మారుమోగుతున్న పేరు. 18 ఏళ్ల వయసులోనే ఒక అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన చదరంగం వీరుడు.14 రౌండ్ల ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ లింగ్ లిరెన్‌ను ఓడించి, ఈ టైటిల్ అందుకున్న పిన్నవయస్కుడిగా చరిత్ర సృష్టించడం ఆషామాషీ వ్యవహారం కాదు. గుకేష్ జైత్రయాత్రకు ఇది ప్రారంభం మాత్రమే. ఎంతో ఉజ్వల భవిష్యత్తు అతని కోసం వేచిచూస్తున్నది. రాచరికపు ఎత్తులు... రణతంత్రపు జిత్తులు చెస్ మూలాలు. క్రీస్తుశకం 6వ శతాబ్దంనాటి గుప్తుల కాలంలో ఉద్భవించిందని చెప్తున్న చెస్‌లో పావులే చతురంగ బలాలు. 64 గళ్ల బోర్డే యుద్ధ మైదానం. ఎప్పుడు, ఏ బలాన్ని, ఏ విధంగా ఉపయోగించాలో తెలియకపోతే యుద్ధంలో ఓటమి తప్పదు. మెదడు పాదరసంలా... మెరుపు వేగంతో ఆలోచిస్తే తప్ప రథ, గజ, హయ, పదాతిదళాలను సరైన దిశలో నడిపించలేం. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమందితో ఏకకాలంలో గేమ్‌లు ఆడడం... కళ్లకు గంతలు కట్టుకొని 'బ్లైండ్ ఫోల్డ్' ఎత్తులు వేయడం.. చెస్‌ను కొత్తపుంతలు తొక్కిస్తున్నాయి. ప్రేక్షకుల ఆసక్తిని పెంచుతున్నాయి. అనతొలి కార్పోవ్, గారీ కాస్పరోవ్, బాబీ ఫిషర్ వంటి సమర్థులు చెస్‌ను విశ్వవ్యాప్తం చేశారు. ఒక క్రీడగా ఎదగడంలో కీలకపాత్ర పోషించారు. 1961లో మాన్యుయెల్ ఆరోన్ భారత నుంచి తొలి అంతర్జాతీయ మాస్టర్ హోదాను సంపాదించిన నాటినుంచి మొదటి గ్రాండ్ మాస్టర్‌గా, ఆ తర్వాత ప్రపంచ చాంపియన్‌గా విశ్వనాథన్ ఆనంద్ ఎదగడం వరకూ మన దేశ ప్రస్థానం ఉజ్వలమై వెలిగింది. కొంత స్వల్ప విరామం తర్వాత తిరిగి స్వర్ణ యుగం ప్రారంభమైంది. ప్రజ్ఞానందన్ ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్‌ను గెల్చుకుంటే, గుకేష్ వరల్డ్ చాంపియన్‌గా అవతరించాడు. ఈ విజయాల వెనుక సంవత్సరాల కఠిన పరిశ్రమ ఉంది. మెదడు నరాలు చిట్లిపోయే స్థాయి ఒత్తిడి ఉంది. అంతులేని ఆత్మవిశ్వాసం... అనంతమైన పోరాటతత్వం జత కలిశాయి. వెరసి అంతర్జాతీయ వేదికలపై భారత ఆటగాళ్ల ఆధిపత్యం అప్రతిహతంగా సాగుతున్నది. ఈ ఒరవడిని గుకేష్ విజయం మరింత ముందుకు తీసుకెళ్లడం ఖాయం. చిన్న వయసులోనే ప్రపంచ చాంపియన్‌గా నిలవడం అతని ప్రతిభకు నిదర్శనం. 22 వయసులో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన గారీ కాస్పరోవ్ రికార్డును ఈ తెలుగువీరుడు బద్దలు కొట్టాడు. ఆటను నేర్చుకున్న 11 సంవత్సరాల్లోనే విశ్వవిజేతగా నిలిచాడు. తొలి గేమ్‌లోనే ఓడిన ఒక ఆటగాడు, ఆ తర్వాత నిలదొక్కుకోవడం కష్టం. కానీ, గుకేష్ మొదటి గేమ్‌ను కోల్పోయినా, రెండో గేమ్‌ను డ్రా చేసుకొని, మూడో గేమ్‌లో ఎదురుదాడి చేసి గెలిచాడు. అప్పుడే అతని సామర్థ్యం ఏమిటో ప్రత్యర్థికి అర్థమై ఉంటుంది. ఆచితూచి ఆడడం గుకేష్ స్థితప్రజ్ఞతకు నిదర్శనం. అవకాశం దక్కినప్పుడు ఎదురుదాడి చేసి, వీరుడి లక్షణాలు చాటుకున్నాడు. అపారమైన ఓర్పు, అనంతమైన ఆలోచనా పటిమ, అద్వితీయ వ్యూహ నైపుణ్యం అతని సొంతం. ఎక్కడా సహనం కోల్పోలేదు. ఏ దశలోనూ ఆత్మవిశ్వాసం వీడలేదు. ప్రత్యర్థి బలాన్ని గురించిన ఆలోచన గుకేష్‌కు అసలే లేదు. చదరంగం వంటి మేధోపరమైన స్పర్థలో ఒత్తిడే పరాజయానికి కారణమవుతుంది. ధైర్యమే విజయపథంలో నడిపిస్తుంది. గుకేష్ అనుసరించిన బాట ఏమిటో అతని విజయమే స్పష్టం చేస్తున్నది. ఒక టీనేజ్ కుర్రాడు విశ్వవేదికపై భారత కీర్తిపతాకాన్ని రెపరెపలాడించడం విశేషమైతే... అతను తెలుగు వాడు కావడం మరో ప్రత్యేకతను సంతరించుకుంది. అతనికి దేశం మొత్తం జేజేలు పలుకుతున్నది. గుకేష్.. యువతరానికి స్ఫూర్తి... మార్గదర్శి. ఈ ప్రారంభం అతని క్రీడా జీవితానికి తొలి మెట్టు. ఉన్నత శిఖరాల అధిరోహణలో మొదటి అడుగు.

# కమ్యూనిస్టు, సహకార సామ్రాట్ కామ్రేడ్ మానం

**సుప్రసిద్ధ సహకారవేత్త, సిపిఐ మాజీ శాసనసభ్యులు విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ పూర్వ చైర్మన్, చైర్మన్ ఎమిరిటస్ మానం ఆంజనేయులు విశ్రాంతి జీవితాన్ని స్వీకరిస్తున్న సందర్భంగా, కూకట్‌పల్లిలో అభినందన సభ సందర్భంగా వారి రాజకీయ, సహకారరంగం జీవిత విశేషాలు ఇస్తున్నాం – సం॥**



ఏడు పదుల ఉద్యమ ప్రస్థానంలో ఏనాడు ఆయన పోరాటం ఆగలేదు... ఎక్కడా వెనుకడుగు వేయలేదు. తన 14వ ఏట ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన మానం ఆంజనేయు లు గారు... విద్యార్థుల సమస్యలపై పోరుబాట పట్టారు... విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు... అంటూ నినదించారు... విశాఖ నగరంలో కార్మికుల గొంతుకై గర్జించారు... చట్టసభల్లో సామాన్యుల తరపున గళం విప్పారు... విశాల జనసమూహ విస్తృత ప్రయోజనాల కోసం సహకార రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. సహకార సామ్రాట్‌గా నిలిచారు మానం ఆంజనేయులు.

మానం ఆంజనేయులు ఒకప్పటి గుంటూరు జిల్లా... నేటి బాపట్ల జిల్లా అద్దంకి మండలం చిన్నకొత్తపల్లి గ్రామంలో మానం అంజమ్మ, వెంకటసుబ్బయ్య పుణ్యదంపతులకు 1939వ సంవత్సరంలో జన్మించారు. తమ స్వగ్రామంలోనే నాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నారు. పెదనందిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 7, 8 తరగతులు అభ్యసించారు. 9వ తరగతి నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకు అద్దంకిలోని ప్రకాశం బోర్డు హైస్కూలులో చదివారు. ఆంజనేయులు చిన్నతనం నుంచి చదువులో చురుకుగా ఉండేవారు. ఆయనలో అభ్యుదయభావాలు, సామాజిక చైతన్యం ఎక్కువగా ఉండేది. అందువల్లే ఆయన ఎస్ఎస్ఎల్‌సీ చదువుతుండగానే 1953వ సంవత్సరం ఆరంభంలో ఉవ్వెత్తున సాగిన ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో కేవలం 14 ఏళ్ల వయసులోనే పాల్గొన్నారు. నాటినుంచి ఆయన ఉద్యమ ప్రస్థానం ఏనాడు ఆగలేదు. ఏడు దశాబ్దాలుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా కొనసాగుతూనే ఉంది.

1954–1956 మధ్య పీయూసీ పూర్తి చేసిన ఆంజనేయులు గారు తన 17వ ఏట నాడు సీపీఐ నరసరావుపేట పట్టణ కార్యదర్శిగా ఉన్న కొండ్రగుంట వెంకటేశ్వర్లు నుంచి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. అప్పటికే ఆయన విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. డిగ్రీ చదివేందుకు గుంటూరు వెళ్లి ఎసి కాలేజీలో చేరారు. ఆయన విద్యార్థి ఉద్యమంలో కీలకంగా వ్యవహరిస్తుండటంతో కాలేజీ నుంచి డిస్మిస్ చేశారు. అయినా ఏమాత్రం వెరవలేదు.. తాను నమ్మిన పార్టీ జెండా వీడలేదు. ఎసి కాలేజీ బయటకు పంపిస్తే అక్కడే హిందూ కాలేజీలో చేరి డిగ్రీ పూర్తి చేశారు. గుంటూరు నగరంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్‌ను బలోపేతం చేయడంలో తనవంతు పాత్రను పోషించారు.

డిగ్రీ పూర్తిచేసిన అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ పెద్దల ఆదేశాల మేరకు ఆంజనేయులు 1964లో విజయవాడ వెళ్లి విశాలాంధ్ర దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా చేరారు.

ఆయనను 1968లో విశాఖపట్నానికి విశాలాంధ్ర రిపోర్టర్‌గా పంపించారు. విశాఖ వచ్చిన ఆయన ఒకవైపు జర్నలిస్టుగా ప్రజల సమస్యలపై వార్తలు రాస్తూనే... మరోవైపు ఆంధ్రా యూనివర్సిటీ ఎఐఎస్ఎఫ్ శాఖకు పార్టీ ఇన్‌చార్జిగా విద్యార్థి ఉద్యమంలోనూ ముందుండేవారు. అదే సమయంలో ఆంధ్రా యూనిర్సిటీలో ఎల్ఎల్‌బి పూర్తి చేశారు. ఆంజనేయులు 1971లో పూర్తిస్థాయిలో కమ్యూనిస్టు పార్టీ బాధ్యతల్లో నిమగ్నయ్యారు. 1971 నుంచి 1981 వరకు సిపిఐ విశాఖ తాలూకా సహాయ కార్యదర్శిగా, 1985 నుంచి 1986 వరకు విశాఖపట్నం తాలూకా కమిటీ కార్యదర్శిగా, 1988 నుంచి 1989 వరకు సిపిఐ విశాఖ సిటీ కార్యదర్శిగా, 1999 నుంచి 2002 వరకు సిపిఐ విశాఖ జిల్లా సమితి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. పేదల పక్షాన అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించారు. ఆయన 1976 నుంచి నేటికీ సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సభ్యునిగా కొనసాగుతున్నారు.





ఆంజనేయులు ఒకవైపు కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూనే... మరోవైపు పారిశ్రామిక నగరంగా విశాఖ ఎదుగుతున్న తరుణంలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం సాగిన అనేక కార్మికోద్యమాలకు నాయకత్వం వహించారు. వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు పర్మినెంట్ అయ్యేందుకు, చట్టబద్ధమైన హక్కులు పొంది ఆనందంగా, ఆరోగ్యంగా జీవించేందుకు దోహదపడ్డారు.

ఆంజనేయులు 1990 నుంచి 1993 వరకు ఎఐటియుసి విశాఖ జిల్లా సమితి అధ్యక్షుడిగా, 1978 నుంచి 2000 సంవత్సరం వరకు ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా, జాతీయ సమితి సభ్యుడిగా కొనసాగారు.

సమాజంపై సంపూర్ణ అవగాహన కలిగిన నిస్వార్థ నాయకుడు మానం ఆంజనేయులు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా విశాఖ జిల్లా పెందుర్తి నుంచి 1994 ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందారు. 1999 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 10వ శాసనసభ సభ్యుడిగా కొనసాగారు.

మానం ఆంజనేయులు గారి జీవితం నుంచి వేరుచేసి చూడలేని ఒక గొప్ప అంశం ది విశాఖపట్నం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్. ఈ బ్యాంక్ చైర్మన్‌గా 1983 నుంచి 2013 వరకు 30 ఏళ్లపాటు ఆంజనేయులు కొనసాగారు. సాహసోపేతమైన నిర్ణయాలు, వినూత్న పథకాలతో ఖాతాదారులను బ్యాంక్‌కు చేరువచేశారు. బ్యాంక్ సేవలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించారు. విశాఖపట్నం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను దేశంలోనే ఒక గొప్ప అర్బన్ సహకార బ్యాంక్‌గా నిలిపారు. 2013లో స్వచ్ఛందంగా చైర్మన్ పదవి నుంచి తప్పుకుని ప్రజాస్వామ్య పద్ధతిలో డైరెక్టర్లు అందరి సమ్మతితో విశాఖపట్నం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బాధ్యతలను చలసాని రాఘవేంద్రరావుకు అప్పగించారు. అంతటితో తన బాధ్యత తీరిపోయిందని ఆయన విశ్రాంతి తీసుకోలేదు... 2014 నుంచి 2023 వరకు బ్యాంక్ ఎమిరిటస్ చైర్మన్‌గా, 2023–24 మధ్య డైరెక్టర్‌గా బ్యాంక్ అభివృద్ధికి తనవంతు సూచనలు, సలహాలు ఇస్తూనే ఉన్నారు. కేవలం కోటి రూపాయల ఆర్థిక కార్యకలాపాలతో కొనసాగుతున్న అతిచిన్న విశాఖ బ్యాంకును నేడు 7,630.62 కోట్ల రూపాయల ఆర్థిక కార్యకలాపాలతో దక్షిణ భారతదేశంలో అగ్రగామి సహకార అర్బన్ బ్యాంకుగా నిలబెట్టడంలో ఆంజనేయులు కృషి, దార్శనికత ఎనలేనివి. మానం ఆంజనేయులు సహకార రంగం అధ్యయనం కోసం యూరప్‌లో పర్యటించారు. ఆర్‌బిఐ అధ్వర్యంలో న్యూజిలాండ్, ఫ్రాన్స్, నెదర్లాండ్, జర్మనీ దేశాల్లోనూ 40 మంది బృందంతో కలిసి పర్యటించి ఆయా దేశాల్లో సహకార రంగంలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేశారు.

దేశ, విదేశాల్లో సహకారరంగంపై అమోఘమైన అవగాహన కలిగి సహకారరంగ నిఘంటువుగా పేరొందిన మానం ఆంజనేయులు 1989 నుంచి 2019 వరకు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అండ్ క్రెడిట్ సొసైటీస్ డైరెక్టర్‌గా, 2010 నుంచి 2015 వరకు ఉపాధ్యక్షునిగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సహకారరంగ నిపుణుల కమిటీ సభ్యునిగా వ్యవహరించారు. రిజర్వు బ్యాంక్ నియమించిన టాస్క్‌ఫోర్స్ ఆన్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్స్ తొలి కమిటీ సభ్యుడిగా 2005 నుంచి 2019వరకు వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శిగా 1986 నుంచి 1994 వరకు, అధ్యక్షునిగా 1995 నుంచి 2012 వరకు, ఆ తర్వాత గౌరవాధ్యక్షునిగా సేవలు అందించారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫెడరేషన్‌కు సలహాలిస్తూ ప్రోత్సహిస్తున్నారు. విశాఖ జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల కార్యదర్శులు, కార్మికుల సంఘం గౌరవాధ్యక్షునిగా కూడా ఆంజనేయులు సామాన్య పాడి రైతులకు మేలు చేకూర్చేందుకు కృషి చేశారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో సాగిన ఉద్యమంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ వద్ద జరిగిన పోలీసు కాల్పులు, లాఠీచార్జ్‌లో మానం ఆంజనేయులు గాయపడ్డారు. అయినా ఆయనపైనే తిరిగి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అసలు విశాఖపట్నంలో కార్మికోద్యమాలపై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో తొలి పేరు మానం అంజనేయులుదే కావడం విశేషం.

సిహెచ్

# రైతు కష్టానికి దక్కని ఫలం!

టమోటా, మిర్చీ ధరలు పూర్తిగా నేల చూపు చూస్తున్నాయి, టమాట రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఆరుగాలం కష్టపడి పండించిన టమాటకుధర రాక దిగాలుపడే పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. రాష్ట్రంలో పలు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో ఈసారి టమాట పంట ఎక్కువ దిగుబడి ఉంది. రాయలసీమలో విస్తారంగా పండే టమాటా ఎక్కువగా మదనపల్లి, కోలార్, చిక్‌బల్లాపూర్ మార్కెట్టుకు వెళుతుంది. అక్కడ గ్రేడింగ్ అయిన తరువాత మళ్ళీ రాయలసీమలోని అనంతపురం, కర్నూలు మీదుగా హైదరాబాద్ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌కు వెళుతుంది. మార్కెట్టుకు తీసుకువచ్చిన టమాటా ధర కిలో రెండు రూపాయలకు పడిపోవడంతో అక్కడక్కడ రైతులు రోడ్డుపై పారబోసి, పశువులకు మేతగా వేసి నిరసన వ్యక్తం చేశారు. నిన్న వందల టన్నులు టమోటా మార్కెట్టు దగ్గర కుప్పలు పోశారు. ఆలూరు, పత్తికొండ కర్నూలులో టమాటో రెండు రూపాయలు కిలో, హైదరాబాద్‌లో ముప్పై రూపాయలు కిలో. గత మూడు సంవత్సరాల నుండి ధరల స్థిరీకరణ అనేది లేదు, రెండు సంవత్సరాలుగా వ్యవసాయ పనులు రెట్టింపు అయ్యాయి. గతంలో టమోటా నార వంద మొక్కలకు 60 రూపాయలు ఇప్పుడు వంద రూపాయలు. దుక్కి చేయడానికి, గట్లు చేయడానికి ఎకరాకు 1200 వ్యయం వచ్చేది ఇప్పుడు 3000రూపాయలు. రవాణా, టోల్ చార్జీలు, కూలీల రేట్లు విపరీతంగా పెరిగాయి. ఏ పంట ఎక్కడెక్కడ పండిస్తున్నారో తెలిపే నాథుడే లేదు. వ్యవసాయ అధికారులు గణాంకాలు పూర్తిగా మరచిపోయారు. వ్యవసాయం జూదంగా మారింది. టమాట పెద్దమొత్తంలో మార్కెట్‌కు రావడంతో డిమాండ్ పడిపోయింది. వ్యాపారులు సిండికేట్‌గా మారిపోయారు. గ్రామాల్లో చాలామంది రైతులు టమాట పంటను సాగుచేస్తున్నారు. నిత్యం టమాట, మిర్చీ వేకువ జామున బొలెరో, ఆటోల్లో మార్కెట్టుకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. దీంతో టమాట ధర ఒకేసారి కిలో రెండు రూపాయల చొప్పున 35కిలోల క్యారెట్ 80 నుంచి 100 రూపాయల వరకు పలికింది. సగానికి పైగా ధర తగ్గించేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు పెట్టిన పెట్టుబడులు, రవాణా చార్జీలు కూడా రానిపరిస్థితి రావడంతో కన్నెర్ర చేశారు. వ్యాపారుల కు అమ్మే బదులు రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తం చేశారు. రైతు నిర్ణయించాల్సిన ధరను వ్యాపారులు నిర్ణయం తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం అని బూటకపు మాటలు మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతుల



సంక్షేమం గురించి పట్టించుకోకుండా సంబరా లు జరుపుకుంటున్నారు. రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సహాయం పూర్తిగా విస్మరించారు, రైతు బీమా, ఇన్పుట్ సబ్సిడీ, మంచి విత్తనం, యూరియా, కంపోస్ట్, డిఎపి, ఫంగిసైడ్ ఎరువులు అందుబాటులో లేవు. గత దశాబ్దకాలంగా కోల్ స్టోరేజ్ యూనిట్స్, ధాన్యం నిలువ చేసుకోవడానికి వేర్‌హౌస్‌లు లేక రైతులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. సరఫరా గొలుసు అనేది ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వస్తువులను రవాణా చేయడం, దాని సంక్లిష్టతలు సాధారణ రవాణాకు మించినవి. రైతు ఆత్మహత్యల సమస్య నిజానికి ఒక విషాదకరమైన సంక్లిష్టమైన సమస్య, ఇది సరఫరా గొలుసు సవాళ్లకు మాత్రమే పరిమితం కాకుండా బహుళ కారణాలచే ప్రభావితమవుతుంది. అస్థిరమైన మార్కెట్ ధరలు, అధిక ఇన్పుట్ ఖర్చులు, రుణం బీమాకు సరిపడా ప్రాప్యత, నీటి కొరత, పంట వైఫల్యా లు పరిమిత మార్కెట్ అవకాశాలు వంటి అనేక సవాళ్లను రైతులు ఎదుర్కొంటున్నారు. ఈ సవాళ్లు, ఇతర సామాజిక, ఆర్థిక వ్యక్తిగత అంశాలతో కలిపి రైతు ఆత్మహత్యల బాధాకరమైన పరిస్థితికి దోహదపడతాయి.

సరఫరా గొలుసు రైతుల జీవనోపాధిపై ప్రభావం చూపుతుండగా, రైతు ఆత్మహత్యలు విస్తృత వ్యవస్థాగత సమస్యలు వ్యక్తిగత పరిస్థితుల కలయిక నుండి ఉత్పన్నమవుతున్నాయి, వీటిని గుర్తించడం చాలా ముఖ్యం. రైతు ఆత్మహత్యల సమస్యను పరిష్కరించడానికి వ్యవసాయ సంస్కరణలు, సామాజిక మద్దతు వ్యవస్థ లు, మానసిక ఆరోగ్య అవగాహన, ఆర్థిక సహాయం స్థిరమైన వ్యవసాయ పద్ధతులతో సహా సమగ్రమైన బహుళ డైమెన్షనల్ విధానాలు అవసరం. మెరుగైన మౌలిక సదుపాయాలు, మార్కెట్లకు ప్రాప్యత, సరసమైన ధరల విధానాలు సమర్థవంతమైన లాజిస్టిక్స్ వంటి వ్యవసాయ సరఫరా గొలుసును మెరుగుపరచడానికి చేసే ప్రయత్నాలు, రైతులు ఎదుర్కొంటున్న కొన్ని సవాళ్లను తగ్గించడంలో ఖచ్చితంగా సహాయపడతాయి. రైతు శ్రేయస్సు కోరే ప్రభుత్వాలు తక్షణమే మధ్యవర్తు లు, బ్రోకర్లను కమిషన్ ఏజెంట్లను పక్కన పెట్టాలి, ప్రభుత్వం వేలం పాటను నిర్వహించాలి. కోల్ స్టోరేజి యూనిట్లు, మార్కెట్ సౌకర్యం, వేర్ హౌస్ నిర్మాణం చేపట్టాలి. రైతులు ధాన్యం నిలువ చేసుకోవడానికి గోదాములు గిడ్డంగులు ఏర్పాటు చేయాలి.

# అభివృద్ధికి కొలమానం.. తలసరి విద్యుత్ వినియోగం మాత్రమే!

భారత కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా 14 డిసెంబర్ రోజున జాతీయ శక్తి పొదుపు దినం (నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ డే) నిర్వహించుట ఆనవాయితీగా మారింది. దేశాభివృద్ధిలో శక్తి వనరుల పాత్ర అనిర్వచనీయం. దేశ ప్రగతిని కొలిచే ప్రమాణంగా తలసరి శక్తి వినియోగాన్ని తీసుకుంటారు. వివిధ కేంద్రాల్లో ఉత్పత్తి అవుతున్న శక్తిని ఆదా చేస్తూ,అవసరం మేరకు మాత్రమే విడుదల చేస్తూ, దేశాభివృద్ధికి బాటలు వేయడానికి 2002లో భారత ప్రభుత్వం బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిసియెన్సీ అనే సంస్థను నెలకొల్పడం జరిగింది. ఉత్పత్తి అవుతున్నశక్తిలో ప్రసార నష్టాలు, పంపిణీ నష్టాలను తగ్గిస్తూ ప్రతి ఒక్కరు బాధ్యతగా శక్తి వినియోగాన్ని విచక్షణతో చేయాల్సిన సమయం ఆసన్నమైనది.

**శక్తి వినియోగంలో భారతం:**
ప్రపంచదేశాల్లో చైనా, అమెరికా తర్వాత మూడవ అతిపెద్ద శక్తి వినియోగ దేశంగా భారత్ కు పేరు ఉంది. 2023–24 వివరాల ప్రకారం భారత్‌లో తలసరి విద్యుత్తు ఉత్పత్తి 1,395 కెడబ్ల్యుహెచ్‌గా నమోదు అయ్యింది. ఇందులో 43 శాతం వరకు హైడ్రో పవర్ ఉత్పత్తి అవుతున్నది. అత్యధిక తలసరి విద్యుత్ వినియోగ దేశాల జాబితాలో 53, 929 కెడబ్ల్యుహెచ్‌తో ఐస్‌లాండ్ ప్రథమస్థానంలో ఉండగా నార్వే (28,056 కెడబ్ల్యూహెచ్), కువైట్ (21,076 కెడబ్ల్యూహెచ్), ఖతార్(20,023 కెడబ్ల్యూహెచ్), యుఎఈ (17,342 కెడబ్ల్యూహెచ్) లాంటి దేశాలు జాబితా తొలి స్థానాలను దక్కించుకున్నాయి. 2023 వివరాల ప్రకారం భారతదేశంలో తలసరి ఎనర్జీ వినియోగం 985కెడబ్ల్యూహెచ్ నమోదైనది. ఒక సాధారణ భారతీయ కుటుంబంలో వినియోగించే విద్యుత్‌లో 30శాతం వరకు వృథాకావడం సోచనీయమే కాదు ఆక్షేపణీయం కూడా.

**సుస్థిర శక్తికి ప్రతి యూనిట్ పొదుపు ముఖ్యమే:**
జాతీయ శక్తి పొదుపు దినం2024 థీమ్‌గా సుస్థిర శక్తి–ప్రతి వాట్ ముఖ్యమే అను అంశాన్ని తీసుకున్నారు. వ్యక్తులు, కుటుంబాలు, పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ సంస్థలు లాంటి అన్ని క్షేత్రాల్లో శక్తి పొదుపు విధానాలను పాటిస్తూ, సుస్థిర పొదుపు బాటన నడవాలి, ఉత్పాదకత పెంచాలి. శక్తిని పొదుపుచేయడం అంటే ఉత్పత్తి చేయినట్లే అని ప్రచారం చేయాలి. శక్తి వినియోగం తగ్గితే పర్యావరణ పరిరక్షణకు ఊతం ఇచ్చినట్లే అని నమ్మాలి. రేపటి ప్రకాశవంతమైన సమాజానికి నేటి శక్తి పొదుపు ఆధారం అని తెలపాలి. శక్తి ఉత్పత్తి, వినియోగాలను తగ్గిస్తే భూమండలం నివాసయోగ్యం గా తయారు అవుతుంది. శక్తి లేనిదే ప్రపంచ ం అంతా చీకటే. శక్తి లేనిదే ఒక్క క్షణం కూడా గడవదు. మనల్ని నడిపిస్తున్నది శక్తి మాత్రమే. ఉత్పత్తి అవుతున్న శక్తిని సక్రమం గా, సమర్థవంతంగా వాడుకోవడం, అనవసర నష్టాలను అదుపు చేయడం మన కనీస కర్తవ్యం. అనవసర కార్యాలకు శక్తిని వాడుకోవడం, వృధా చేయడం నేర సమానమని గమనిస్తూ ప్రతి యూనిట్ విద్యుత్‌ను సక్రమంగా వినియోగించుకుంటూ రేపటి ప్రపంచానికి దారిదీపంగా నిలుద్దాం, విద్యుత్ కొరతలేని భారతాన్ని నిర్మిద్దాం.

(14 డిసెంబర్ జాతీయ శక్తి పొదుపు (ఆదా) దినం సందర్భంగా)

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# పెరుగుతున్న విడాకుల కేసులు

'అవును మీరు విన్నది నిజమే'. దేశంలో రోజురోజుకూ విడాకుల కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి, మారుతున్న సమాజానికి అనుకూలంగా నేడు ఉన్న యువత ఉండలేక విడాకులు తీసుకునే పరిస్థితులు వచ్చాయి, ఎందుకు ఈ పరిస్థితి వస్తుంది? మన భారత్ వివాహ వ్యవస్థ ఎటు పయనిస్తుందో అర్థంకావటం లేదు? భారతదేశంలో కరోనా తరువాత చూస్తే విపరీతంగా విడాకులు కేసులు దేశవ్యాప్తంగా గణనీయంగా పెరిగిపోతున్నాయి. కరోనా తరువాత చూస్తే దాదాపు 1.36 మిలియన్ల ప్రజలు విడాకులు తీసుకోవడం జరిగింది, అది 0.24 పెళ్లి అయిన కుటుంబాలకు సమానం గా ఉంది చెప్పాలి, అయితే అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ విడాకులు తీసుకునే అవకాశం ఎక్కువగా ఉన్నది అని చెప్పాలి, దేశంలో చూస్తే ఈశాన్య రాష్ట్రాల్లో గమనిస్తే అందులో మిజోరం రాష్ట్రంలో విడాకులు తీసుకునే శాతం(4.08) ఎక్కువగా కనిపిస్తుం ది, గుజరాత్ కూడా ముందు వరుసలోనే ఉన్నది, ఇలా వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా ఉన్నాయి.

**బలమైన వివాహ వ్యవస్థ:** నిజానికి చూస్తే ప్రపంచంలో ఎక్కడాలేని గొప్ప వివాహ వ్యవస్థ మన దేశంలో ఉంటుంది, ప్రపంచంలో చాలా దేశాల ప్రజలు మన దేశ వివాహ వ్యవస్థను మెచ్చుకుంటారు, అయితే మనదేశంలో 1955 హిందూ వివాహ చట్టం తీసుకురావటం జరిగింది, అయితే వివాహం చేసుకోవడానికి, మరియు విడిపోవడానికి గల అన్నీ అంశాలు వివాహానికి సంబంధించిన అన్ని విషయాలు చట్టంలో పొందు పరచటం జరిగింది. అయితే భారత్‌లో విడాకులు అనేది చాలా పెద్ద సమస్యగా భావించాలి, ఇవి కోర్టులలో వెంటనే పరిష్కారం అయ్యే అవకాశాలు సరిగ్గా ఉండవు, ఏళ్లకు ఏళ్లు తిరగాల్సిన అవసరం ఉంది.

వాస్తవానికి 100 అబద్ధాలు అడి ఒక పెళ్లి చేయాలని అంటారు కానీ విడాకులు తీసుకోవడానికి కూడా చాలా కారణాలు ఉంటాయి, అయితే ముఖ్యంగా మన దగ్గర చూస్తే 1.గృహహింస అనే కారణం వల్ల చాలావరకు విడాకులు తీసుకోవడం జరుగుతుంది, ఎందుకంటే అమ్మాయి అత్తవారింట్లో భర్త వల్ల కానీ వల్ల అత్త, మామ వల్ల కానీ ఇబ్బందులు పడుతుంటే అది తట్టుకోలేక. ఇంట్లో మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయి. అలాంటప్పుడు విడాకులు తీసుకోవడం కూడా అది ఒక కారణంగా చెప్పవచ్చు, కరోనా తరువాత చూస్తే దాదాపు అధిక వరకట్నం కోసం, వేధింపులవల్ల విడాకులు తీసుకున్న సంఘటనలు చాలానే ఉన్నాయి, 2.మరొక కారణం చూస్తే అక్రమ సంబంధం 2019లో




ఐపిసి 497ను తీసివేయడం జరిగింది, భర్త కానీ భార్య కానీ వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుంటే అది భర్తకి తెలిసినా, భార్యకు తెలిసినా అది కాస్త విడాకులు వరకు వెళ్ళే అవకాశం ఉంది. ఒక సర్వేలో 55శాతం వరకు పెళ్లి అయిన మహిళలు భర్తలను చీటింగ్ చేస్తున్నారు అని తెలిసింది, 55 శాతం మేర వాళ్ల భర్తలతో అనుకూలంగా లేరని తెలుస్తుంది, ఇలా ఉండటం వల్ల కూడా అది కారణంగా చెప్పవచ్చు, 3. ఆర్థిక ఇబ్బందులు వల్ల కూడా విడాకులు తీసుకునే అవకాశం ఎక్కువగానే ఉంది, ఎందుకంటే భర్తగాని భార్య కానీ ఇంట్లో ఆర్థికంగా సమస్యలు వస్తే అది కాస్త గొడవగా మరి విడాకులకు దారి తీస్తుంది,ఈ విధంగా కారణాలు చూడవచ్చు.

**మారుతున్న కాలం:** అయితే నేడు ఉన్న ఆధునికయుగంలో స్వేచ్ఛ ఎక్కువగా పెరిగిపోయింది అది భర్త కి గాని భార్య కి గాని, మనం గమనిస్తే ముప్పై ఏళ్ల క్రితం జంటలను చూస్తే చాలా విలువలతో బ్రతికారు అని తెలుస్తుంది, సమాజంలో విలువలు తరిగిపోతున్న తరుణంలో నేడు ఉన్న యువతకు మంచి, చెడు తెలియకపోవడం, వివాహ వ్యవస్థ గురించి అవగాహన లేకపోవడం వల్ల విడాకులు తీసుకునే వారి శాతం పెరిగిపోయింది, నిజానికి ప్రజలు కూడా మారాలి పెళ్లిచేసే ముందు అటు అబ్బాయికి ఆస్తిపాస్తులు చూడట ం, జాబ్ ఉందా అనేది కాదు, అబ్బాయి విలువలు కల్గి ఉన్నాడా? రేపు ఆస్తిపోతే అమ్మాయిని చూడగలడా? నేడు ఉన్న తల్లి తండ్రులు అలా ఆలోచన చేయడం లేదు, అని గమనించవచ్చు, పేరుకోసం లక్షలు పోసి కట్నాలు ఇస్తున్నారు ఏడాది తిరగ ముందే విడాకులకు కోసం వస్తున్నారు? దానివల్ల రెండు కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది, కాబట్టి యువతగాని, నేడు సమాజం కానీ పెళ్లి విషయంలో, విడాకుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి, ఏదైనా సమస్య వస్తే కూర్చోని మాట్లాడుకోవాలి, పిల్లలకు నచ్చచెప్పే విధంగా చూడాలి, విడాకులు శరణ్యం అని కాకుండా కలిసుంటే బాగుంటది అని చెప్పాలి, కాబట్టి ప్రతి ఒక్కరూ విడాకులు తీసుకునే ముందు ఆలోచన చేయండి, విడాకుల కానీ కలిసి ఉండడం మేలు.

కిరణ్ ఫిషర్, 7989381219

# హామీ ఇచ్చేటప్పుడు 'బోనస్-భరోసా' గుర్తుకు రాలేదా?

లేఖ

'రైతు భరోసా, రుణమాఫీ కంటే బోనస్‌తోనే ఎంతో మేలు..' ఢిల్లీలో మీడియా చిట్‌చాట్ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కామెంట్‌లు ఇవి. 'రైతు భరోసా కంటే బోనస్ ఎంతోబాగుంది. రైతులకు దేనితో ఎక్కువ మేలు జరిగితే దాన్నే అమలు చేస్తాం' అంతకు ముందు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేసిన వ్యాఖ్యలివి. డిప్యూటీ మంత్రులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా రైతుల్లో ఒక విధమైన గందరగోళం నెలకొన్నది. బోనస్ అమలు చేస్తే రైతు భరోసా ఇవ్వరని, రైతు భరోసా ఇస్తే బోనస్ అమలు చేయరనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో సంక్రాంతి నుంచి రైతు భరోసా ఇస్తామని, బోనస్‌ను కొనసాగిస్తామని సిఎం, మంత్రులు క్లారిటీ ఇచ్చినా.. ఇప్పుడు రైతుల్లో ఒక రకమైన అనుమానం నెలకొన్నది.

**సన్నాలకు మాత్రమే బోనస్..** రాష్ట్రంలో సన్న రకం పండించే రైతులు కొద్దిమంది మాత్రమే ఉంటారు. దొడ్డు రకం వడ్లను సాగుచేసే 70–80 శాతం రైతులు బోనస్‌ను నష్టపోవాల్సి వస్తున్నది. అసలు సన్నాలకంటే దొడ్డు రకానికే బోనస్ ఎక్కువ అవసరమనే అభిప్రాయమున్నది.

**రుణమాఫీలోనూఅన్యాయమే:**ఏకకాలంలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రేషన్ కార్డ్ నిబంధన రావడంతో గందరగోళం నెలకొన్నది. టెక్నికల్ ఇష్యూస్‌తోనూ లక్షలాది మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. మొదట రూ.17వేలకోట్లు, ఆ తర్వాత రూ.4వేలకోట్లు రుణమాఫీ చేశారు. అయినా ఇప్పటికీ లక్షలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాన్ని కట్టేస్తే వారికీ రుణమాఫీ చేస్తామని చెప్పారు. దీంతో రైతులు అప్పులు తెచ్చి మరీ రూ. 2లక్షల కన్నా ఎక్కువగా ఉన్న రుణాన్ని బ్యాంకులకు చెల్లించారు. అయినా ఇప్పటికీ లక్షలాదిమందికి రుణమాఫీ కాలేదు. దీంతో వారంతా ఎదురుచూస్తున్నారు. ఇంకా రూ.10వేల కోట్ల మేరకు రుణమాఫీ చేయాల్సి ఉన్నది. ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీల అమలులో మాటమారుస్తుండడంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పై ఎఫెక్ట్‌పడే అవకాశముందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నది.

ఫిరోజ్ ఖాన్



# ఐఎన్‌టియుసిని గెలిపిస్తే జలమండలి కార్మికులకు ఉజ్వల భవిష్యత్తు

## ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టియుసి జలమండలి కాంగార్ యూనియన్‌ను గెలిపిస్తే జలమండలి కార్మికులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను బిఆర్‌ఎస్ ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో జలమండలి కార్మికులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. హైదరాబాద్, ఎస్‌ఆర్‌నగర్ జలమండలి కార్యాలయంలో శుక్రవారం జలమండలి ఎన్నికల ప్రచారంలో భాగంగా జలమండలి కాంగార్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, జలమండలి కాంగార్ యూనియన్ అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డి అధ్యక్షత వహించగా ఆర్.డి.చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా, నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున జలమండలి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, పరిష్కరించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ జలమండలి కార్మికుల సమస్యలను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తుంగలోతొక్కి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌టియు నేతలు జలమండలి కార్మికులకు ఏం చేసారో బహిరంగంగా చెప్పాలని ఆయన సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు భూమయ్య, రామరాజు, సీత్యా, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం

## ఐయామ్‌ఫినోమ్ ఇండియా విజయవంతంగా నిర్వహణ

## కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** సిఎక్స్‌ఒలు, సిహెచ్‌ఆర్‌ఒలు, హెచ్‌ఆర్ నాయకుల కోసం భారతదేశ మొదటి ఇంటెలిజెంట్ టాలెంట్ ఎక్స్‌పీరియన్స్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఐటీ, ఇసి పరిశ్రమలు వాణిజ్య మంత్రి డి.శ్రీధర్ బాబు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ఎఐ కంపెనీ అయిన ఫినోమ్, హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో తన మొదటి ఐయామ్ ఫినోమ్ ఇండియా సదస్సును నిర్వహించారని సదస్సులో 500 మంది సీనియర్ హెచ్‌ఆర్ నిపుణులు, సిఎక్స్‌ఒలు, సిహెచ్‌ఆర్‌ఒలు పాల్గొన్నారు. ఆలోచనాపరులను ఏకతాటిపైకి తీసుకొచ్చిన ఈ కార్యక్రమం మేధస్సు, ఆటోమేషన్, అనుభవం ద్వారా ప్రతిభావంతులను పొందడం, నిర్వహించడం యొక్క భవిష్యత్తును పునర్నిర్వచించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని తెలిపారు. పని ఆకృతిని మార్చిన అత్యాధునిక ఎఐ, ఆటోమేషన్‌పై ఈ సదస్సులో చర్చించారని, డిజిటల్ పరివర్తన యుగంలో వేగంగా నియమించుకోవడానికి, మెరుగ్గా అభివృద్ధి చెందడానికి, ఎక్కువ కాలం ఉద్యోగులను నిలబెట్టుకునేందుకు ఫనామ్ ఇంటెలిజెంట్ టాలెంట్ ఎక్స్‌పీరియన్స్ ప్లాట్‌ఫామ్ ఆయా సంస్థలను ఎలా శక్తివంతం చేస్తుందో విశ్లేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'రాబోయే దశాబ్దంలో తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. ఈ మార్పు ముఖ్యముగా ఎఐ డ్రైవర్లు, సెమీకండక్టర్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై బలమైన దృష్టిని కలిగి ఉంటాయి. ఈ వృద్ధికి మద్దతుగా, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ వంటి కార్యక్రమాల ద్వారా మేము టాలెంట్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాము. మా వర్క్‌ఫోర్స్ శిక్షణ పొంది భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలని మేము కోరుకుంటున్నాము. ఐయామ్ ఫినోమ్ ఇండియా వంటి సంచలనాత్మక కార్యక్రమాన్ని నిర్వహించడం తెలంగాణకు గర్వకారణం. భారతదేశ ఆర్థిక ఆశయాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని రూపొందించడంలో ఏఐ ఆధారిత వినూత్నత ప్రధానమైనది. హైదరాబాద్‌కు చెందిన యునికార్న్ అయిన ఫనామ్ వంటి సంస్థలు మరింత అనుసంధానించబడిన కార్యాలయా లను నిర్మించడానికి సంస్థలకు సాధికారత కల్పించడంలో ఫినోమ్ వంటి సంస్థలు కీలకమైనవి' అని అన్నారు.



# కాంట్రాక్ట్ ఎఎన్‌ఎంలకు ఉద్యోగ భరోసా

## మంత్రి దామోదర రాజనర్సింహ్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెగ్యులర్ ఎంప్లాయిస్ ఉద్యోగులు వచ్చినప్పటికీ,కాంట్రాక్ట్ ఎఎన్‌ఎంలను ఉద్యోగం నుంచి తొలగించబోమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ భరోసానిచ్చారు.హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో ఎఎన్‌ఎంలు మంత్రి దామోదర రాజనర్సింహను శుక్రవారం కలిశారు. ఈ సందర్భగా పలు అంశాలపై వారు చర్చించారు. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ ఎఎన్‌ఎంలు కోరగా, ఉద్యోగాల రెగ్యులరైజేషన్ అంశం కోర్టు పరిధిలో ఉన్నదని మంత్రి వివరించారు. ఎఎన్‌ఎం రెగ్యులర్ పోస్టుల భర్తీకి ఈ నెల 29న జరుగుతున్న పరీక్ష యథావిధిగా నిర్వహిస్తామని ,కాంట్రాక్ట్ ఎఎన్‌ఎంలకు 30 మార్కులు వెయిటేజీ ఇస్తున్నామని, పరీక్షకు సన్నద్ధం కావాలని మంత్రి సూచించారు. పోస్టుల సంఖ్యను పెంచాలని ఎఎన్‌ఎంలు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం నోటిఫికేషన్ ఇచ్చిన 1931 పోస్టులకు అదనంగా మరో 323 పోస్టులను కూడా ఇదే నోటిఫికేషన్‌లో భర్తీ చేస్తామని ఆయన హామీనిచ్చారు. రెగ్యులర్ ఉద్యోగం రాకపోయినప్పటికీ వారిని కాంట్రాక్ట్ ఉద్యోగంలో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విషయమై తాను సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తెలిపారు.

# రానున్న ఎన్నికల్లో రాహుల్‌గాంధీది కోహ్లీ పాత్ర..

## 'ది హిందూ లిట్ ఫర్ లైఫ్ డైలాగ్ - 2025'లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విరాట్ కోహ్లీ పాత్రను పోషించబోతున్నారని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని మహాయుతి కూటమి(ఎన్‌డిఎ) అన్ని వ్యవస్థలను ప్రభావితం చేసి గెలిచి అధికారంలోకి వచ్చిందన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో విధ్వంసం పాలైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రముఖ జాతీయ హిందు దినపత్రిక' నిర్వహించిన 'ది హిందూ లిట్ ఫర్ లైఫ్ డైలాగ్ 2025' కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టులు రాజ్ దీప్ సర్దేశాయ్, నీర్జా చౌదరితో కలిసి మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ కమిట్‌మెంట్ కలిగిన నాయకుడన్నారు.కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను సాధ్యమైన మేర పూర్తి చేశామన్నారు. మిగతా హామీలను రాబోయే రోజుల్లో పూర్తి చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే 55 వేలకుపైగా ఉద్యోగాలను నియమించామని వివరించారు.గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుదేలై పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆ కాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. ప్రతిపక్ష నేతగా వచ్చే సదుపాయా లు అనుభవిస్తూ కెసిఆర్ అసెంబ్లీకి కూడా రాలేని పరిస్థితిలో ఉన్నారని మహేష్ గౌడ్ మండిపడ్డారు. అనంతరం ది హిందూ గ్రూప్ తరపున ఆ సంస్థ జర్నలిస్ట్ స్వాతి వడ్లమూడి 'ది హిమాలయాస్ బుక్' ను మహేష్ కుమార్ గౌడ్‌కు అందజేశారు. హిందూ గ్రూప్ ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని మహేష్ గౌడ్ ఆ సంస్థ ప్రతినిధులను కోరా రు. ప్రముఖ జర్నలిస్టులు రాజ్ దీప్ సర్దేశాయ్, నీర్జా చౌదరి తో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

# రహదారులకు అడ్డుగానున్న స్తంభాలు తొలగింపు

## టిజిఎస్‌పిడిసిఎల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో రోడ్డుకు అడ్డుగా ఉండి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్ లను తొలగించడం పై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీంట్లో భాగంగా శుక్రవారం మింట్ కాంపౌండ్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో జిహెచ్‌ఎంసి, ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్, టిజిఎస్‌పిడిసిఎల్ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న రహదారులతో పాటు, షేక్ పేట్, వనస్థలిపురం, ఎల్‌బి నగర్, గచ్చిబౌలి, ఉప్పల్, హబ్సిగూడ, మాసాబ్ ట్యాంక్ తో పాటు ఇతర రద్దీగా వుండే రహదారులపై గల అడ్డంకులను తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ఇతర శాఖల అధికారులను నోడెల్ అధికారులుగా నియమించారు. టిజిఎస్‌పిడిసిఎల్ నుండి డివిజనల్ ఇంజనీర్, ట్రాఫిక్ పోలీస్ శాఖ స్టేషన్ హౌస్ ఆఫీసర్,జిహెచ్‌ఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, టౌన్ ప్లానింగ్ – ఎసిపి లను నోడెల్ ఆఫీసర్లుగా నియమించారు. ఈ నోడెల్ అధికారులు టీంగా ఏర్పడి క్షేత్ర స్థాయిలో పర్యటించి డిసెంబర్ చివరినాటికి రోడ్డుకు అడ్డుగా ఉన్న వాటిని గుర్తించి, వాటి తొలగింపుకు అవసరమైన ఎస్టిమేషన్స్, అనుమతుల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. 2025 ఫిబ్రవరి నాటికి తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. దీనికి తోడు ఉపయోగంలో లేని విద్యుత్ స్తంభాలను, రోడ్డుపై పడి వున్న స్తంభాలను వెంటనే తొలగించాలని విద్యుత్ అధికారులను సిఎండి ముషారఫ్ ఫరూఖీ ఐఎఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ శివ కుమార్, టిజిఎస్‌పిడిసిఎల్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ పి.విశ్వ ప్రసాద్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సి జోయెల్ డేవిస్, డిసిపి ట్రాఫిక్ 3 ఆర్.వెంకశ్వర్లు, రాచకొండ ట్రాఫిక్ డిసిపివి.శ్రీనివాసులు, డైరెక్టర్ ఆపరేషన్ డా.ఎన్. నరసింహులు, డైరెక్టర్ ఫైనాన్స్ సుధా మాధురి, జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజినీర్ భాస్కర్ రెడ్డి, టిజిఎస్‌పిడిసిఎల్ చీఫ్ ఇంజినీర్లు పాండ్య, చక్రపాణి, కామేష్, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, ఎసిపిలు ఇతర అధికారులు పాల్గొన్నారు.





# సచివాలయంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

## పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగుల ఆధ్వర్యంలో సచివాలయంలోని చర్చిలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా రవాణా, బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ అనిల్, క్రిస్టియన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, క్రిస్టియన్ ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ఆశీర్వచనం ఇస్తూ బ్రదర్ అనిల్ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సచివాలయంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నవారికి గ్రాండ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. లోక కల్యాణం కోసం అందరూ కూడా సుఖంగా ఉండాలని, ఏసు ప్రభువు కీర్తనలు ప్రవచనలు ఆలోచనలతో ముందుకు పోవాలని ఆకాంక్షించారు. త్యాగానికి మారుపేరుగా సమాజంలో క్షమాగుణం గుణం ఉండాలన్నారు. సంవత్సరానికి ఒకసారి ప్రపంచ వ్యాప్తంగా జరిగే పండగ క్రిస్మస్ అన్నారు. సచివాలయం ఉద్యోగులుగా పెద ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ప్రార్థన మందిరాలు, దేవాలయాలు వాళ్ళ భావాలకు స్వేచ్ఛగా అందరినీ సమానంగా చూసుకునే సెక్యూలర్ ప్రభుత్వం తమదన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా ప్రజా పాలన ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రైతులు పాడి పంటలతో ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

# హైదరాబాద్‌లో భారీ చోరీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దొంగలు హైదరాబాద్‌ను టార్గెట్ చేసుకున్నట్లు కనిపిస్తుంది. గురువారం అర్ధరాత్రి దోమలగూడలో బంగారు వ్యాపారి ఇంటిని దోచుకున్నారు. వివరాల్లోకి వెళితే.. దోమలగూడలోని అరవింద్ కాలనీ లో బంగారం వ్యాపారి రంజిత్ నివాసముంటున్నాడు. అర్ధరాత్రి 10 మంది దుండగులు ముందుగా కత్తులు, తుపాకులతో ఇంట్లోకి చొరబడిన కుటుంబ సభ్యులను బంధించారు. అనంతరం లాకర్‌లో భద్రపరిచిన 2.5 కిలోల బంగారం, కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా అపహరించుకుపోయారు. అదేవిధంగా చోరీకి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకుండా సిసి టివి డివిఆర్‌ను సైతం కూడా దుండగులు ఎత్తుకెళ్లారు. అయితే, దొంగల దాడిలో ఇంటి యజమాని రంజిత్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. తెలిసిన వారే ఈ దోపిడీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటన జరిగిన చుట్టుపక్కల ప్రాంతాల సిసికెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు.

# మోహన్‌బాబుకు లభించని ఊరట

## ముందస్తు బెయిల్‌కు హైకోర్టు నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మంచు మోహన్‌బాబు–మంచు మనోజ్ మధ్య వివాదాన్ని కవరేజీ చేసేందుకు వెళ్లిన విలేకరిపై మోహన్‌బాబు దాడి చేశారనే కేసులో ఆయనకు హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. దాడి చేశారంటూ పిర్యాదుదారు ఎం రంజిత్ కుమార్ కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులిచ్చింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేస్తూ జస్టిస్ కె. లక్ష్మణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముందు పెట్టిన కేసును హత్యాయత్నంగా పోలీసులు మార్చారని, ఇదొక కుట్రని, అరెస్టు చేసే ప్రమాదం ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వాలని మోహన్‌బాబు లాయర్ వాదించారు. టీవీ ఛానల్ మైక్‌తో మోహన్‌బాబు విలేకరిపై దాడి చేశారని పోలీసుల న్యాయవాది చెప్పారు. రెండు వైపులా వాదనల తర్వాత హైకోర్టు, మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అభియోగాలు తీవ్రంగా ఉన్నందున ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. విచారణను ఈ నెల 19కి కి వాయిదా వేసింది.

# 62 ఏళ్ల వృద్ధుడికి ఉరిని యావజ్జీవంగా మార్పు

## 5 ఏండ్ల బాలిక అత్యాచారం, హత్య కేసులో తీర్పు

## 30 ఏళ్లలోపు విడుదల చేయొద్దు..

## 15 ఏళ్ల వరకు పెరోల్ ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డిజిల్లా బిడిఎల్ పోలీసు స్టేషన్‌లో 5 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో 62 ఏళ గఫార్ అలికి కింది కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు యావజ్జీవ శిక్షగా మార్పు చేస్తూ తీర్పు చెప్పింది. అయితే, 30 ఏండ్ల పాటు జైలు జీవితాన్ని గడపాలంది. ఈ 30 ఏళ్ల కాలంలో ముద్దాయిని విడుదల చేయరాదని తేల్చి చెప్పింది. క్షమాబిక్ష రెమిషన్ తదితరాల పేరుతో విడుదల చేయరాదని, 30 ఏండ్లు జైల్లోనే గడపాలంది. పదిహేను ఏండ్ల వరకు పెరోల్ ఇవ్వరాదని కూడా తీర్పులో పేర్కొంది. ఎలాంటి పెరోల్‌పై విడుదల చేయరాదని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ జె.అనిల్ కుమార్లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. 2023 అక్టోబరు 16న వెలిమల గ్రామంలో ఐదేళ్ల బాలిక అత్యాచారం, హత్య కేసులో గఫార్ అలీకి సంగారెడ్డి పోస్కో కేసుల ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు నిందితుడికి ఉరి శిక్ష విధిస్తూ గత సెప్టెంబరులో తీర్పు చెప్పింది. మరణ శిక్ష ధ్రువీకరణ నిమిత్తం సంగారెడ్డికోర్టు రికార్డులను హైకోర్టుకు పంపింది. దోషి గఫార్ అలీ అప్పీలు దాఖలు చేశారు. దీనిని ద్విసభ్య ధర్మాసనం విచారణ పూర్తి చేసింది. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం పోలీసులను గఫార్ తీసుకెళ్లిన పత్తి చేను ప్రాంతంలోనే బాలిక మృత దేహం కనిపించడం, పోస్టుమార్టం నివేదికలో కూల్‌డ్రింక్ ఆనవాళ్లు, సీసీటీవీ ఫుటేజీలో బాలిక నిందితుడితో ఉండటం తదితర ఆధారాలను పరిశీలిస్తే గఫార్ నేరం చేసినట్లు రుజువు అవుతోందని తేల్చింది. అత్యంత అరుదైన కేసుల్లో ఉరిశిక్ష విధించవచ్చని, అత్యంత అరుదైన కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు పలు సందర్భాల్లో నిర్వచించిందని చెప్పింది. కేసులోని అంశాల ఆధారంగా అరుదైనదనేది ఉంటుందని చెప్పింది. ప్రస్తుత కేసులో దోషి అయిన గఫార్ 62 ఏళ్ల వృద్ధుడని, గతంలో ఎలాంటి నేర చరిత్ర లేకపోవడాన్ని పరిగణనలోకి తీసుకుని యావజ్జీవ శిక్షగా మార్చుతున్నట్లు ప్రకటించింది. ఉద్దేశపూర్వకంగా బాలికను చంపాలని పథకం లేకపోవడం, అత్యాచారం చేశాక హింస ద్వారా బాలిక మృతి చెందిందని డాక్టరు ధ్రువీకరించకపోవడం వంటిని కూడా పరిగణనలోకి తీసుకుని ఉరి శిక్షకు బదులు యావజ్జీవ శిక్షగా మార్చుతున్నట్లు ప్రకటించింది. ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటున్నామని పేర్కొంది. వీటన్నింటి నేపథ్యంలో కింది కోర్టు విధించిన శిక్షను పాక్షికంగా అనుమతిస్తున్నట్లు చెప్పింది. ఉరి శిక్షను యావజ్జీవ శిక్షగా మార్చుతూ తీర్పు వెలువరించింది. అయితే, అలీకి 30 ఏళ్ల వరకు ఎలాంటి మినహాయింపులతో విడుదల చేయరాదని తేల్చి చెప్పింది. అంతేకాకుండా 15 ఏళ్ల వరకు పెరోల్ కూడా మంజూరు చేయరాదని కూడా షరతు విధించింది. ఈ మేరకు హైకోర్టు తీర్పు వెలువరించింది.

# గురుకులాల్లో వసతులపై నివేదికివ్వండి

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాలు, వసతి గృహాల్లో అసంపూర్తిగా ఉన్న వసతుల కల్పనపై నివేదిక సమర్పించాలని ప్రభుత్వానికి హైకోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే పలు సౌకర్యాలు కల్పించినా ఇంకా మిగిలినవాటిని పూర్తి చేసి వాటి అమలు నివేదికను సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను జనవరి 22కు వాయిదా వేసింది. బాలల హక్కుల రక్షణ జాతీయ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక వసతులు, ఆహారం తదితరాలను అందజేయకపోవడాన్ని సవాలు చేస్తూ కె.అఖిల్ శ్రీగురుతేజ దాఖలు చేసిన పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన బెంచ్ విచారించింది. అదనపు అడ్వొకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ గత ఆదేశాల అమల్లో భాగంగా వసతి సౌకర్యాలను మెరుగుపరచామని, దీనికి సంబంధించిన నివేదిక సమర్పించామన్నారు. పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ వసతులకు చెందిన పలు అంశాలపై నివేదికలో ప్రస్తావించలేదన్నారు. తెలంగాణలో తీవ్రమైన చలి ఉందని, పిల్లలకు సరైన దుప్పట్లు లేవన్నారు. పరుపులు, బెడ్‌షీట్‌లు, కాటన్ బ్లాంకెట్స్, దోమతెరలు, టవళ్లు, బాత్‌రూంల్లో వాడే సోపు తదితరాలు, మంచినీటి కోసం ఆర్వో ఏర్పాటు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్‌రూంల ఏర్పాటు, నిబంధనల ప్రకారం పౌష్టికాహారం, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మానసికశాస్త్రవేత, కౌన్సెలర్ల ఏర్పాటు చేయలేదని తెలిపారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రభుత్వ నివేదికలో ప్రస్తావించని ఈ అంశాల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీనికి సంబంధించిన నివేదిక సమర్పించడానికి ఈనెల 22వరకు గడువు మంజూరు చేసింది.

# కంచె ఐలయ్యపై కేసులు కొట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రిటైర్డు ప్రొఫెసర్ కంచ ఐలయ్య రాసిన 'సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు..'అనే పుస్తకం రాసి ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీశారంటూ దాఖలైన పలు కేసుల్ని హైకోర్టు కొట్టేసింది. నగరానికి చెందిన శ్రీకాంత్ గుప్తా మల్కాజిగిరి పోలీసులకు, ఇతరులు కోరుట్ల, కరీంనగర్, నిజామాబాద్ మొదలైన చోట్ల పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఆ కేసుల్ని కొట్టేయాలంటూ ఐలయ్య దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ రాధారాణి శుక్రవారం తీర్పు వెలువరించారు. పుస్తకాన్ని నిషేధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిందని, వ్యక్తిస్వేచ్ఛ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛలను రాజ్యాంగం ఇచ్చిందని, కాబట్టి పిటిషనర్‌పై పోలీసులు పెట్టిన కేసులు చెల్లవని హైకోర్టు తీర్పు చెప్పింది.

# ఉక్రేన్‌పై రష్యా దాడులు

**వాషింగ్టన్ :** రష్యా శుక్రవారంనాడు ఉక్రేన్‌పై గగనతలదాడులు చేసింది. క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు కొనసాగిస్తున్నది. ఉక్రేన్ పవర్ గ్రిడ్‌ను లక్ష్యంగా చేసుకుందని రష్యా ఎనర్జీ మంత్రి హెర్మన్ హాలుష్చెంకో ఫేస్‌బుక్‌లో రాశారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై రష్యా దాడులు ప్రారంభించింది. రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలలో క్రూయిజ్ క్షిపణులతో రష్యా సేనలు తాజాగా విరుచుకుపడ్డాయి. ముఖ్యంగా శీతాకాలం కావడంతో పవర్ గ్రిడ్‌లు పనిచేయకుండా దెబ్బతీసేందుకు రష్యా వ్యూహం చేస్తున్నది. ఇదిలా ఉండగా, ఉక్రేన్‌కు అమెరికా 500 మిలియన్ డాలర్ల సహాయం అందించనున్నది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పదవీకాలం ఇంకా 40 రోజుల్లో ముగియనున్న చివరి తరుణంలో బైడెన్ ఉక్రేన్‌కు సహాయం చేసేందుకు మొగ్గుచూపిస్తున్నారు. అమెరికా విదేశాంగమంత్రి బ్లింకెన్ ఈ కొత్త ప్యాకేజీని బయటపెట్టారు. ఉక్రేన్ పదాతిదళాలకు రాకెట్లు, ఆయుధ సామాగ్రి, డ్రోన్లు, ఆయుధవాహనాలు సమకూర్చే విషయాన్ని బ్లింకెన్ చెప్పారు. మరోవైపు కొత్తగా అధికారం చేపట్టే అధ్యక్షుడు ట్రంప్ మాత్రం శాంతిమంత్రం పాటిస్తున్నారు. ఉక్రేన్‌కు ఆయుధ సహాయం తగ్గించాలని ఆయన ఆలోచిస్తున్నారు.

# బంగ్లాదేశ్ పరిణామాలు గమనిస్తున్న బైడెన్

**వాషింగ్టన్ :** బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చాలా సన్నిహితంగా పరిశీలిస్తున్నారు. ఆ మాటకొస్తే పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్థానంలో తాత్కాలిక నాయకుడు అమెరికా అనుకూలనాయకుడే. హసీనాను పదవి నుండి తొలగించాక అక్కడి పరిస్థితులలో పూర్తిగా మార్పులు వచ్చాయి. బంగ్లాదేశ్‌లో మతాలకు రక్షణ, మైనారిటీలకు రక్షణ ఉండాలని, అందుకు ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయాల్సి ఉందని వైట్‌హౌస్ గట్టి అభిప్రాయంతో ఉంది. హసీనా దేశం వదిలి వెళ్ళిపోవడంతో భద్రతా పరిస్థితి దిగజారిపోయిందని వైట్‌హౌస్ జాతీయ భద్రతా కమ్యూనికేషన్స్ సలహాదారు జాన్ కిర్బీ అన్నారు. తాత్కాలిక ప్రభుత్వంతో తాము సన్నిహితంగా కలిసి పనిచేస్తున్నామని, భద్రత కట్టుదిట్టం చేసే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.

# ఊరూరా 'తెలంగాణ ఉద్యమ' తల్లి విగ్రహాలు : ఎంఎల్‌సి కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్ని జిఒలు జారీ చేసినా, ఎన్ని కేసులు నమోదు చేసినా ఊరూరా ఊరేగించి మరీ 'మా ఉద్యమ తల్లి'ని నిలుపుకుంటామని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో, బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వేల సంఖ్యలో తెలంగాణ తల్లి విగ్రహాల ను ఆవిష్కరించుకుంటామన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడానికి ప్రజల ఆమోదం ఉన్నట్లయితే జిఒతో పని ఏముందని ప్రశ్నించారు. పిరికితనంతోనే ప్రభుత్వం బెదిరిస్తుందన్నారు. చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడు తూ ఇందిరా గాంధీ, సోనియా గాంధీ బతుకమ్మ ఎత్తుకొని తెలంగాణ ప్రజల కు శుభాకాంక్షలు తెలియజేశారని, 1978లో వరంగల్ మహిళలతో కలిసి ఇందిరా గాంధీ బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనడం ఒక మధుర స్మృతి అని ప్రియాంకా గాంధీ ట్వీట్ చేసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు.ఓట్లు ఉన్నప్పుడు మాత్రం కాంగ్రెస్ నాయకులకు బతుకమ్మ గుర్తుకొస్తుందని, ఓట్ల కోసం ఎన్ని ఆటలైనా ఆడుతారని విమర్శించారు. ప్రభుత్వ వేడుకల్లో పాడుతున్న పాటలు చూస్తే కన్నీళ్లు వచ్చే పరిస్థితి ఉందని, తెలంగాణకు సంబంధం లేని పాటలు పాడుతున్నారని, తెలంగాణలో ఎంతో మంది జానపద కళాకారులు ఉంటే, ఒక్క కళాకారుడు కూడా పాట పాడడానికి దొరకలేదా ? పాడడానికి ఒక్క తెలంగాణ పాట దొరకలేదా అని ప్రశ్నించారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవమైన బతుకమ్మను అవమానిస్తూ, కించపరుచుతూ మాట్లాడిన మంత్రులు, కాంగ్రెస్ నాయకులకు ఏం శిక్ష వేస్తారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధనం చెప్పాలన్నారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ ఎందుకు ఉండాలని కాంగ్రెస్ నాయకులు వెర్రి ప్రశ్నలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. బతుకమ్మను తాము విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రయత్నిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మరుగున పడేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. అసలు తెలంగాణ తల్లి రూపాన్ని ఎలా మారుస్తారని కవిత ప్రశ్నించారు.

# కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌లో అరుణ్ కుమార్ జైన్ తనిఖీ

## నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్

**ప్రజాపక్షం/హైదరాబాద్: సికింద్రాబాద్** డివిజన్‌లోని కాజీపేటలోని రైల్వే తయారీ యూనిట్‌ని శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో సికింద్రాబాద్ డివిజన్‌లోని డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, ఇతర ఉన్నతాధికారులు ఆయన వెంట ఉన్నారు. అరుణ్ కుమార్ జైన్ కాజీపేటలో నూతన రైల్వే తయారీ యూనిట్ కోసం జరుగుతున్న నిర్మాణ పనులను సవివరంగా పరిశీలించారు. డివిజనల్ అధికారులు పనుల పురోగతిపై సమగ్ర నివేదికను జనరల్ మేనేజర్‌కి సమర్పించారు. ప్రాజెక్ట్ త్వరితగతిన పూర్తి చేసేలా పనులను మరింత వేగవంతంగా కొనసాగించాలని జనరల్ మేనేజర్ డివిజన్‌కు సూచించారు. జనరల్ మేనేజర్ నిర్మాణ స్థలంలో భద్రతా అంశాలను కూడా పరిశీలిస్తూ అన్ని భద్రతా మార్గదర్శకాలు మరియు విధానాలు తప్పకుండా పాటించేలా పర్యవేక్షకులు, అధికారులు నిర్ధారించుకోవాలని తెలియజేసారు. తదనతరం మీడియా ప్రతినిధులతో అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. అనంతరం అరుణ్ కుమార్ జైన్ కాజీపేట రైల్వేస్టేషషన్‌ను సమగ్ర తనిఖీలో ప్రయాణీకుల సౌకర్యాలు, అందుబాటులోనున్న సదుపాయాలను సమీక్షించారు. కాజీపేట స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాజీపేటలో సిబ్బంది లాబీని మరియు కొత్త స్టాఫ్ రన్నింగ్ రూమ్ను కూడా ఆయన పరిశీలించారు.



## అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** అన్నివర్గాల సంక్షేమమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో 181మంది రైతులకు స్ప్రింక్లర్లు అందజేశారు. అనంతరం కల్వకుర్తి, వెల్దండ మండలాలకు చెందిన 78మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి రైతుపక్షపాతి అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. అర్హులైన లబ్ధిదారులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ సత్యం, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ ఇబ్రహీం, మున్సిపల్‌వైస్‌చైర్మన్ షాహెద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శి మిర్యాలశ్రీనివాస్‌రెడ్డి, వెల్దండ మండల అధ్యక్షులు మోతీలాల్‌నాయక్, వెల్దండ సింగిల్‌విండోవైస్‌చైర్మన్ సంజీవ్‌కుమార్‌యాదవ్, జమ్ములశ్రీకాంత్, కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి మండలం జిల్లెల గ్రామంలోనివాసముంటున్న బొందల అలివేల ఆకస్మాత్తుగా మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీసర్పంచ్ జిల్లెల రాములు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి గ్రామ నాయకులద్వారా మృతురాలి కుమార్తె శిరీషకు రూ.3వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముచర్ల శ్రీకాంత్‌రెడ్డి, దేవాలయచైర్మన్ కొమ్మగొని రవి గౌడ్, నాయకులు పెరుమాళ్ల శ్రీశైలం, కుర్వసంఘం చిక్కొండబీరయ్య, డొక్కా జంగయ్య, డొక్కా బాల్‌రాజు, డొక్కారమేష్, డొక్కా బాలస్వామి, గుమ్మకొండ వెంకటయ్య, గుమ్మకొండ ఎట్టయ్య, పెరుమాళ్ల ఆంజనేయులు, తోటపల్లినర్సింహ్మా, డొక్కాశ్రీశైలం, గణేష్, మహేష్, మొక్తాలరాములు పాల్గొన్నారు.



## ఆదర్శప్రాయుడు హనుమంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/నర్వ:** మారు మూల ప్రాంతమైన మన నర్వ మండలంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి సంస్కారాన్ని నేర్పుతూ విద్యా నర్సరీ టు పదవ తరగతి వరకు సంస్థను నెలకొల్పి ఎన్ని ఆటంకాలు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తట్టుకొని తను నెలకొల్పిన విద్యాసంస్థలను సాఫీగా కొనసాగిస్తున్నా హనుమంత్‌రెడ్డి కి మండల పలు రాజకీయ నాయకులు ఉపాధ్యాయులు ప్రాతికేయులు విద్యార్థులు తల్లిదండ్రులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మనకోసం మన పిల్లల కోసం నిరంతరం శ్రమిస్తూ నర్వ మండలంలో ఒక విజ్ఞానవంతమైన భావి భారత పౌరులను తీర్చిదిద్దడం కోసం ఎంతో అహర్నిశలు శ్రమించి తప్పిస్తున్నారని పిల్లల చదువుల కోసం ఎక్కడికో వెళ్లాలిసిన పని లేకుండా నిష్ణాతులైన అధ్యాపక బృందాన్ని మన మండలానికి రప్పించిన మీరు విశాల విద్య సామ్రాజ్యంగా మారుస్తారని కోరకుంటూ మీకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మీకు ఆయురారోగ్యాలు భగవంతుడు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## శ్రీరాములు కుటుంబాన్ని ఆదుకుంటాం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** వెల్దండ మండలం రాచూర్ గ్రామానికిచెందిన ఓప త్రిక పాత్రికేయుడు శ్రీరాములు అస్వస్థతకుగురై మృతిచెందిన విషయం తెలుసుకొని శుక్రవారం టియూడబ్ల్యూజే(ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్, జిల్లాప్రధాన కార్యదర్శి ఎం.రాములు, రాష్ట్రనాయకులు మిర్యాలకన్నయ్య సహా స్థానిక జర్నలిస్టులు ఆగ్రామాన్ని సందర్శించి పార్థీవదేహంపై పుష్పగుచ్ఛంఉంచి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ గతకొంతకాలంగా అనేక పత్రికల్లో పనిచేసి అస్వస్థతకుగురై మృతిచెందిన శ్రీరాములు కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు. శ్రీరాములు కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఆయన స్పష్టంచేశారు. రాష్ట్రప్రభుత్వం జర్నలిస్టుల హెల్త్‌కార్డులను పునరుద్దరించాలని, అస్వస్థతకుగురైన జర్నలిస్టులకు తక్షణమే వైద్యం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. టియూడబ్ల్యూజే(ఐజెయు) రాష్ట్ర అధ్యక్షులు విరహత్‌ఆలీ, ప్రెస్‌అకాడమీచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు పట్టాభికృష్ణయ్య, బాలయ్య,శ్రీను,శివశంకర్, పరమేష్, వెంకటేష్ ప్రసాద్ ఉన్నారు.

## 17న ఉపాధ్యాయుల నిరసన దీక్ష

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులకు ఉన్న సమస్యలపై ఈనెల17న హైదరాబాద్‌లో ధర్నా చేయనున్నట్లు ఉపాధ్యాయ సంఘం జిల్లాకార్యదర్శి శేఖర్‌ముదిరాజ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వంచెల్లించాల్సిన పిఆర్‌సి, డిఏ బకాయిలు, ఇక్యూబేర్ పెండింగ్‌బిల్లులు వెంటనే విడుదలచేయాలన్నారు. తెలంగాణ ఉపాధ్యాయసంఘం తపస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కువద్ద దీక్ష చేయనున్నట్లు తెలిపారు. దీక్షకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. మొదట పాఠశాలలో నల్లబ్యాడ్జిలతో, మండలస్థాయి తహసీల్దార్లకు వినతిపత్రాలు, జిల్లాస్థాయి కలెక్టరేట్ల ముందు ధర్నా చేశామని చివరిగా హైదరాబాద్‌లో దీక్ష చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యవర్గసభ్యులు శ్రీనివాసులు, పెంట్యానాయక్, జిల్లానాయకులు అరవింద్‌రావు, జగదీశ్వర్, రాంగోపాల్, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే

### పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ది చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వేను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం పరిశీలించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పాత పాలమూరు ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా దరఖాస్తుదారులు ఇళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం కలిగి ఉన్నారా, ప్రసుత్తం నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఎవరు, పాత పెంకుటింట్లో ఉంటున్నారా లేక పక్కా గృహమా, నివేశన స్థలానికి సంబంధించిన ఏమైనా ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా తదితర అంశాలను పరిశీలిస్తూ మొబైల్ యాప్ లో వివరాలు నమోదు చేయించారు. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను నమోదు చేసేందుకు ఎంత సయయం పడుతోంది రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా ఇప్పటివరకు ఎంతమంది వివరాలను సేకరించారు. ఆన్లైన్లో ఎన్ని వివరాలను అప్లోడ్ చేశారని అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి, వారికి పలు సూచనాలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, తప్పిదాలకు తావులేకుండా వివరానలు సేకరిస్తూ ఆన్లైన్ యాప్ లో నమోదు చేయాలని సూచించారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వ పరంగా లబ్ది చేరూరేందదుకు వీలుగా వివరాల నమోదులో అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కలెక్టర్ తో పాటు గృహ నిర్మాణ డి.ఈ విజయ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణలతో సమస్యలకు పరిష్కారం

### విద్యార్థుల కృషిని అభినందించిన కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు చాలా అద్భుతంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో జరుగుతున్న వైద్య వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ప్రదర్శించిన ప్రయోగాలను నిశితంగా పరిశీలించడంతోపాటు ప్రయోగాల ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. అనేక సమస్యలను చక్కని విద్యార్థులు చూపించగలిగరని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు చూపించగలిగారని కలెక్టర్ అన్నారు. విద్యారుథలు ప్రదర్శనలు తనను అమితంగా ఆకర్షించాయని పరిసరాల్లో ఉత్పన్నమయ్యే పలు సమస్యలకు నూతన ఆవిష్కరణల ద్వారా పరిష్కారాన్ని చూపించడం ప్రశంసనీయమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రకృతి విపత్తులో సెన్సార్ ల ద్వారా అప్రమత్తమయ్యే ప్రయోగాలు అగ్ని ప్రమాదాల నివారణ శుద్ధమైన నీటిని అందించడానికి పరిష్కార మార్గాలు వర్మి కంపోస్టు తయారీ వంటి పలు ప్రయోగాలు ఎంతో ఉపయుక్తమని కలెక్టర్ అన్నారు. రైతులకు ఉపయోగపడే ఆవిష్కరణలు కూడా వైజ్ఞానిక ప్రదర్శనలో ఏర్పాటు చేశారని వాటి వల్ల రైతులకు ఎంత మేలు జరుగుతుందని కలెక్టర్ అన్నారు. చిన్నపిల్లల్లోనే ఆలోచనలు ఎక్కువగా ఉంటుందని గుర్తించి పోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ అన్నారు. పాఠశాల స్థాయిలో ప్రయోగాత్మక బోధనలకు శ్రీకారం చుట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో ఇంతవరకే గుర్తింపు పొందారని వారి ప్రేరణతో మరింత మంది విద్యార్థులు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, సైన్స్ అధికారి శ్రీనివాసులు, సీఎంఓ బాలు యాదవ్, ఏ ఎం ఓ దుంకుడు శ్రీనివాస్, విద్యాశాఖ పర్యవేక్షకులు శంభుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## రైతాంగాన్ని ఆదుకునేందుకు పకడ్బందీ చర్యలు

### జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అల్వాల్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** వ్యవసాయమే వృత్తిగా కొనసాగుతున్న రైతులను ప్రభుత్వము ఆదుకునేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఆల్వాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మహబూబ్నగర్ జిల్లా కలెక్టరు విజ్ఞాపన పత్రం అందజేశారు. రైతాంగానికి పంట రుణాలు అందించడంలో బ్యాంకులు తాత్సరం చేస్తున్నాయని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలతో పాటు, రైతు ముంగిటనే ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన తెలపారు. రైతాంగాన్ని మోసం చేసే దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎకరాలు లక్ష రూపాయలు చొప్పున పంట రుణాలు అందించాలని, బ్యాంకులు పొలాలను కుదవ పెట్టుకుని ఎకరావత్ కంటికి 30 లక్షలు చొప్పున వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నెలకొల్పుటకు రుణాలు ఇవ్వాలన్నారు. అసైన్మెంట్ ల్యాండ్ చట్టం, సీలింగ్ యాక్ట్, ఆర్ఓఆర్ చట్టాలను ధిక్కరించిన రెవెన్యూ అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, రైతులక చట్టబద్ధంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆయన కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్ల విస్తరణపై బహిరంగ చర్చకు సిద్ధమా?

### కాంగ్రెస్ నాయకుల సవాల్

**ప్రజాపక్షం /పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రం నుండి అంబేద్కర్ నగర్ వరకు రోడ్ల విస్తరణలో ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు నివాస స్థలాలు చూపించకుండా ప్రస్తుత మున్సిపల్ పాలక వర్గం బాధితులు అయిన 14 మంది , 1 మహిళ అని చూడకుండా ఆమెపై గత ప్రభుత్వం దౌర్జన్యంతో కేసులు పెట్టి ఇప్పటికి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని , నిరంకుశ పాలన అంతమై ప్రజా పాలనలో నిర్వాసితులకు అండగా ఎమ్మెల్యే మెగారెడ్డి నిలబడ్డారన్నారు కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలను మార్చి త్వరలోనే రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపడతామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త లైన్ వేయడానికి 22 లక్షల రూపాయల అంచనా వ్యయంతో జిల్లా కలెక్టర్‌కు సబ్మిట్ చేశామని, అత్యధిక ఆదాయం ఉన్న పెబ్బేరు సంత ఆదాయంతో మున్సిపల్ కార్పొరేషన్ విద్యుత్ శాఖకు చెల్లిస్తే పనులు ప్రారంభమవుతాయి అన్నారు. పెబ్బేరు పట్టణ అభివృద్ధికి కృషి చేయాల్సిన మున్సిపల్ పాలకవర్గం అభివృద్ధిని పక్కకు పెట్టి ఎమ్మెల్యే మెగారెడ్డిపై అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారని, కాంగ్రెస్ నాయకులు ఖండించారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ , మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ ఎల్లస్వామి రంజిత్ కుమార్ , యుగంధర్ , దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైలం ముంపు బాధితులకు 50 శాతం ఉద్యోగాలు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** శ్రీశైలం ముంపు బాధితులకు న్యాయపరంగా రావాల్సిన ఉద్యోగాలను వెంటనే ఇవ్వాలని రాష్ట్ర బీజేపీ నాయకులు ధారాసింగ్ అన్నారు. శ్రీశైలం ముంపు బాధితులకు చిరకాలంగా జరుగుతున్న అన్యాయంపై కె.డా. గోజీరావు, ఇతరులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న వారికి 50 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని కోర్టు ఆర్డర్ ఇచ్చినట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు బి. దారాసింగ్ తెలిపారు. ఆ కోర్టు ఆర్డర్‌ను వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభికి అందించడం జరిగిందని, ఆర్డర్లో చూపిన విధంగా ఇరిగేషన్ శాఖలో లస్కర్ , హెల్పర్లుగా 1878 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున ఆ పోస్టులలో 50 శఆతం పోస్టులు తప్పనిసరిగా ముంపు ఇవ్వాలని కోరుతూ కోర్టు ఆర్డర్ కాపీని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి అందజేసినట్లు తెలిపారు. 1986లో వచ్చిన 98 జీఓ, 2014లో వచ్చిన 68 జీఓ ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికి ఎక్కువ శాతం మందికి ఇవ్వకపోవడంతో వారు అటు నాయకుల చుట్టూ ప్రజా ప్రతినిధుల చుట్టూ ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగి వేయారని అన్నారు. దీంతో కోర్టు సానుకూలంగా స్పందించి ఇరిగేషన్ శాఖలో శ్రీశైలం ముంపు నిర్వాసితులకు లస్కర్ , హెల్పర్లుగా 50 శాతం ఉద్యోగాలు ఇద్వలని కోర్టు ఆర్డర్ ఇవ్వడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా శ్రీశైలం ప్రాజెక్టు ముంపు బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని వారికి అభయం ఇచ్చారు. ముంపు బాధితులకు ప్రతి ఇంటికి 20 లక్షల ప్యాకేజీ ఇస్తూ 2013 ఆర్అండ్ఆర్ ప్యాకేజీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ ప్రతినిధి :** బిఈడి కళాశాల లో శౌచాలయాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మంచిగా చదువుకొని మహబూబ్‌నగర్ ను ఎడ్యుకేషనల్ లో మొదటి స్థానంలో నిలపాలి ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేసిన విద్యార్థులు కళాశాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మెట్టుగడ్డ లోని బిఈడి కళాశాల ఆవరణలో విద్యార్థుల కోసం నూతనంగా నిర్మిస్తున్న శౌచాలయాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఆడబిడ్డలు శౌచాలయ గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సమస్యలను అర్థం చేసుకొని మా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరం కలిసి వారికి శౌచాలయాలు ఏర్పాటు చేయుటకై నిధులు సమకూర్చి శుక్రవారం శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని, నియోజకవర్గం లోని ఏ పాఠశాల కానీ, కళాశాలలో కానీ ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి వస్తే తప్పకుండా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాజకీయం అంటేనే సమాజ సేవ చేయడమని ఆనాడే గాంధీ తెలిపారని, గాంధీ వారసులుగా మేము సమాజ సేవ చేస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు. మహబూబ్ నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్ గా మార్చాలనే సంకల్పం తో ఉన్నామని, అందుకు మీ అందరు కూడా చదువులో మంచిగా రాణించి, మహబూబ్‌నగర్ ను విద్యాలో మొదటి స్థానంలో నిలపాలని ఆయన కోరారు. ఎన్నో సంవత్సరాలుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగానే వెంటనే పరిష్కరిస్తున్నందుకు విద్యార్థులు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రోజా తిరుమల వెంకటేష్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహా రెడ్డి,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షులు గోనెల శ్రీనివాస్, జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గంజి ఆంజనేయులు, అజ్మత్ అలి,గుండా మనోహర్, శ్రీనివాస్ యాదవ్, శకళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ ముజీబుర్ రహేమాన్, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.




## దళితహక్కుల ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** హైదరాబాద్ పట్టణంలోని ఖైరతాబాద్ లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్యభవన్‌లో జనవరి 5, 6, 7తేదీలలో నిర్వహించే అఖిలభారత దళితహక్కుల ఉద్యమం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని దళితహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు కొమ్ముభరత్ కోరారు. శుక్రవారం తాడూరు మండలకేంద్రంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన కార్యకర్తలతోకలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యంవచ్చి 77 ఏళ్లుపూర్తిచేసుకున్న అట్టడుగువర్గాలైన దళితుల అభ్యున్నతికోసం భారత రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు నేటికి దళితులదరికి చేరడంలేదన్నారు. దేశవ్యాప్తంగా దళితులను ఆర్థిక రాజకీయ సామాజికహక్కుల పరిరక్షణ సామాజిక న్యాయం కులవివక్షత కులనిర్మూలనకొరకు ఎస్సి ఎస్టిసబ్‌ప్లాన్ దేశవ్యాప్తంగా అమలుచేయాలని దళితుల అభివృద్ధికి కేటాయించిన నిధులుదారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలుచేయాలని అన్నారు. ఈమహాసభలలో దేశవ్యాప్తంగా వెయ్యిమంది ప్రతినిధులు పాల్గొంటారని సహృదయంతో అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొమ్మురాము, అధ్యక్షులు కొట్రబాలు, ఉపాధ్యక్షులు నాగరాజు, నాయకులు బంగారయ్య, కృష్ణ, రాములు,ఆంజనేయులు, వెంకటయ్య, బాలమణి,గోపాల్ పాల్గొన్నారు.



## విద్యా వ్యవస్థపై ప్రభుత్వానికి నిబద్ధత

**ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ ప్రతినిధి :** విద్యా వ్యవస్థ పైన రాష్ట్ర ప్రభుత్వానికి నిబద్ధత ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ఫత్తేపూర్ క్లస్టర్ 3 లో అంగన్వాడి విద్యార్థులకు శుక్రవారం స్కూల్ యూనిఫామ్స్ ను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి చిన్నారులకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి మంచి ఆరోగ్యాన్ని ఇస్తూ, చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో, విద్యాబుద్ధులు నేర్పిస్తూఅంగన్వాడి కేంద్రాలు సమాజంలో మంచి పాత్ర పోషిస్తున్నాయని కితాబిచ్చారు. ఈ సంవత్సరం నుంచి అంగన్వాడీ కేంద్రాలు సమాజం లో మంచి పాత్ర పోషిస్తున్నాయని కితాబిచ్చారు. ఈ సంవత్సరం నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న అనంతరం చిన్నారులతో ముచ్చటించారు. చెప్పిన పాటలు ఎమ్మెల్యే ఆసక్తిగా విన్నారు. చిన్నారులను పేర్లను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకురావాలని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహా రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ,నాయకులు పందరి నాథ్, భాస్కర్ నరేష్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ ఎంపిడిఓ కరుణ శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## 15నుంచి మెన్ ఉమెన్ షూటింగ్‌బాల్ ఎంపిక

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ఈనెల15నుంచి మెన్ ఉమెన్ షూటింగ్‌బాల్ ఎంపిక చేయనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా షూటింగ్‌బాల్ ఆసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి రాఘవేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమం తెలంగాణరాష్ట్ర షూటింగ్‌బాల్ ఆసోసియేషన్ ప్రధానకార్యదర్శి మంగళంపల్లి శ్రీనివాస్, చెరుకుపల్లి ఐలయ్య ఆదేశాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమెన్స్‌జిల్లా ఎంపికలు పట్టణంలోని గౌతమిపాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 15 ఆదివారం ఉదయం 10గంటలకు గౌతమి పాఠశాలలో ఆసక్తిగలవారు రిపోర్టుచేయాలన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు.



## చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డ వివాహాలకు కానుకలు అందిస్తున్న కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను నేడు నవాబ్ పేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి 67 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి షాది ముబారక్ పేదింటి ఆడబిడ్డలకు వరం అని చెప్పారు. దొండ్లపల్లి నుండి నవాబ్ పేట్ వరకు రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి ఈ సంవత్సరంలోపే ఈ రోడ్డు పూర్తవుతుందని తెలిపారు. కొల్లూరు గ్రామానికి 132కివి సబ్ స్టేషన్ ను సాంక్షన్ చేయాలని దరఖాస్తు చేయడం జరిగిందని తెలపారు. నవాబ్ పేట్ మండల కేంద్రంలో 7 ఎకరాల స్థలం కేటాయిస్తే మినీ స్టేడియం మంజూరు చేయిస్తానని అన్నారు. యన్మంగండ్ల, నవాబ్ పేట్ చెరువులను మినీ ట్యాంకు బండ్ లుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. మరిన్ని నిధులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మండలానికి తీసుకొచ్చి మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## విద్యార్థుల ఆహార భద్రతపై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం / నారాయణపేట :** విద్యార్థుల ఆహార భద్రతపై అధికారులు, ఉపాద్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో ఫుడ్ కమిషన్ సభ్యులు గోవర్ధన్ రెడ్డి, రంగినేని శారద, ఎం. భారతి, బి. జ్యోతి, నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలంలోని గుడిగండ్ల , జక్లేర్ , మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఆయాపాఠశాలలో విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.

## ఆరు గ్యారంటీలపై అవగాహన డాక్యుమెంటరీ

**ప్రజాపక్షం/పెబ్బేరు :** అయ్యవారిపల్లి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలపై అవగాహన కల్పించేందుకు నలుగురి బృందం డాక్యుమెంటరీని చిత్రీకరిస్తుంది. శుక్రవారం గ్రామంలో గ్రామ సెంటర్లలో తీస్తున్న డాక్యుమెంటరీని గ్రామ కాంగ్రెస్ యువ నాయకుడు లక్ష్మణ్ నాయుడు కెమెరా స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వైవి. రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో డాక్యుమెంటరీ కో ఆర్డినేటర్ రామదాసు నేతృత్వంలో చిత్రీకరణ జరుగుతుందని చెప్పారు. గ్రామ సభ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల అవగాహన సదస్సును చిత్రీకరించడం జరిగింది. గ్రామ సభ నిర్వహించిన ఈ సందర్భంగా చిత్రీకరణ జరుగుతుందని చెప్పారు. కొన్ని సన్నివేశాలను స్థానిక నటులతో తీశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మనాయుడు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/శ్రీరంగాపురం :** మండల పరిధిలోని వెంకటాపురం చౌరస్తాలో గత నెల 31న చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా చిన్నంబాయి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన గోపాల్ పట్టు పడ్డారని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గోపాల్‌ను వనపర్తి జిల్లా కోర్టు ముందు హాజరు పర్చగా శుక్రవారం జడ్జి 6 రోజుల జైలు శిక్ష విధించారని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠినంగా వ్యవహరిస్తామని వాహనదారులకు సూచించారు.

## కామ్రేడ్ కొమారి రామయ్య వర్ధంతి



ప్రజాపక్షం/సుజాతనగర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, ఈ ప్రాంత తొలి తరం కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు, అమరజీవి కామ్రేడ్ కొమారి రామయ్య నాలుగో వర్ధంతి ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని నాయకులగూడెం గ్రామంలో సుజాతనగర్ సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వారి విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సుజాతనగర్ మండల కార్యదర్శి కామ్రేడ్ భూక్య దస్రు, సిపి ఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, సంయుక్త కార్యదర్శి కొమారి వీర హనుమంతరావు, సిపిఐ పార్టీ మండల నాయకులు బొడ్డు కేశవరావు, దండు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొని వారికి నివాళులర్పించారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రఘునాథపాలెం మండల పరిధిలోని పలు గ్రామాల్లో కల్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి యరగర్ల హన్మంతరావు, వాంకుడోత్ దీప్లా నాయక్, తేజావత్ వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బానోత్ కోటేష్ నాయక్, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బ్లూమింగ్ మైండ్స్‌లో వైలెట్ కలర్ డే



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ పాఠశాల, జూనియర్ కళాశాలలో వైలెట్ (ఉదారంగు) కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవా రం పాఠశాలలో నిర్వహించిన వైలెట్ కలర్ డే వేడుకల సందర్భంగా చిన్నారులంతా వైలెట్ కలర్ దుస్తులు ధరించి సందడి చేశారు. పాఠశాల కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి మాట్లా డుతూ ఉదారంగు సృజనాత్మకతకు నిదర్శనమని ఎరుపు నీలం మధ్యరంగు ఇంటర్మీడియట్ అని దీనినే ఉదారంగు అంటారన్నారు. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ పార్టీ నాయకులు దొండపాటి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/జూలూరుపాడు : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు దొండపాటి శ్రీనివాసరావు (వాసు) అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలూరుపాడు మండలం (కాకర్ల) గ్రామ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు లేళ్ల వెం కటరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా అధ్యక్షులు అల్లాడి నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ ఓ ప్రకటనలో తెలిపినట్లు ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మండ్లు అందుతాయని, అందరూ సిద్ధంగా ఉండాలని, అదే విధంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులు కార్యకర్తలు అధికారులకు సహకరించి లబ్ధిదారులను గుర్తించాలని తెలియజేశారు.

## ప్రభుత్వం మెప్మా ఆర్‌పిలను గుర్తించాలి

* ఏడు నెలల జీతాలను వెంటనే చెల్లించాలి



ప్రజాపక్షం/మణుగూరు రూరల్ : ప్రభుత్వానికి, డ్వాక్రా సంఘాల సభ్యులకు, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పథకం గురించి చెర వేసే విధంగా విధులు నిర్వహిస్తున్న ఆర్‌పి ఉద్యోగులకు గత ఏడు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మణు గూరుకు చెందిన వారు శుక్రవారం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మెప్మా ఆర్‌పిలు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రతల గురించి ధర్నా నిర్వహిస్తున్న వారిని ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తీసుకెళ్లారు. ఆర్‌పి సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వార ధిగా ఉంటూ ప్రభుత్వ పథకాల గురించి డ్వాక్రా సంఘాల సభ్యులకు చేరవేస్తూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న మాకు కనీస జీతభత్యాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతుందని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి ఉద్యోగ భద్రత, ప్రతి నెల జీతాలు అందించే విధంగా చొరవ చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మణుగూరుకి చెందిన ఆర్‌పిలు పాల్గొన్నారు.

## నేడు, రేపు మంత్రి భట్టి పర్యటన

ప్రజాపక్షం/ఖమ్మం:రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క రెండు రోజుల పాటు ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క శని, ఆదివారాల్లో ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిసి రోడ్లను ప్రారంభిస్తారని, అనం తరం బోనకల్‌లో సంక్షేమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతోగడిపి, శాంతినిలయంలో రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. తర్వాత గోవిందాపురం(ఎల్)గ్రామంలో ఐదు సిసి రోడ్లకు, ఇతర పనులకు శంకుస్థాపనచేస్తారు. అనంతరం జానకిపురం,రాపల్లి, మధిర మండలం రొంపిమల్లతదితర గ్రామాల్లో పర్యటించి శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు.

## ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగులకు పే స్కేల్ అమలు

ధర్నాకు సంఘీభావం తెలిపిన పిఆర్‌టియు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విద్యాశాఖలో సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్‌అమలు చేయాలని పిఆర్‌టియు ఖ మ్మం జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) డిమాండ్ చేశారు. ఉద్యోగ క్రమబద్ధీకరణతో పాటు కనీస పేస్కేల్ అమలు చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాన్ని పిఆర్‌టియు ఖమ్మంజిల్లా నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వైవి మాట్లాడుతూ సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న సిఆర్‌పి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్‌పి మేసెంజర్లకు కెజిబివి, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతన స్కేల్‌ను అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పిఆర్‌టియు భద్రాద్రికొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 20 లక్షల ఇండ్ల నిర్మాణమే లక్ష్యం

**నెలాఖరు నాటికి లబ్ధిదారుల వివరాల సేకరణ**

**580 మోడల్ గృహాల నిర్మాణం**

**సంక్రాంతికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ నమూనా**

**పాలేరు నియోజక వర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి**



ప్రజాపక్షం/ఖమ్మం/కూసుమంచి/తిరుమలాయపాలెం: రాబోయే నాలుగేళ్ల కాలంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే ఇందిరమ్మ మోడల్ ఇండ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఏడాది కాలం అయిన నేపథ్యంలో ఉత్సవాలను నిర్వహించుకున్నామని ఆయన తెలిపారు. రాబోయే నాలుగేళ్లలో పేదవాని సొంతింటి కల నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఈనెల ఐదున ఇందిరమ్మ ఇండ్ల యాప్‌ను ప్రారంభించామని పొంగులేటి తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో 80 లక్షల మంది ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని వీరిలో అర్హులైన దరఖాస్తులను ఎంపిక చేసి మొదటి విడత ప్రభుత్వం మంజూరు చేసే నాలుగున్నర లక్షల ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం నివసిస్తున్న పరిస్థితిని బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. లబ్ధిదారులకు నాలుగు విడతల్లో ప్రభుత్వం నుంచి సాయం అందుతుందని తెలిపారు. పునాది వేసిన తర్వాత లక్ష, కిటికిల స్థాయికి చేరగానేరూ.1.25 లక్షలు, స్లాబ్ దశ చేరిన తర్వాత రూ.1.75 లక్షలు, ఇల్లు పూర్తి చేసిన తర్వాత మరో లక్ష రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. డోర్నకల్ నియోజక వర్గంలోని ఎంపిడివో కార్యాలయంలో మోడల్ హౌజ్‌కు శం కుస్థాపన చేశామన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు కూడా ఇప్పుడు దరఖాస్తు చే సుకోవచ్చునని తెలిపారు. తిరుమలాయపాలెం, ఖ మ్మం రూరల్, కూసుమంచి మండలాల్లో పలు గ్రా మా ల్లో సిసి రోడ్లకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్లు సీతారాములు, హరినాథ్‌బాబు, ప్రత్యేకాధికారి రమేష్, ఆర్డీవో నర్సింహారావు, అధికారులు పలువురు కాంగ్రెస్ ప్రతినిధులు హాజరయ్యారు.

### రూ.రెండు కోట్ల 50లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చుకుంటూ వస్తుందని సంక్రాంతి కల్లా అర్హులైన పేదవారికి ఇందిరమ్మన్లు కట్టివబోతున్నామని పాలేరు శాసనసభ్యులు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొం గులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొక్కిరేణి, బీరోలు, బచ్చోడు,బచ్చోడు తండా, హస్నాబాద్, సుబ్లేడు, పాతర్లపాడు, గ్రామాల్లో సిసి రోడ్లు సైడ్ కాల్వల నిర్మాణం కొక్కిరేణి హైస్కూల్లో సైన్స్ ల్యాబ్ కోసం భవన నిర్మాణంకు మొత్తం కలిపి రెండు కోట్ల 50 లక్షల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వివిధ గ్రామాల లబ్ధిదారులకు మం జూరైన 46 కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, పిఆర్ ఈఈ వెంకట్ రెడ్డి, ఏడిఏ సరిత, తహసిల్దార్ పి.వి రామకృష్ణ, ఎంపిడిఒ ఎస్‌కే సిలార్ సాహెబ్, మండల వ్యవసాయ అధికారి సీతారాంరెడ్డి, బీరోలు సొసైటీ ఛైర్మన్ రామ సహాయం నరేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

## బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/మణుగూరు : మణుగూరు మండలం రాయిగూడెం గ్రామంలో రాయగూడెం నుండి గో దావరి ఒడ్డు వరకు రూ.90 లక్షల ఖర్చుతో నూతన బీటీ రోడ్డు పనులకు శుక్రవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయంను నాయకులు, గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రతి గ్రామంలో అమలు పరుస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మ హిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల వ్యవసాయ మోటార్ల చోరీ

ప్రజాపక్షం/చంద్రుగొండ: మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన రెండు వ్యవసాయ విద్యుత్ మోటర్లు చోరికి గురైనట్లు బాధిత రైతులు, గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం తిప్పనపల్లి గ్రామా నికి చెందిన రైతులు కందిమళ్ల శ్రీను,ఎల్లబోయిన మల్లయ్యలు తమ పొలాల వద్ద ఎదుళ్లవాగులో వ్యవసాయ సాగునీటి అవసరాల కోసం రెండు మోటర్లను అమర్చామని, ఈ ఏడాది వానకాలం పంటకాలం అయిన ప్రస్తుత సమయంలో శుక్ర వారం తెల్ల వారుఝామున గుర్తు తెలియని వ్యక్తులు రెండు మోటర్లను చోరీ చేశారని తెలిపారు. బాధిత రైతులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## కెపియుజి ఉద్యోగుల శ్రమ అభినందనీయం

* కష్టంతో నష్టాన్ని నివారించిన సింగరేణి రెస్క్యూ బృందం
* సింగరేణి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రశంస





ప్రజాపక్షం/మణుగూరురూరల్ : కష్టంతో నష్టాన్ని నివారించిన సింగరేణి రెస్క్యూటీం, కొం డాపురం భూగర్భఖని ఉద్యోగుల శ్రమ అభినందనీయమని సింగరేణి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు ప్రశంసల వర్షం కురిపిం చారు. మణుగూరు కొండాపురం భూగర్భ గనిలోకి నాలుగు రోజుల క్రితం అనూహ్యంగా నీరు చేరుకుందన్న విషయాన్ని తెలుసుకున్న ఆయన సింగరేణి అధికారుల అనుమతితో తమ సంఘం సభ్యులతో కలిసి వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించి శుక్రవారం కొండాపురం భూగర్భ ఘనినిని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూగర్భ గనుల్లో ప్రకృతి వైపరీత్యం ప్రభావం మరియు విపత్తులు సాధారణమేనని సరైన ప్రణాళికతో సింగరేణి రెస్క్యూ టీం సహకారంతో యుద్ధ ప్రాతిపదికన వాటి తీవ్రతను తగ్గించుకోవటంలో కొండాపురం భూగర్భగని అధికారులు, కార్మికు లు విజయం సాధించారని తెలిపారు. నాలుగు రోజుల క్రితం మణుగూరు ఏరియా కొండాపురం గనిలో అనూహ్యంగా నీరు చేరటంతో గని ప్రాజెక్ట్ అధికారి పి.వీరభద్రరావు, మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లు నేతృత్వంలో పరిస్థితి అంచనా వేసి గని ఉద్యోగుల సహకారంతో ప్రకారం అక్కడ రెస్క్యూ టీమ్ సభ్యులు, ఉద్యోగుల సహకారంతో బాహుబలి పంపులతో గనిలోకి చేరుకున్న నీటిని బయటకు పంపించే విషయంలో అధికారుల సూపర్వైజర్ల కార్మికుల కాంట్రాక్ట్ కార్మికుల సమష్టి కృషి అభినందనీయం అన్నారు. అనంతరం గనిలో జరుగుతున్న పనులను కూడా తెలుసుకోవటం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా గనిలో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి పునరుద్ధరణ ప్రక్రియ కొనసాగుతుందని మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లు తమకు వివరించారన్నారు. ఈ సందర్భంగా గని అధికారులు, ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగస్తుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి జిమ్మడి మల్లేష్ , ఉపాధ్యక్షులు శనిగరపు కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పరిశ సీతారత్నం ట్రస్టు సేవలు అమోఘం




ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్: విద్యారంగ అభివృద్ధికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అమో ఘం, అభినందనీయమని బాలాజీ నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యురా లు సూర్యదేవర అజిత తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని యుపిహెచ్ కాలనీలో గల బాలాజీ నగర్ ఉన్నత పాఠశాలకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య 15 కుర్చీలను ప్రధానోపాధ్యాయురాలు సూర్యదేవర అజితకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అజి త మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పరిశ సీతార త్నం చారిటబుల్ ట్రస్టు ద్వారా తమ వంతు సహాయ సహకారాలను అందిస్తున్నారని ఆమె తెలి పారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రతిభ ఉన్న విద్యార్థులకు ట్రస్టు ఆధ్వర్యంలో తోడ్పాటునందిస్తున్నారని ఇది ఎంతో అభినందనీయమన్నారు. ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, షేక్ హమీద్, పాఠశాల ఉపాధ్యాయులు ఎం. రాములు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహాల మంజూరులో సర్వే వేగవంతం



ప్రజాపక్షం/పాల్వంచ: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం చేపడుతున్న ఇందిరమ్మ పక్క గృహాల మంజూరులో అధికారులు సర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పాల్వంచలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపిడిఒ నారాయణను కొత్వాలతో పాటు కాంగ్రెస్ నాయకులు కలిసి ఇందిరమ్మ గృహాలు, ఇందిరమ్మ కమిటీలపై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారాల్లో పేదలకు రూపాయలు రూ.5లక్షలతో ఇంటి నిర్మా ణానికి ఇచ్చిన హామీ మేరకు ప్రజాపాలన సభలలో దరఖాస్తులు స్వీకరించిందన్నారు. మంజూరు విషయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, నాయకులు కందుకూరి రాము, వై వెంకటేశ్వర్లు, ధర్మసోత్ ఉపేందర్, డిష్ నాగేశ్వరరావు, శ్రీలతరెడ్డి, అరుణ రెడ్డి, భూక్యా ప్రసాద్, నూనావత్ దేవా, గుగులోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగే భవితకు రక్ష

15న ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

సమావేశంలో రైతు నేత ఎన్‌వి



ప్రజాపక్షం/ఖమ్మం : రసాయన క్రిమి సంహారక మందుల వాడకం పెరిగిన నేపథ్యంలో ప్రజలు అనారోగ్యం బారీనపడుతున్నారని భవిష్యత్తులో సేంద్రియ వ్యవసాయమే ప్రజలకు రక్ష అని సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు, రైతు బంధు మాజీ అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వర్లు (ఎన్‌వి) తెలిపారు. తక్కువ పెట్టుబడితో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చునని ఆయన అన్నారు. శుక్రవారం ఈఆర్ ఆర్ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ప్రకృతి వ్యవసాయంపై విపరీతమైన ప్రచారం జరుగుతుందని ప్రోత్సాహకం కూడా లభిస్తుందన్నారు. సేంద్రియ సాగు పట్ల రైతులు ఆకర్షితులవుతున్నారని ప్రస్తుత పరిస్థితుల్లో సేంద్రియ సాగు ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందన్నారు. కూరగాయలు, పాలు, నీళ్లు, గాలి, మాంసహార పదార్థాలు కూడా కల్తీ జరుగుతున్నాయని తద్వారా ప్రమాదకర వ్యాధుల బారీన ప్రజలు పడుతున్నారన్నారు. సాగుకు సహకరించే పశువులు, పక్షులు కనుమరుగవుతున్నాయని అన్నింటికి మించి నేల నిస్సారం అవుతుందన్నారు. హరిత విప్లవం ఉత్పత్తిని పెంచడంతో పాటు విపత్తులను కూడా తెచ్చి పెట్టిందని ఆయన తెలిపారు. ఈ పరిస్థితుల్లో సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు దేశ వ్యాప్తంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందని ఇందులో భాగంగా ఈనెల 15న ప్రకృతి వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్ అనుచరుడు విజయ్‌రామ్‌తో ఈఆర్ఆర్ రిసార్ట్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎన్‌వి తెలిపారు. ఫిబ్రవరి మాసంలో హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనంలో 10 వేల మంది రైతులతో 10 రోజుల పాటు సేంద్రియ సాగుపై ప్రచారం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో సేంద్రియ వ్యవసాయ రైతు డా॥ చల్లా నాగేశ్వరరావు మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తుల వాడకం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని సేంద్రియ సాగువల్ల దిగుబడి తగ్గుతుందన్నది కేవలం అపోహ మా త్రమే అని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇదే పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే 2040 నాటికి భూమి సారం కోల్పోయి ఇసుక ఏర్పడుతుందన్నారు. ఇప్పుడు మనమంత డేంజర్ జోన్‌లో ఉన్నామని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని సేంద్రియ సాగు వైపు మరలాలని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సేంద్రియ రైతు,ఉపాధ్యాయురాలు కుతుంబాక మాధవి, కమ్మ మహాజన సంఘంకార్యదర్శి గుడవర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సైదుబాబు పాల్గొన్నారు.

## ముక్కోటికి మ్యూజియాన్ని సిద్ధం

ఐటిడిఎ పిఒ



ప్రజాపక్షం/భద్రాచలం : ముక్కోటి ఏకాదశి నాటికి గిరిజన మ్యూజియంను సిద్ధం చేయాలని ఐటి డిఎ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తెలిపారు. ఐటిడిఎ ప్రాంగంలోని ట్రైబల్ వెల్ఫేర్ మ్యూజియంను గురువారం రాత్రి ట్రైబర్ మ్యూజియం డైరెక్టర్లతో సందర్శించి మ్యూజియంలోని ఆదివాసీ తెగల సామాన్ల గురుంచి వారికి వివరించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ పాతతరం గిరిజ నులకు సంబంధించి సాంప్రదాయ బద్ధమైన వస్తువులు సేకరించి మ్యూజియంను అభివృద్ధి చేసేందుకు పర్యాటకశాఖ అనుమతి లభించినందున ఆదివాసీల నివాసాలు, సాంప్రదాయాలు, వంట కాలు అన్ని రకాలుగా పర్యాటకుల నుఆకట్టుకునేలా తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ మ్యూజియం డిజైన్ ఆకర్షించే విధంగా రూపొందించాలన్నారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగు కాకుండా నేటి తరం గిరిజన యువతారానికి తెలిసే విధంగా, ఇవి ఖండాంత రాలకు వ్యాపించేందుకు మ్యూజియాన్ని నెలకొల్పండం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజు, మ్యూజియం డైరెక్టర్ సత్యనారాయణ, డిఇ హరీష్, జేడిఎం హరికృష్ణ, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి పాల్గొన్నారు.

## రూ.కోటి భూమి కబ్జాకు యత్నం

**పాస్టర్ ముసుగులో ఆక్రమణ?**

**పోలీసులను ఆశ్రయించిన క్రిస్టియన్ సర్వీస్ యూనిట్స్**



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలం ఎదులాపురం గ్రామంలోని డాక్యుమెంట్ నెం.233/1999 ద్వారా హైదరాబాద్‌కు చెందిన క్రిస్టియన్ సొసైటీకి 630 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇం దులో కొంత భాగంలో చర్చి నిర్మాణం చేశారు. జయప్రసాద్ అనే వ్యక్తి ఫాదర్ అవతారమెత్తి భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేసి తదనుగుణంగా పావులు కదిపాడు. తనకు అనుకూలంగా ఉండే రాజకీయ నాయకుల మద్దతు కూడగట్టాడు. ఈ భూమి తనదేనని క్రిస్టియన్ సంస్థలను సైతం బెదిరించడం ప్రారంభించాడు. చర్చి చుట్టు ఉన్న స్థలాన్ని ఫంక్షన్‌లకు అద్దెకిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో క్రిస్టియన్ సంస్థ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కబ్జా కథ వెలుగులో కి వచ్చింది. కొంత మంది గ్రామస్తులు ఈ మొత్తం వ్యవహారాన్ని క్రిస్టియన్ సొసైటీకి తెలియజేశారు. తన తండ్రి మృతి చెందిన తర్వాత పాస్టర్‌గా వ్యవహరిస్తున్న జయప్రసాద్ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నం చేశాడన్న విషయం తెలుసుకుని చర్చికి తాళం వేసి స్థలం కబ్జాకు గురికాకుండా ఏర్పాట్లు చేశాడు. ఆక్రమితదారుడు తాళం పగులగొట్టి అందులోకి జొరబడడంతో క్రిస్టియన్ సంస్థ వారు పోలీసులను ఆశ్రయించారు. రూరల్ పోలీసులు జయప్రసాద్‌పై కబ్జా కేసు నమోదు చేశారు.

**అరాచకాలు, రాజకీయ విద్వేషాలు:** చర్చి స్థలంపై కన్నేసిన జయప్రసాద్ తనకు తానుగా చర్చి ఫాదర్‌గా ప్రకటించుకున్నాడు. చర్చి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాననే ముసుగులో అరాచకాలు, రాజకీయ విద్వేషాలకు కేంద్రంగా పవిత్ర స్థలాన్ని తయారు చేశాడు. కొంత మంది అక్రమార్కులతో కలిసి చివరకు పవిత్రమైన స్థలాన్ని అపకీర్తిని తెచ్చిపెట్టాడు. తాను పాస్టర్‌నని,రిపోర్టర్‌నని, వ్యాన్ డ్రైవర్‌నని అలా రంగులు మార్చుకుంటూ కబ్జా ప్రయత్నం చేసినా చివరకు పోలీసు కేసు నమోదయ్యే వరకు వచ్చింది.

## వృద్ధ దంపతుల హత్యకేసులో నిందితుల అరెస్ట్

* నిందితుడు పేర్లు మార్చి పలు ప్రాంతాల్లో తప్పించుకు తిరిగిన వైనం
* త్వరితగతిన ఛేదించిన పోలీసులు



ప్రజాపక్షం/ఖమ్మం, క్రైం : నేలకొండపల్లిలో నెల 26వ తేదిన జరిగిన బియ్యం వ్యాపారి నారాయ ణ, కృష్ణకుమారి వృద్ధ దంపతుల హత్యకు గురైన ఘటన తెలిసిందే జిల్లా వ్యాప్తంగా సంచలనం సృ ష్టించిన ఈ ఘటన నెల రోజులు గడవక ముందే పోలీసులు ఛేధించారు. పోలీస్ కమిషనర్ సునిల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి నేతృత్వంలో బృందాలుగా వీడి ఖమ్మంతో పాటు పరిసర జిల్లాలు సూర్యాపేట, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ ముఠా సభ్యుల కోసం గాలించారు. చివరికి ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామం శివారు చెక్ పోస్ట్ వద్ద ఈనెల 12 గురువారం రాత్రి సమయంలో వాహన తనిఖీలు చేస్తు న్న పోలీసులకు అనుమానస్పదంగా సంచరిస్తున్న ఎనిమిది మంది సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య ఉదాంతం బయట పడింది. ఇందుకు సంబంధించిన వివరాలను పో లీసు కమిషనర్ సునిల్‌దత్ శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీ ఆర్ జిల్లా కంచికచర్ల మండలం మెగులూరు గ్రా మానికి చెందిన మామిడికాయల వ్యాపారి షేక్ అ బీద్ అలియాస్ అబిద్ అలీ అలియాస్ ఆరీఫ్ అలియాస్ సోహెల్ కొంతకాలంగా ఖమ్మం నగరంలోని బోగంకుంట బజార్‌లో నివాసముంటు పండ్ల వ్యాపారం చేసుకుంటున్నాడు. అబీద్‌పై గతంలో కేసులు సైతం ఉన్నాయి. 20 11లో కంచికచర్లలో జరిగిన హత్య కేసులో జైలు కు సైతం వెళ్లి 2020లో పెరోల్‌పై బయటికి వచ్చి పోలీసులు గుర్తించకుండా ఉండేందుకు పేర్లు, ఊర్లు మారుస్తూ తప్పించుకు తిరుగున్నాడు. తొలుత సూర్యాపేట జిల్లా కోదాడలో తాన పేరు అబిద్‌కు బదులు సొహైల్‌గా స్థానికులకు పరిచయం చేసుకుని ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. అక్కడే ఉంటున్న టీ వ్యాపారి షేక్ హుస్సేన్‌బితో పరిచయం పెంచుకున్నాడు. అనంతరం స్థానిక కొబ్బరికాయల వ్యాపారి చిట్టిపోలు సురేష్, బుద్దారంలో ఉంటున్న జమాల్‌బి పరిచయం చేసుకున్నారు. ఈ తరుణంలో జమాల్ బీ ఆమె నేలకొండపల్లిలోని బియ్యం వ్యాపారి వెంకటరమణ బడా వ్యాపారిని దంపతులు ఇద్దరు వృద్ధులని వారి ఇట్లో అద్దెకు దిగితే అనుకున్న పని పూర్తిఅవుతుందని చెప్పింది. వెంటనే అమె ఇంటిని చూపించింది.తొలుత అబీద్ తన స్నేహితుడు సురేష్‌తోకలిసి నేలకొండపల్లిలోని వెంకటరమణ ఇంటికి వెళ్లి సురేష్‌ను శ్రీనివాస్‌గా పేరు మార్చి పరిచయం చేసుకుని తాను భద్రాచలంలో ఉపాధ్యాయ నిగాపనిచేస్తానని నెలరోజులతో తన కుటుంబ సభ్యు లను తీసుకువస్తానని నమ్మబలికి ఇల్లు అద్దెకు కావాలని కోరగా అందుకు సదరు ఇంటి యజమాని నిరాకరించడంతో వెనుదిరిగారు. పథకం మార్చి ఈసారి షబానా, హుస్సేన్‌బీ వెంకటరమణ వద్దకు వెళ్లి ఇల్లు అద్దెకు కావాలంటూ కిరాయి 5వేలు ఇస్తామంటూ నమ్మబలికి ఇంట్లోకి దిగారు. వెంకటరమణ, కృష్ణవేణి దంపతులతో మంచివారిగా నటి స్తూ వారితో సన్నిహితంగా ఉంటూ వారి కి దగ్గరైయ్యారు.ఇదే అదునుగా అబిద్, సురేష్‌లు గతనెల 25న రాత్రి సమయంలో నెలకొండపల్లిలో వారుఉంటున్న ఇంటిలోకి ప్రవేశించి మాటువేశారు. 26 వతేదీ రాత్రి వెంకటరమణ భార్య కృష్ణకుమారి టీవి చూస్తుండగా అమె వద్దకు షబానా, హుస్సేన్‌బీలు వెళ్లి మాటామాటా కలిపి అమె ఏమరుపాటుగా ఉన్న సమయంలో అ అబిద్, సురేష్‌లువెనుక నుంచి కృష్ణకుమారిపై దాడి చేసి గొం తునులిమి హత్య చేశారని సిపి వివరించారు. అమె పై ఉన్న అభరాణాలను దొంగిలించి, నిద్రలో ఉన్న వెంటకరమణపై దాడిచేసి గొంతునులిమి బంగా రు ఆభరణలు, సెల్ ఫోన్‌లు తీసుకుని పారిపోయారు. ఎవరు గుర్తుపట్టకుండా ఉండేందుకు గది మొత్తం తమ వెంట తెచ్చిన కారపోడి చల్లి అక్కడి నుంచి పరారైనట్లు సిపి తెలిపారు. 8 మంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 8తులాల బంగారం, 4సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీని ఛేధించడంలో చొరవచూపిన రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి, కూసుమంచి, నేలకొండపల్లి సిఐలు సంతోష్, సంజీవ్‌లతో పాటు ఎస్సైలను సిసిఎస్ సిబ్బందిని అభినందించారు. వారికి రివార్డులు ప్రకటించారు.

# మహానగరి

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ ప్రభుత్వ డిగ్రి కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడుతు కొంత కాలంగా కళాశాలకు రెగ్యూలర్ ప్రిన్సిపల్ లేకపోవడంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రఫీయాఖానమ్ మేడంను ఎఫ్ఏసి ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించడం జరిగిందన్నారు. దీంతో షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రి కళాశాలలో జంతుశాస్త్ర అసోషియెట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.శ్రీనివాస్ పదోన్నతిపై కొడంగల్ ప్రభుత్వ డిగ్రి కళాశాలకు రెగ్యూలర్‌గా నియమించడం ఎంతో హర్షణీయమన్నారు. కళాశాల అధ్యపక బృందం నూతన ప్రిన్సిపల్‌కు ఘన స్వాగతం పలికారు.

## శ్రీ శౌర్య స్కూల్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధి గౌతమ్ నగర్ లోని శ్రీ శౌర్య పాఠశాల నూతన సంవత్సర (2025) క్యాలెండర్‌ను బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పాఠశాల కరస్పాండెంట్ కారుపోతుల వెంకన్నతో కలిసి శుక్రవారం ఆవిష్కరిచారు.



## విద్యార్థులు విద్యతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాలలో రాణించాలి

**ప్రజాపక్షం/నాగారం:** విద్యార్థులు విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాలలో రాణించాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ ముఖ్య అతిథిగా విచ్చేసి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించారు. వర్షం కురుస్తున్నప్పుడు బయట ఆరవేసిని దుస్తులు తడవకుండా టెక్నిక్ నమూనా, డ్రైనేజీ క్లీనర్ టెక్నాలజీ, భూకంప పరికరాన్ని గూర్చి విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు, టీచర్లు వనజ, రాజ్యలక్ష్మి, అరవిందరెడ్డి, శ్రీదేవి, రఘు, వందన, వరమ్మ, సంధ్యారాణి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే మజ్దూర్ ఎన్నికల్లో ఘనవిజయం

### బ్రాంచ్ సెక్రటరీ బొల్లెపల్లి శ్రీనివాస్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రైల్వే మజ్దూర్ యూనియన్, ప్రత్యర్థి యూనియన్ ఎంప్లాయిస్ సంఘంపైన ఘనవిజయ సాధించిందని బొల్లెపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బ్రాంచ్ సెక్రటరీ బొల్లెపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిపి డబ్యూ ఆఫీసు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు జెండాలు పట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ గుర్తింపు ఎన్నికల్లో 4,5,6, తేదీల్లో రైల్వే మజ్దూర్ యూనియన్ ఎన్నికలు జరగగా ప్రత్యర్థి యూనియన్ ఎంప్లాయిస్ సంఘంపైన ఘన విజయం సాధించిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ జరుపుకున్నామని బొల్లెపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీలు అన్నపూర్ణ, బి హరికృష్ణ, మేదరి శ్రీకాంత్, వి అశోక్, సన్నీ, ఎం శ్రీనివాస్, ట్రెజరర్ ప్రవీణ్, యూత్ కన్వీనర్ అనుమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర శిక్ష అభియాన్ విభాగ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** జిల్లాలో తెలంగాణా విద్యా శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ విభాగ ఉద్యోగులను వెంటనే శాశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించటంతోపాటు వారి న్యాయపరమైన సమస్యలను జిల్లా ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కొనసాగిస్తున్న దీక్ష శుక్రవారం నాడు నాలుగవ రోజుకు చేరిన క్రమంలో వారిని కల్సిన ఎఐవైఎఫ్ ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామంటూ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. వీరితో పాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న కంట్రాక్టు ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నానాటికీ పెరుగుతున్న ఖర్చులతో జీవనాలు చాలీచాలని జీతాలతో గడపటం గగనమవుతోందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్, దేదీప్య, మల్లేష్, మల్లేష్, కిరణ్, స్వామి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక నుండి సిహెచ్ అక్రమ రవాణా

**ప్రజాపక్షం/తాండూరు:** కల్లులో కలిపే అతి ప్రమాదకరమైన సిహెచ్ (క్లోరల్ హైడ్రేట్) కర్నాటక నుండి తాండూరు ప్రాంతానికి అక్రమ రవాణ కొనసాగుతుంది. మండల కేంద్రమైన బషీరాబాద్‌కు చెందిన వర ప్రతాప్‌గౌడ్ సిహెచ్ విక్రహిస్తున్నాడన్న నమ్మదగ్గ సమాచారంతో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్ గౌడ్ ఆదేశాల మేరకు తాండూరు ఎక్సై సిఐ ఆధ్వర్యాన దాడులు నిర్వహించారు. బషీరాబాద్‌కు చెందిన కోడంగల్ వరప్రతాప్ గౌడ్ వద్ద 5కిలోల క్లోరర్ హైడ్రేట్‌ను పట్టుపడింది. ఈ మేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



అధికారుళ విచారణలో కర్నాటక రాష్ట్రానికి చెందిన నాగరాజగౌడ్ దగ్గర నుండి టోకుగా తీసుకుని వచ్చి దానిని కొంత ఎక్కువ ధరకు కల్తీకల్లు దారులకు విక్రహిస్తున్నట్లు తెలిపారు. ఎవ్వరి వద్దనైన సిహెచ్ కల్లి ఉన్న, విక్రమించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సోదాలలో ఎక్సైజ్ ఎస్ఐలు రవికుమార్, నిజాముద్దిన్, సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

## వంటశాల పరిశుభ్రంగా ఉండాలి

### వికారాబాద్ ఆర్‌డిఒ వాసుచంద్ర

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ నియోజకవర్గంలోని ధారుర్ మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల హస్టల్‌ను అకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం విద్యార్థులతో కలిసి భజనం చేసిన వికారాబాద్ ఆర్డిఓ వాసు చంద్ర, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్టల్ వంటశాల ,పాఠశాలలో పరిశుభ్రాంగా ఉండాలని అన్నారు. ప్రత్యేక అధికారులు ,తహసీల్దార్లు హస్టల్లు ,ప్రభుత్వ పాఠశాలను సందర్శించాలని కోరారు. నియోజకవర్గంలో ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరుగకుండ కఠిన చర్యలు తీసుకోవాలని , సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గోన్నారు.

## ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్ టోర్నమెంట్

### పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొడంగల్ :** విద్యార్థులలో ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మెన్ ఆర్.గురునాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయిలోని ఆయా గ్రామాలలోని విద్యార్థిని విద్యార్థులకు సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంబించారు. కొడంగల్ మున్సిపలిటీతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలలోని దాదాపు 10 గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన క్రీడాకారులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డి విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతు విద్యార్థులు చిన్నతనంనుంచే చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు.

కొడంగల్ పట్టణంలో క్రీడాలను ఆడేందుకు ఒకప్పుడు పెద్దగా స్థలం ఉండేదని ప్రస్తుతం పలు రకాల ప్రభుత్వ భవనాలు రావడంతో ఆ స్థలం కాస్తా తరిగిపోయిందన్నారు. మన కొడంగల్ ఎంఎల్ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉండటంతో వారు వెంటనే స్పందించి విద్యార్థులు, క్రీడాకారులు ఆడుకునేందుకు క్రీడా స్థలాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

మండల స్థాయిలో, తాలుక స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో రాణించి మన కొడంగల్‌కు పేరు ప్రఖ్యాతలు తీసుకురాగల సత్తా విద్యార్థులలో దాగి ఉందని ఆశభావం వ్యక్తం చేశారు. అనంతరం క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మెన్ కట్కం శివ కుమార్‌గుప్త, మార్కెట్ కమిటి చైర్మెన్ పట్నం అంబయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మున్సిపల్ కమిషినర్ బలరాం నాయక్, తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, మండల విద్యాధికారి రాంరెడ్డి, ఉపాధ్యాయులు, పిఈటిలు, విద్యార్థులు, తదితరులు పాల్గోన్నారు.

## మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలాబిందెల శ్రీనివాస్

**ప్రజాపక్షం/దుండిగల్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న కార్మికులకుప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 26వేలు జీతం చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలా బిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ వార్డు కార్యక్రమం వద్ద నిజాంపేట్ మున్సిపల్ కార్మికుల సమావేశం నర్సమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలాభిందెల శ్రీనివాస్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు ఆశీ యాదయ్య హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయడానికి ఆసుపత్రి సిబ్బంది ఫ్రీ క్యాంపు ఏర్పాటు చేయాలనీ సూచించారు. అలాగే ప్రతి నెల చీపుర్లు, చెప్పులు ఇవ్వాలని డిమాండు చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా పాలాబిందెల శ్రీనివాస్, అధ్యక్షులుగా ఆశీ యాదయ్య, కార్యదర్శి బి.దుర్గయ్య, ఉపాధ్యక్షులు నర్సమ్మ, భాగ్యమ్మ, సహాయ కార్యదర్శి అమృతమ్మ, యాదమ్మ, లక్ష్మి, నాగమ్మ, శ్రీను, నాగయ్య, తదితరులతో నూతన బాడీ ఎన్నుకున్నారు.



## గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**ప్రజాపక్షం/నవాబుపేట :** క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య క్రీడాకారులకు సూచించారు. నవాబుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సిఎం కప్–2024 క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. గెలుపొందిన జట్లకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి గ్రామాల్లోని యువతలో దాగియున్న ప్రతిభను వెలికితీసేందుకే క్రీడా ప్రాంగణాలు నిర్మించేలా ముందస్తు ప్రణాళికలు రచించారని, యువకులు, విద్యార్థు లు క్రీడా ప్రాంగణాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. వాలీబాల్ లో విజేతగా నిలిచిన, కబడ్డీలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న మోడల్ స్కూల్, కెజిబివి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మీనపల్లి కలాన్, ఎల్లకొండ, పుల్ మామిడి, జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్, కబడ్డీలో రన్నరప్ లుగా నిలిచిన జట్టు సభ్యులను ట్రోఫీతో పాటుగా ధృవీకరణ పత్రాలు, మెడల్స్ అందజేశారు. అదేవిధంగా అర్హులకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అనురాధ, ఎంఇఒ అబ్దుల్ రెహమాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, పిఎస్‌సిహెచ్ చైర్మన్ పోలీసు రామ్ రెడ్డి, ఎంసి చైర్మన్ గీత సింగ్, సింగిల్ విండో చేర్మెన్ వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సామా వెంకటరెడ్డి, కందాడ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ న్యాలం ప్రకాశం, భీమ్ రెడ్డి, జెడ్పిహెచ్ఎస్ నవాబుపేట ప్రధానోపాధ్యాయులు మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## 'సిఎం కప్'లో కప్ గోల్‌మాల్!

**ప్రజాపక్షం/నవాబుపేట్:** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం కప్ అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. శుక్రవారం వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలో ఎంపిడిఒ అధ్యక్షతన నిర్వహించిన సిఎం కప్ పంపిణీ కార్యక్రమంలో ఉపాధ్యాయుల అత్యుత్సాహం వల్ల విమర్శల పాలయ్యారు. ఇందుకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 9వ తేదీన మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సిఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్ గర్ల్స్ కబడ్డీ ఆటలో ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానానికి ఎంపికయ్యారు. కానీ అధికారులు అత్యుత్సాహం



చూపించి వారికి అందించాల్సిన మొదటి బహుమతిని చేవెళ్ల ఎమ్మెల్యే చేతుల మీదుగా కెజిబివి పాఠశాల విద్యార్థినిలకు, ద్వితీయ బహుమతి జడ్పీహెచ్ఎస్ నవాబుపేట పాఠశాలకు ఇవ్వడం జరిగింది. మొదటి స్థానంలో ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థినిలమైన మాకు ఇవ్వకుండా వేరే పాఠశాలకు ఇవ్వడం పై ఆవేదన వ్యక్తం చేసి కన్నీరు పెట్టుకున్నారు. కబడ్డీ ఆటలో ప్రతిభ కనబరిస్తే మా పాఠశాల పేరు కనీసం ఉపాధ్యాయులు రాసుకున్న పట్టికలో లేదని వాపోయారు. ఇదే విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా కప్ (బహుమతే) కదా ఇస్తామంటూ చెప్పుకొచ్చారు. మీ కప్ అక్కడ ఉంది తెచ్చుకోండి అని విద్యార్థినిలకు ఎంపీడీవో చెప్పినట్లు తెలుస్తుంది. అనంతరం విద్యార్థినిలు బహుమతిని అనధికారంగా తెచ్చుకున్నారు.

## విద్యార్థులకు సైన్స్‌ఫేర్ ఎంతగానో ఉపయోగం

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, డిఇఓ రేణకదేవి తో కలిసి స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిధిగా పాల్గోన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అధునిక కాలంలో సైన్స్ టెక్నాలజీ అనేవి మనుషుల జీవితలలో బాగం అయ్యాయాన్నారు. ఈ రోజు మనం ఉపయోగిస్తున్న , వాడుతున్న ప్రతి వస్తువు పరిశోదనల ద్వారా ఆవిష్కరించబడ్డాయని తెలిపారు. విద్యార్థులు వినుత్నాంగా ఆలోచనలు చేయాలని అప్పుడే మంచి గుర్తింపు వస్తుందని ఆయన అన్నారు. న్యూటన్ , ఇనిస్టీన్ ,సివిరామన్ వంటి డెపిరెంట్‌గా అలోచనలు చేసి గోప్ప శాస్త్రవేత్తలు అయ్యారని అన్నారు. కార్లు,కంప్యూటర్లు,పోన్,ఇంటర్నేట్ , విమానాలు ఇలా ఎన్నో మార్పులు వచ్చా యి. ప్రతిసంవత్సరం అడ్వాన్స్ మోడల్స్ కూడా వస్తున్నాయని ఆయన పేర్కోన్నారు. బ్లాక్ అండ్ వైట్ టీవి స్థానంలో కలర్ టీవి వాల్ పేపా ర్ టీవీ లు వస్తున్నాయని అన్నారు. గతంలో ల్యాండ్ లైన్‌ఫోన్ ఉండేది తర్వాత కీ పాడ్ ఫోన్ ఉండేది. ఇప్పుడు స్మార్ట్ ఫోన్, భావిష్యత్తులో ఇంకా ఎంతో ఆధునికం అవుతుంది అని అన్నారు. వ్యవసాయరంగంలో తక్కు నీటితో పంటలు ఎలా పండించాలి,రైతులకు దిగుబడులు వచ్చే విధంగా పరిశోధనలు చేసి రైతులకు మేలు చేయాలని అయాన కోరారు. విద్యార్థులు మంచి ఆవిష్కరణలు చేయాలని కోరుకుంటూ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గోన్న వారికీ స్పీకర్ శుభాకాంక్షలు తెలిపారు.

**విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తాం: కలెక్టర్**

వికారాబాద్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకుంటూ ఉన్నత శిఖరాలను అదిగమించాలన్నారు. వసతి గృహల్లో, పాఠశాలల్లో పిల్లలు సురక్షితంగా ఉండేందుకు మంచి వాతావరణం కల్పిండం జరుతుందని కలెక్టర్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా రూ.23కోట్ల వ్యయంతో 786 పాఠశాలల్లో కావాలసిన మౌలిక సదుపాలయాలను కల్పించడం జరిగింది అన్నారు. మిగతా 216 పాఠశాలలో పూర్తి దశకు చేరుకున్నాయని కలెక్టర్ తెలిపారు. వైజ్ఞనిక ప్రదర్శనల్లో 2వేల మంది విద్యార్థుల పాల్గోన్న ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అతిధుల చేతులమీదగా మెమొంటోలు, ప్రశంసా ప్రతాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమహరతి, కిషన్‌నాయక్ , మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి , ప్రిన్సిపల్ సాయిలత ,జిల్లా సన్స్ అధికారి విశ్వేశ్వర్ ,ఉపాధ్యాయులు ,విద్యార్థులు ,తదితరులు పాల్గోన్నారు.

## ఎంఎల్‌ఏను మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్‌పి

**ప్రజాపక్షం/తాండూరు:** వికారాబాద్‌జిల్లా అదనపు ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన హనుమంతు రావు తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డిని మర్యాద పూర్వంగా కలుసుకున్నారు. శుక్రవారం తాండూరు ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఏతో జిల్లా అదనపు ఎస్పీ హనుమంత్‌రావు బేటి అయ్యారు. ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డికి జిల్లా అధనపు ఎస్పీ హనుమంత్‌రావు పుష్ప గుచ్చాన్ని అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతలపై చర్చించారు. కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ళ బాల్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారా సింగ్, నాయకులు రావుఫ్ తదితరులు ఉన్నా రు.



## సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** క్రమం తప్పకుండా అవసరమైన వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవటం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవవచ్చని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ప్రభాత్ టౌన్‌షిప్ యూనిట్ అధ్యక్షుడు బంగారి రాజయ్య తెలిపారు. శుక్రవారం ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామంలోని సుప్రభాత్ టౌన్‌షిప్‌లో బంజారాహిల్స్ రెనోవా ఆస్పత్రి వైద్య బృందం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత వాతావరణం, కలుషిత ఆహారం వల్ల దెబ్బతింటున్న ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. జనరల్ ఫిజిషియన్, కార్డియాలజిస్టు, ఆర్థో సర్జన్, గైనిక్ విభాగ వైద్యులు ఇంతియాజ్, జవహర్, హిమాకాంత్, శైలజ, రెనోవా కార్పొరేట్ ఆస్పత్రి కార్పొరేట్ సర్వీసెస్ సీనియర్ మేనేజర్ కృష్ణకుమార్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియషన్‌కు చెందిన ఆళవందార్ వేణు, ఉమకర్, రాజయ్య, బీరయ్య, రాజా నర్సు, లక్ష్మి నారాయణ, చుక్కల నర్సయ్య, మల్లయ్య, ప్రభాకర్, బి.మల్లయ్య ప్రతాప్ సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/ధారూర్:** వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్‌మండల పరిదిలోని స్టేషన్ దారూర్‌లోని ప్రాధమిక ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో చదవుతున్న తన పిల్లలని వెళ్లమని రెడీ చేస్తున్న సందర్భంలో వారు స్కూల్‌కి వెళ్లామని అనడంతో ఎందుకని ఆరా తీయగా స్కూల్లో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పెద్ద గొల్ల కిష్టయ్య వయస్సు 58 సంవత్సరాలు అక్నాపూర్ గ్రామనికి చెందిన వ్యక్తి రోజు తాగివచ్చి పిల్లలతో అసభ్యంగా ప్రవర్తించడం , పిల్లలపై ఎక్కడపడితే అక్కడ చేతులేయడం, ఇబ్బంది పెడుతున్నారని , ఇంట్లో వాళ్లకు చెప్తే కొడుతానని బెదిరించడం జరిగిందని తెలపడంతో అదే గ్రామానికి చెందిన కొంతమంది విద్యార్థులను అదే విధంగా అసభ్యంగా వ్యవహరించి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. వెంటనే తల్లిదండ్రులు, శుక్రవారం ధారూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. నిందితునిపై పోక్సో చట్టం కింద కేసునమోదు చేశామని పోలీసులు తెలిపారు.



## విద్యార్థులకు మెరుగైన వైద్యం


### వైద్యాధికారులను ఆదేశించిన ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులోని గిరిజన సంక్షేమ బాలిక వసతి గృహంలో అస్వస్థతకు గురైన విద్యార్థులను ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి పరామర్శించారు. గత నాలుగురోజుల క్రితం తాండూరు పట్టణ పరిధి సాయిపూర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి శుక్రవారం సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిందడ్రులు, వైద్యులతో ఘటన వివరాలపై ఆరా తీశారు. అనంతరం వసతి గృహంలో కలుషిత హారంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు ప్రతిక్షాలు ప్రచారం చేయడం సమంజసం కాదని సూచించారు. అన్న సక్రమంగా ఉడకని కారణంగానే కొంత మంది విద్యార్థులకు అస్వస్థతకు గురైనట్లు అధికారులు పేర్కోన్నారని చెప్పారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్పచారం చేయడం మానుకోవాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇకమీదట వసతి గృహల్లో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రత్నమాల, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, టిడిడిఓ కమలాకర్‌రెడ్డి, వైద్యులు ఉన్నారు.

## నూతన డైట్ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించాలి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంనుండి జిల్లాలోని సంక్షేమ వసతి గృహలు, రెసిడెన్సియల్ కెజిబివి, పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై స్పెషల్ అధికారులు ,హస్టల్ వార్డెన్‌లు, ఎంపిఓలు వివిధ శాఖల అధికారులతో సమిక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో ఈనెల 14వ తేదీన వికారాబాద్ జిల్లాలోని 93 వసతి గృహల్లో నూతన డైట్ కార్యక్రమం ప్రారంభించాలని ప్రభుత్వ అదేశాలమేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు 40శాతం డైట్ చర్జీలు పెంచిందన్నారు. 16సంవత్సరాల తర్వాత పెంచిన సందర్భంగా పండుగ వతవరణంలో నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా తల్లలకు వారి పిల్లల ఆహర అలవట్లపై అవగాహన కల్పించడం, పౌష్టికాహారం శ్రద్ధ పెంచడం ప్రధాన ఉద్దేశ్యమని ఆయన పేర్కోన్నారు. అందుకే ప్రధాన ఉద్దేశ్యమని అయాన పేర్కోన్నారు. ఈ కార్యక్రమం పాఠశాలలోనే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గోనేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, డిఆర్‌డిఓ శ్రీనివాస్. హనుమంతరావు, తదితరులు పాల్గోన్నారు.

## బండ్లగూడలో అయ్యప్ప స్వాములకు అన్నదానం

**ప్రజాపక్షం/దమ్మాయిగూడ:** ప్రతి ఒక్కరూ దైవ చింతన కల్గి ఉండాలని దమ్మాయిగూడ కౌన్సిలర్ కొత్త సురేఖభాస్కర్‌గౌడ్ అన్నారు. శుక్ర వారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని బండ్లగూడలో అయ్యప్ప స్వాములకు గురుస్వామి నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాండుగౌడ్, సంతోష్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రవి, శ్రీధర్, కొత్త భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు డైట్‌చార్జీల పెంపు కార్యక్రమం

**ప్రజాపక్షం/కొందుర్గు:** సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిన సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని బిసి, ఎస్‌సి వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల తహసీల్దార్ రమేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలోని వసతి గృహాలను శుక్రవారం ముస్తాబు చేశారు. వసతి గృహాల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. తమకు డైట్ చార్జీలు పెంచడం పట్ల ఆయా వసతి గృహాల్లోని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిసి వసతి గృహా వార్డెన్ రఘురాం, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహానగరి

## సోమవారం నుంచి ఇందిరమ్మ ఇండ్ల సర్వే

**ప్రజాపక్షం/షాబాద్ :** మండలంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారిణి అపర్ణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ అపర్ణ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు పెట్టుకున్న ధరఖాస్తూ అధారంగా సర్వే నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సర్వే గురించి 9440210453ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిఒ శ్రీనివాస్, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ఉన్నారు.

## ప్రజాసమస్యలకు తక్షణ పరిష్కారం

హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** కాలనీ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్లోని శారద నగర్ ప్రధాన మార్గంలో డ్రైనేజీ మ్యాన్ హోల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులు డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని కార్పొరేటర్ దృష్టికి కాలనీ తీసుకొచ్చారని, సమస్యపై స్పందించి సంబంధిత జలమండలి శాఖ సిబ్బందితో మాట్లాడి డ్రైనేజీ సమస్యను అక్కడిక్కడే పరిష్కారం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, జలమండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కులవృత్తులు మన సాంప్రదాయాలు

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** కులవృత్తులు మన సాంప్రదాయలకు ప్రతీక అని కార్పొరేటర్ లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని ఉర్మిల నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అక్కిన్ సెల్యూన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి అవకాశాలు అలవర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నిర్వహకులు అక్రమ్, నాయకులు భూపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మోహన్‌బాబును అరెస్టు చేయాలి

జర్నలిస్టులు నిరసన




**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** జల్‌పల్లి ఫామ్ హౌజ్ వద్ద సినీ నటుడు మోహన్‌బాబు జర్నలిస్టు రంజిత్‌పై చేసిన దాడికి నిరసగా నల్లబ్యాడ్జిలు ధరించి రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మిడియా జర్నలిస్టులు ఆర్డిఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా జర్నలిస్టులు భీమయ్య, బాలసుబ్రమణ్యం, సూర్యనారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేసిన నటుడు మోహన్‌బాబును అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. గాయపడిన రంజీత్‌కుమార్‌కు ప్రభుత్వమే వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు అంజన్న, దామోదర్‌రెడ్డి, నరసింహా, బాబురావు, చరణ్, కిరణ్, ప్రేమ్, శ్రీకాంత్, బాలక్రిష్ణ, నగేష్, బుచ్చన్న, నరసింహులు, దేవేందర్, సుదర్శన్, శ్రీనివాస్, సతీష్, యాదగిరి, ప్రభాకర్, రవికుమార్, రామకృష్ణ, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**ప్రజాపక్షం/నార్సింగి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి మున్సిపాలిటీ కోకాపేట్‌లోనిర్మాణం పూర్తి చేసుకొన్న రాష్ట్ర కురుమ విద్యార్థి హాస్టల్ ట్రస్ట్ దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనాన్ని ఎమ్మెల్సీ హెగ్గే మల్లేశం, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భవనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో హాస్టల్ భవనాన్ని సభ ప్రాంగణాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి ముంగి జయపాల్ రెడ్డి నార్సింగి మున్సిపల్ చైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్ బాబు, కౌన్సిలర్లు శివారెడ్డి, అమరేందర్‌రెడ్డి, అశోక్ యాదవ్, మార్కెట్ చైర్మన్ వేణుగౌడ్, మల్లేష్ , ఎస్.నరసింహ, గండయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు మహిళల వినతి



**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** ప్రొపెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఎన్నో ఎండ్లుగా తమ బస్తీకి రాకపోకలు సాగిస్తున్న రోడ్డును మూసీ తమకు ఇబ్బంది కలిగేలా అక్రమంగా రోడ్డు నిర్మిస్తున్నారని బస్తీకి రాకపోకలు సాగించేందుకు దాడి చూపాలని ప్రేమావతి పేట్ మహిళలు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు విన్నవించారు. శుక్రవారం జైభీమ్ జైరామ్ సంఘం అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం ఆధ్వర్యంలో మహిళలు యూనివర్సిటీ అధికారుల తీరుకు నిరసగా ఎమ్మెల్యేకు సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే విసి, బస్తీ పెద్దల సమక్షంలో చర్చించి మూసిన రోడ్డును తెరిపిస్తానని ఎమ్మెల్యే మహిళలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నత్తి ధనుంజయ్, మజ్జిగ నరసింహా యాదవ్, టి.రవి ముదిరాజ్, గోల్కొండ సునంద, సరస్వతి, పెంటమ్మ, ఇందిర, శోభ, శివమణి, సులోచన, హేమలత, గాయత్రి, లావణ్య, లలిత, మంజుల, మహేశ్వరి, అనసూజ, అమృత, లక్ష్మమ్మ, దేవమ్మ పాల్గొన్నారు.

# సిఆర్‌ఎంపి మార్గాల్లో రోడ్ల క్లీనింగ్‌కు టెండర్లు

### రోడ్ల శుభ్రత పనులు ప్రైవేటీకరణకు గ్రీన్ సిగ్నల్

### స్వీపింగ్ మిషన్లతో శుభ్రం కాని రోడ్లు

### అయినా వాటికే మొగ్గు ఎందుకో?



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ (జిహెచ్‌ఎంసి) చేపట్టాల్సిన పనులను దశలవారిగా ప్రైవేట్‌కు దారదత్తం చేస్తోంది. ఇప్పటికే సమగ్ర చెత్త నిర్వహణను రాంకీ ఎన్వీరోకు అప్పగించింది. సమగ్ర రోడ్ల నిర్వహణ ప్రాజెక్టు(సిఆర్‌ఎంపి) ద్వారా ఇప్పటికే నిర్మాణం నిర్వహణను ప్రైవేట్‌కు అపంగించారు. తాజాగా సిఆర్‌ఎంపి రోడ్లలో సిఆర్‌ఎంపి కింద ప్రైవేట్ ఏజెన్సీల నిర్వహణలో ఉన్న ప్రధాన రహదారులను శుభ్ర పరిచేందుకు స్వీపింగ్ మెషిన్ల వాహనాలను అద్దెకు తీసుకునేందుకు జిహెచ్‌ఎంసి సిద్ధమైంది. అందుకుగాను టెండర్లు ఆహ్వానించే ప్రక్రియనూ ప్రారంభించింది. నిర్వహణ పనులు చేస్తున్న ప్రైవేట్ ఏజెన్సీల గడువు ముగుస్తుండటంతో స్వీపింగ్ కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిసింది. ఏజెన్సీల గడువు ముగిస్తే, తిరిగి ప్రైవేట్ ఏజెన్సీలకే నిర్వహణకు ఇవ్వాలి. లేదా జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. కానీ, అలా కాకుండా రోడ్ల నిర్వహణకు మాత్రం టెండర్లు పిలవకుండా కేవలం స్వీపింగ్ మెషిన్ల కోసమే టెండర్లు పిలుస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

**మెషిన్లతో శుభ్రం కాని రోడ్లు, కోట్ల నిధులు రోడ్ల పాలు...**నగరంలో పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా వినియోగిస్తున్న స్వీపింగ్ మెషిన్ల వాహనాలు చూసేందుకు తప్ప వాటివల్ల రోడ్లు శుభ్రం కావడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికే ప్రైవేట్ ఏజెన్సీల స్వీపింగ్ మెషిన్ల వాహనాల అద్దెలకు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా రోడ్లు మాత్రం చెత్తమయంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో స్వీపింగ్ మెషిన్ల వాహనాలకు జిపిఎస్‌లో కాక అవి తిరిగే ప్రాంతాలు, రోడ్లను ఊడ్చే దృశ్యాలు, చేసే పనులు కనిపించేలా కెమెరాలు కూడా అమర్చాలని కమిషనర్ భావించారు. పారిశుధ్య విభాగం పర్యవేక్షిస్తున్న స్వీపింగ్ మెషిన్లకు సంబంధించి కమిషనర్ ఆలోచన అలా ఉండగా, తాజాగా సిఆర్‌ఎంపి మార్గాల్లో కేవలం స్వీపింగ్ మెషిన్ల కోసమే టెండర్లు పిలుస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. స్వీపింగ్ మెషిన్ల పేరిట జరుగుతున్నది. నిధుల దుబారే అనే విషయం ఇప్పటికే పలు పర్యాయాలు వెల్లడైంది. తిరిగి స్వీపింగ్ మెషిన్ల కోసం మాత్రమే టెండర్లు పిలవడం వెనుక ఆంతర్యం ఏమిటో సంబంధిత అధికారులకే తెలియాలి.

**కూకట్‌పల్లి జోన్‌కు రూ.1.57 కోట్లు...** దాదాపు ఐదేళ్ల క్రితం సిఆర్‌ఎంపి ద్వారా దాదాపు 811 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారుల నిర్వహణ పనులను జోన్ల వారీగా, ప్యాకేజీలుగా ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. ఒప్పందం మేరకు వాటి గడువు 2025 జనవరికి ముగిసిపోనుంది. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి జోన్ పరిధిలోని దాదాపు 87 కిలోమీటర్ల రోడ్ల స్వీపింగ్‌కుగాను 2025 జూన్ వరకు రూ. 1.57 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు ఆహ్వానించారు. అలాగే శేరిలింగంపల్లి జోన్‌కు సైతం టెండర్లు పిలించినట్లు తెలిసింది. ఒకవేళ నిర్వహణను తిరిగి ప్రైవేట్ ఏజెన్సీల కివ్వాలి అనుకుంటే మొత్తం నిర్వహణకు టెండర్లు పిలవాలి. కానీ అలా కాకుండా కేవలం స్వీపింగ్ కోసమే టెండర్లు పిలవడం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అన్ని జోన్లలోనూ సిఆర్‌ఎంపి మార్గాల్లో స్వీపింగ్‌కు మెషిన్లను అద్దెకు తీసుకోవాల్సిందిగా కమిషనరే ఆదేశించినట్లు అధికారులు అంటున్నారు. మిగతా జోన్లకూ టెండర్లు పిలవనున్నట్లు తెలుస్తోంది.

**అప్పుడే పని చేయలేదు...** వాస్తవానికి గడచిన ఐదేళ్లలోనూ రోడ్ల నిర్వహణతోపాటు స్వీపింగ్, ఫుట్‌పాత్‌లు, గ్రీనరీ, లైటింగ్ వంటి పనులు కూడా కాంట్రాక్టు పొందిన ఏజెన్సీలే చేయాల్సి ఉండగా, రోడ్ల నిర్వహణ తప్ప అవి ఇతర పనులు చేయలేదు. స్వీపింగ్ చేశాయో లేదో ఏజెన్సీలకు, సంబంధిత అధికారులకే తెలియాలి. ఈ నేపథ్యంలో తిరిగి ప్రత్యేకంగా స్వీపింగ్ కోసమే టెండర్లు పిలుస్తుండటం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సిఆర్‌ఎంపి మార్గాల్లో 811 కి.మీల మేర రోడ్లుండగా, జోన్ల వారీగా వివరాలిలా ఉన్నాయి.

| జోన్ | రోడ్లు(కి.మీ.) |
|---|---|
| ఎల్.బి.నగర్ | 155 |
| చార్మినార్ | 132 |
| ఖైరతాబాద్ | 187 |
| శేరిలింగంపల్లి | 110 |
| కూకట్‌పల్లి | 87 |
| సికింద్రాబాద్ | 140 |

## అధికారుల నిర్లక్ష్యంతో తెలంగాణ శకటానికి దక్కని చోటు

శకటాల రూపకర్త డా.రంగసాయి భట్ విమర్శ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఐఎఎస్ హరీశ్, సంబంధిత అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా ఈసారి ఢిల్లీలో జరిగే జనవరి 26 రిపబ్లిక్ డే ఉత్సవాల్లో తెలంగాణ శకటం ప్రదర్శనకు నోచుకోవడం లేదని, ఇది తనను ఎంతో బాధకు గురిచేసిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్, శకటాల రూపకర్త డాక్టర్ రంగసాయి భట్ తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డిని అధికారులు తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ జంపాల రాజేశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను 14 ఏండ్లుగా శకటాల రూపకల్పనలో నిమగ్నమై పనిచేస్తున్నాన్నారు. ఈసారి తెలంగాణ తరపున కాటన్ మార్కెట్ (ఆదిలాబాద్), కల్చరల్, హెరిటేజ్, వజ్ర ఖనిజం (మహబూబ్‌నగర్), గోండు గిరిజనుల నాగోబా జాతర(ఆదిలాబాద్), చిందు భాగవతులు, రామప్ప ఆలయం (వరంగల్), బుద్ధవనం వంటి నమూనా శకటాలను రూపకల్పన చేసి ఢిల్లీలోని డిఫెన్స్ కార్యదర్శికి పంపించామని తెలిపారు. రామప్ప ఆలయ శకటాన్ని డిఫెన్స్ కార్యదర్శి ఎంపిక చేసి, తిరిగి రాష్ట్ర సమాచార శాఖ ఆఫీస్‌కు పంపిస్తే, మన కమిషనర్, అధికారులు స్పందించలేదని, తీవ్ర నిర్లక్ష్యం చూపారని పేర్కొన్నారు. మరోసారి ఇలా జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఓ కమిటీ వేసి, ప్రతిసారి శకటాల ప్రదర్శన జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నాట్యకళా పారిజాతం సురేంద్రనాథ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కళల పూదోటలో పరిమళించిన నాట్యకళా పారిజాతం మురమళ్ల సురేంద్రనాథ్ ఉత్తమ నాట్యాచార్యుడు నాట్య కళాకారునిగా గుర్తింపు పొందారు. ఎపిలోని కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన తండ్రి మురమళ్ళ విజయకుమార్ దగ్గర సురేంద్రనాథ్ మృదంగం అభ్యసించారు. సుప్రసిద్ధ నాట్యాచార్యులు భాగవతుల వేంకట రామ శర్మ, సింగారమణి చిముడూరి అజయకుమార్‌ల వద్ద కూచిపూడి నేర్చుకుంటూ భరతనాట్యాన్ని కూడా అభ్యసించారు. దూరదర్శన్ ఏ గ్రేడ్ నాట్య కళాకారుడిగా గుర్తింపు పొందారు. సురేంద్రనాథ్ ఢిల్లీలో కేంద్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్ చేతుల మీదుగా ఈ ఏడాది నవంబర్ 22న ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం 2023 అందుకున్నారు. సురేంద్రనాథ్ భార్య బిజిన కూడా నాట్యాకారిణి. కూచిపూడి, భరతనాట్య ఉత్కృష్టతలను భవిష్యత్ తరానికి అందించడమే ధ్యేయంగా తమ నాట్య ప్రస్తానాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు.

## ప్రణాళికాబద్ధంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రణాళికబద్ధంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు వార్డుల వారీగా గ్రామాల్లో పర్యటించి లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. అర్హులైన లబ్దిదారుల ఎంపిక విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు ఇందిరమ్మ సర్వే నిర్వహిస్తున్న ఇందిరమ్మ కమిటీ, గ్రామ పెద్దల సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, పురుషోత్తంరెడ్డి ఉన్నారు.

## గ్రూప్–2కు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ఈనెల 15,16 తేదీల్లో జరిగే గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలీస్ నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్–2 పరీక్ష నిర్వహణపై కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 15న రెండు పేపర్లు ఉంటాయని, ఉదయం 10 గంటల నుండి 12:30 గంటల వరకు మొదటి పేపర్ ఉంటుందని మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో పేపర్ నిర్వహించడం జరుగుతుందని,రెండోవ రోజు 16న రెండు పేపర్లు ఉంటాయని,ఉదయం 10 గంటల నుండి 12:30 గంటల వరకు మొదటి పేపర్ ఉంటుందని మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో పేపర్ నిర్వహించడం జరుగుతుందని మొత్తంగా రెండూ రోజుల పాటు నాలుగు పేపర్లు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులను పరీక్షకు ఉదయం 8.30 గంటల నుండి 9:30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లో అనుమతిస్తారని,9.30 గంటల తర్వాత గేట్లు మూసివేయబడుతాయని, ఆలస్యంగా వస్తే అభ్యర్థులను అనుమతించరని తెలిపారు. పోలీస్ నోడల్ అధికారులు,చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. జిల్లాలో 90పరీక్షా కేంద్రాల్లో 56,883 మంది అభ్యర్థులు రాస్తున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాలని, మొబైల్ ఫోన్స్ ఎలక్ట్రానిక్స్ వస్తువులతో రాకూడదన్నారు. పరీక్షలు జరుగు కేంద్రాల వద్ద 144,సెక్షన్ విధించి,రక్షణ చర్యలు తీసుకుని ఆ ప్రాంతంలో జీరాక్స్ సెంటర్లను మూసివేయడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యుత్ సదుపాయం సరి చూసుకోవాలని, టాయిలెట్స్, తాగునీరు, అన్నిమౌలిక వసతులు కల్పించాలని సంబంధిత సెంటర్ నిర్వాహకులకు సూచించారు. విద్యుత్ అంతరాయం రాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించాలని, పోలీస్ నోడల్ అధికారులకు జిల్లా ఆదేశించారు.

## సిసి కెమెరాల ఏర్పాటు అభినందనీయం

షాద్‌నగర్ పట్టణ సిఐ విజయ్‌కుమార్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** దేవాలయాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పట్టణ సిఐ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలోని హనుమాన్ దేవాలయంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చేగురి రాజేందర్‌రెడ్డి ఆర్థిక సహకారంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. దాత రాజేందర్‌రెడ్డిని సిఐ విజయ్‌కుమార్ శాలువాలతో సన్మానించి ప్రత్యేకంగా అభినంధించారు. ఈ సందర్భంగా సిఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దేవాలయాల్లో విధిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలందరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నేతలు అర్జున్ లక్ష్మణ్, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి శంకర్‌రెడ్డి సేవలు మరువలేనివి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** ప్రజా సమస్యలపై నిరతరం పోరాటం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి ముత్యాల శంకర్‌రెడ్డి అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి అన్నారు. శుక్రవారం అబ్దులాపూర్‌మెట్ మండలం కూంట్లూర్ రావినారాయణరెడ్డి నగర్ కాలనీలో ముత్యాల శంకర్‌రెడ్డి 7వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. శంకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అందోజు రవీంద్రాచారి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శంకర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు హరిసింగ్ నాయక్, చిర శేఖర్, నర్సింహ్మా, పుల్లయ్య, నిరంజన్, మధు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

సిపిఐ వంద సంవత్సరాల అవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపు



**ప్రజాపక్షం/షాబాద్ :** ప్రజా సమస్యలపై సిపిఐ పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో సిపిఐ 100 సంవత్సరాల అవిర్భావ దినోత్సవం సందరగా మండల పార్టీ కార్యదర్శి నక్కల జంగయ్య పార్టీ నాయకులతో కలిసి సిపిఐ జెండా అవిష్కరించారు. అనంతరం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించి పార్టీ కార్యకర్తలకు సిపిఐ సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డు అందజేశారు. ఈ సందర్భంగా పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ దోపిడి దొంగల అరాచకాలకు వ్యతిరేకంగా 1925 డిసెంబర్ 26న భారతదేశంలోని కాన్పూర్ నగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ అవిర్భవించిదని తెలిపారు. అనాటి నుండి ఇప్పటి వరకు నిరంతరం నిరు పేద ప్రజల పక్షాన న్యాయ పోరాటం చేస్తుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హమీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారంలో ప్రజలకు సిపిఐ అండగా నిలిచి న్యాయం జరిగే వరకు పార్టీ నాయకులు కృషి చేస్తారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హమీలు అమలు చేయకపోతే నూతన సంవత్సరం నుండి ప్రజల పక్షాన న్యాయ పోరాటంకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు మధు, నారాయణ, రాములు, నర్సయ్య, శ్రీనివాస్, రుక్కయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# ఆర్‌సిబి బ్యాటర్ విధ్వంసం..!



## ఛాంపియన్స్ ట్రోఫీకి గ్రీన్ సిగ్నల్..

### దుబాయ్ వేదికగా భారత్ X పాక్ మ్యాచ్!

హైబ్రిడ్ మోడల్‌లో ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. భారత్ మ్యాచ్‌లను దుబాయ్ వేదికగా నిర్వహించేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పిసిబి) అంగీకరించినట్లు సమాచారం. మరికొద్ది రోజుల్లో ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఐసిసి అధికారికంగా ప్రకటించనుంది. వాస్తవానికి ఈ షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించాల్సి ఉంది. కానీ భారత్, పాకిస్థాన్ క్రికెట్ బోర్డుల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా ఐసిసి వాయిదా వేసింది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తమ జట్టును పాకిస్థాన్‌కు పంపించలేమని, తమ మ్యాచ్‌లను తటస్థ వేదికగా నిర్వహించాలని బిసిసిఐ.. ఐసిసిని కోరింది. తమ ఆటగాళ్ల భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేసింది. మరోవైపు హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ నిర్వహించేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పిసిబి) అంగీకరించలేదు. దాంతో ఈ టోర్నీ నిర్వహణ ఐసీసీకి సవాల్‌గా మారింది. సుదీర్ఘ చర్చలు, సమావేశాల అనంతరం ఐసీసీ తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. హైబ్రిడ్ మోడల్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించాలని, లేదంటే వేదికను మారుస్తామని పిసిబి హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. ఇక పిసిబి కూడా భారత్ వేదికగా జరిగే తమ మ్యాచ్‌లను తటస్థ వేదికల్లో నిర్వహించాలని డిమాండ చేసింది. ఇందుకు బిసిసిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. తాజాగా జరిగిన సమావేశంలో హైబ్రిడ్ మోడల్‌కు ఇరు జట్లు అంగీకరించినట్లు వార్తలు వస్తున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. భారత్ వేదికగా జరిగే టీ20 ప్రపంచకప్ 2026లో పాకిస్థాన్ మ్యాచ్‌లు శ్రీలంక వేదికగా నిర్వహించేందుకు బీసీసీఐ అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ టోర్నీలో భాగంగా జరిగే భారత్‌పాక్ మ్యాచ్ కొలంబో వేదికగా జరగనున్నట్లు వార్తలు వస్తున్నాయి. హైబ్రిడ్ మోడల్‌ను అంగీకరించినందుకు పిసిబికి ఐసిసి మంచి ఆఫర్ కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. 2027 తర్వాత జరిగే మహిళల ఐసీసీ టోర్నీ ఆతిథ్య హక్కులు కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది.

### ఫైనల్ చేరిన మధ్యప్రదేశ్!



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి) బ్యాటర్ రజత్ పటీదార్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. దేశవాళీ ప్రతిష్టాత్మక టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్‌కు సారథ్యం వహిస్తున్న రజత్ పటీదార్..ఢిల్లీతో జరిగిన రెండో సెమీఫైనల్లో అజేయ హాఫ్ సెంచరీ బాదాడు. 29 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో 66 పరుగులు చేశాడు. దాంతో ఈ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 146 పరుగులు చేసింది. అనూజ్ రావత్(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 33), ప్రియాన్ష్ ఆర్య(21 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 29) టాప్ స్కోరర్లుగా నిలిచారు. మధ్యప్రదేశ్ బౌలర్లలో వెంకటేశ్ అయ్యర్(2/12) రెండు వికెట్లు తీయగా.. కుమార్ కార్తీకేయ, ఆవేశ్ ఖాన్, త్రిపురేష్ సింగ్ తలో వికెట్ తీసారు. అనంతరం మధ్యప్రదేశ్.. రజత్ పటీదార్ విధ్వంసంతో 15.4 ఓవర్లలోనే 3 వికెట్లకు 152 పరుగులు చేసింది. రజత్ పటీదార్‌తో పాటు హర్‌ప్రీత్ సింగ్(38 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 46 నాటౌట్) రాణించాడు. ఢిల్లీ బౌలర్లలో ఇషాంత్ శర్మ 2 వికెట్లు తీయగా.. హిమాన్షు చౌహాన్ ఓ వికెట్ పడగొట్టాడు. ఆదివారం జరిగే ఫైనల్లో మధ్యప్రదేశ్.. ముంబైతో తలపడనుంది. ఈ టోర్నీలో రజత్ పటీదార్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. మధ్యప్రదేశ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా.. అత్యధిక సిక్స్‌లు, బౌండరీలు బాదిన ప్లేయర్‌గానూ నిలిచాడు. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు రజత్ పటీదార్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగడంపై ఆ జట్టు ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్పిన్నర్లపై రజత్ పటీదార్ చెలాయిస్తున్న ఆధిపత్యంపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఆర్‌సీబీ కూడా రజత్ పటీదార్‌ను కొనియాడుతూ ట్వీట్ చేసింది.

## రోహిత్ శర్మనే ఓపెనర్‌గా ఆడించాలి: రవి శాస్త్రి



ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగే మూడో టెస్టులో టీమిండియా ఓపెనర్‌గా రోహిత్ శర్మనే ఆడించాలని మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రి అన్నాడు. రోహిత్ శర్మకు మిడిలార్డర్‌లో కంటే ఓపెనర్‌గానే మెరుగైన రికార్డ్ ఉందని చెప్పాడు.వ్యక్తిగత కారణాలతో రోహిత్ శర్మ తొలి టెస్టుకు దూరం కాగా.. కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. యశస్వి జైస్వాల్‌తో కలిసి అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. దాంతో అడిలైడ్ వేదికగా జరిగిన రెండో టెస్టుతో రోహిత్ శర్మ రీఎంట్రీ ఇచ్చినా.. కేఎల్ రాహుల్‌నే ఓపెనర్‌గా కొనసాగించారు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేసిన రోహిత్ శర్మ దారుణంగా విఫలమయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. మరోవైపు రాహుల్ కూడా ఆశించిన స్థాయిలో రాణించలేదు. శనివారం నుంచి గబ్బా వేదికగా మూడో టెస్ట్ ప్రారంభం కానుండగా.. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మను ఓపెనర్‌గా ఆడించాలని రవి శాస్త్రి సూచించాడు. 'గత 8, 9 ఏళ్లుగా రోహిత్ శర్మ ఓపెనర్‌గా అద్భుత ప్రదర్శన కనబర్చాడు. ఓపెనర్‌గానే రోహిత్ రాణించగలడు. అదే అతనికి సరైన ప్లేస్. అటాకింగ్ గేమ్‌తో జట్టుకు కావాల్సిన శుభారంభాన్ని అందిస్తాడు.'అని రవి శాస్త్రి చెప్పుకొచ్చాడు. రవి శాస్త్రి హెడ్ కోచ్‌గా ఉన్నప్పుడే టెస్టుల్లో రోహిత్ శర్మ ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకున్నాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన తర్వాత రోహిత్ టెస్టుల్లో అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. ఓపెనర్‌గా 2019–24 మధ్య 64 టెస్ట్ ఇన్నింగ్స్‌లు ఆడిన రోహిత్ 2659 పరుగులు చేశాడు. ఇందులో 9 శతకాలతో పాటు 8 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోర్ 212. మిడిలార్డర్‌లో 47 టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో 1585 పరుగులు చేశాడు.ఈ గణంకాల నేపథ్యంలోనే రవి శాస్త్రి.. రోహిత్ శర్మను ఓపెనర్‌గా ఆడించాలని సూచించాడు.

# రీల్

## 'సంక్రాంతికి వస్తున్నాం' నుండి సెకండ్ సాంగ్ ప్రోమో

మన టాలీవుడ్ అందరి మోస్ట్ ఫేవరేట్ హీరో వెంకీ మామ హీరోగా ఇపుడు నటిస్తున్న అవైటెడ్ చిత్రం సంక్రాంతికి వస్తున్నాం కోసం అందరికీ తెలిసిందే. దర్శకుడు అనీల్ రావిపూడితో వరుస హిట్స్ తర్వాత చేస్తున్న మరో చిత్రం ఇది కాగా దీనిపై కూడా మంచి బజ్ ఉంది. అయితే ఈ చిత్రం నుంచి ఆల్రెడీ వచ్చిన ఫస్ట్ సింగిల్ సూపర్ హిట్ కాగా నేడు వెంకీ మామ బర్త్ డే కానుకగా మేకర్స్ రెండో సాంగ్ 'మీను' ప్రోమో రిలీజ్ చేశారు. మరి ఈ ప్రోమోలో ట్యూన్ అండ్ విజువల్స్ మాత్రం సూపర్బ్ గా ఉన్నాయని చెప్పాలి. ఇద్దరు హీరోయిన్స్ మీనాక్షి చౌదరి అలాగే ఐశ్వర్య రాజేష్ పై కనిపిస్తున్న ఈ సాంగ్ లో వెంకీ మామ తన గతంలో తన ప్రేయసి కోసం వర్ణిస్తున్నాడు. అలాగే ఇందులో తన పోలీస్ గెటప్ కూడా అదిరిపోయింది అని చెప్పాలి. మరి ఈ సాంగ్ ని భీమ్స్ మంచి స్మూత్ మెలోడీగా కనిపిస్తుంది. ఇక ఈ ఫుల్ సాంగ్ ని అతి త్వరలోనే రిలీజ్ చేస్తామని చెబుతున్నారు. ఇక ఈ చిత్రానికి దిల్ రాజు నిర్మాణం వహిస్తుండగా సంక్రాంతి కానుకగా రానున్న జనవరి 14న సినిమా రిలీజ్ కి రాబోతుంది.






## ఓటిటిలో కి వచ్చేసిన 'మెకానిక్ రాకీ'

మన టాలీవుడ్ యంగ్ హీరో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా మీనాక్షి చౌదరి అలాగే శ్రద్ధా శ్రీనాథ్ మరో హీరోయిన్ గా దర్శకుడు రవితేజ ముళ్ళపూడి తెరకెక్కించిన సాలిడ ఎంటర్టైనర్ చిత్రం మెకానిక్ రాకీ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా టాక్ బాగున్నప్పటికీ బాక్సాఫీస్ పరంగా అనుకున్న రేంజ్ హిట్ అయితే కాలేదు. దీనితో ఈ సినిమా వసూళ్ల పరంగా వీక్ పెర్ఫామెన్స్ నే అందుకుంది. మరి థియేటర్స్ రన్ తర్వాత ఇపుడు ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ కి వచ్చేసింది. ఈ చిత్రం ఓటీటీ హక్కులు ప్రముఖ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో వారి నుంచి ఈ చిత్రం అందుబాటులోకి వచ్చేసింది. వీక్ గా ఉన్న ఫస్టాఫ్ పక్కన పెడితే సెకండాఫ్ మంచి ఎంటర్టైన్మెంట్ ని అందిస్తుంది. మరి ఈ సినిమా చూడాలి అనుకుంటే అమెజాన్ ప్రైమ్ వీడియోలో ట్రై చేయొచ్చు. ఇక ఈ చిత్రానికి జేక్స్ బిజాయ్ సంగీతం అందించాడు. అలాగే ఎస్ ఆర్ టి ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహించారు.





## 'గేమ్ ఛేంజర్' ఈవెంట్‌కు సుకుమార్

ప్రస్తుతం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు శంకర్ తో చేస్తున్న అవైటెడ్ చిత్రం గేమ్ ఛేంజర్ కోసం అందరికీ తెలిసిందే. మరి ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం కోసం మెగా ఫ్యాన్స్ ఎప్పుడు నుంచో ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఈ చిత్రం నుంచి ఇపుడు మేకర్స్ సాలిడ్ ప్రమోషన్స్ ని స్టార్ట్ చేస్తున్నారు. అలా ఆల్రెడీ మొట్ట మొదటిసారిగా యూఎస్ మార్కెట్ లో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ని కూడా అనౌన్స్ చేశారు. అయితే ఈ ఈవెంట్ కి లేటెస్ట్ గా పుష్ప 2 తో సంచలనం సెట్ చేసిన దర్శకుడు సుకుమార్ గెస్ట్ గా హాజరు కాబోతున్నారని లేటెస్ట్ బజ్ ఒకటి వచ్చింది. మరి దీనిని నిజం చేస్తూ మేకర్స్ ఇపుడు అధికారిక ప్రకటన అయితే ఇచ్చేసారు. ఈ డిసెంబర్ 21న జరగనున్న గ్రాండ ప్రీ రిలీజ్ ఈవెంట్ కి సుకుమార్ వస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేసేసారు. మరి ఈ ఈవెంట్ లో సుకుమార్ ఎలాంటి విషయాలు పంచుకుంటారో చూడాలి. ఇక వీరి కాంబినేషన్ లో ఓ సినిమా ఆల్రెడీ అనౌన్స్ అయ్యిన సంగతి తెలిసిందే.

# జూ పార్కులు.. అర్బన ఫారెస్ట్ పార్కులలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

### అటవీశాఖను ఆదేశించిన మంతి కొండా సురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కులను మెరుగైర సౌకర్యాలతో తీర్చిదిద్ది, పర్యావరణహిత కార్యక్ర మాలతో సందర్శకులను ఆకట్టుకునేలా కార్యాచరణను అమలుచేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా కొండా సురేఖ అటవీశాఖను ఆదేశించారు.శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని కొండా సురేఖ ఆధ్వర్యంలో జూస్ అండ్ పార్క్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ (జపాక్) 13వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అటవీ అధికారులతో కలిసి యానిమల్ అడాప్షన్ స్కీమ్ బ్రోచర్, డైరీ, కాఫీ టేబుల్ బుక్ ను మంత్రి సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, సందర్శకుల అభిరుచుల మేరకు, పర్యావరణానికి ఏమాత్రం ఇబ్బంది కలగకుండా, అటవీశాఖకు ఆదాయం సమకూరే విధంగా పకడ్బందీ ప్రణాళికలతో జపాక్ పనిచేయాలని కొండా సురేఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రపంచవ్యాప్తంగా జూ పార్కుల్లో అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, ఉత్తమ విధానాలను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తొమ్మిది జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను అధికారులకు మంత్రి సురేఖకు వివరించారు. రాష్ట్రంలోని నెహ్రూ జూ పార్క్, కాకతీయ జూ పార్క్, పిల్లలమర్రి మినీ జూపార్క్, లోయర్ మానేరు డీర్ పార్క్, కిన్నెరసాని డీర్ పార్క్ జంతు సంరక్షణ చర్యలు, కేబీఆర్, మృగవని, మహావీర్ హరిణ వనస్థలి, ఇతర అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో సందర్శకుల సంఖ్య పెరిగే విధంగా అమలుచేయాల్సిన అదనపు సౌకర్యాలు పై సురేఖ అధికారులకు పలు సూచనలు చేశారు. జంతువుల దత్తత పై అనుసరిస్తున్న విధివిధానాల పై మంత్రి సురేఖ ఆరా తీశారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పన నిమిత్తం ఆన్లైన్ లో టికెట్ బుకింగ్, ఇంటిగ్రేటెడ్ ఫాస్ట్ ట్రాక్ పార్కింగ్ వంటి ఎన్నో సదుపాయాలను కల్పిస్తున్నట్లు జూ పారక్స్ డైరక్టర్ సునీల్ ఎస్. హేరామత్ మంత్రి సురేఖకు వివరించారు. వరంగల్ కాకతీయ జూ పార్కు మధ్య గుండా పోతున్న వరదనీటి డ్రైనేజీ కారణంగా దుర్వాసన వస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, డ్రైనేజీని జూ పార్కు బయటకు మళ్ళించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కాకతీయ జూ పార్కుకు రెండు వైట్ టైగర్ లు, సింహాన్ని తెప్పించే దిశగా సెంట్రల్ జూ అథారిటీని సంప్రదించాలని మంత్రి చీఫ్ వైల్ లైఫ్ వార్డెన్ ఏలుసింగ్ ను ఆదేశించారు. కోతుల బెడద నివారణకు సంబంధిత అన్ని శాఖలతో కోఆర్డినేషన్ కమిటి మీటింగ్ నిర్వహించి, కోతుల సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం కనుగొనేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్ (హెచ్ఓఎఫ్ఎఫ్), చీఫ్ వైల్ లైఫ్ వార్డెన్ ఏలుసింగ్ మేరు, సిసిఎఫ్ లు ప్రియాంక వర్గీస్, భీమా నాయక్, రామలింగం, డైరక్టర్ జూ పారక్స్ సునీల్ ఎస్. హేరామత్, పశుసంవర్ధకశాఖ జెడి కృష్ణమూర్తి,పలువురు డిఎఫ్ఓలు తదితరులు పాల్గొన్నారు.




## కులాల పేరు మార్పుపై ప్రతిపాదనలు స్వీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : కులాల పేరు మార్పుపై వచ్చిన ప్రతిపా దనలను, అభిప్రాయాలను బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ స్వీకరిం చారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ విచారణకు పలు కులాల ప్రతిని ధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిసి కమిషన్ కులాల ప్రతిని ధుల ప్రతిపాదనలను, అభిప్రాయాలను రికార్డు చేసింది. ఇందులో భా గంగా బుడబుక్కల, మేర, కుమ్మరి, రజక కుల సంఘాల ప్రతినిధులు హాజరై తమ కులాల స్థితిగతుల గురించి వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో బుడబుక్కల కులం వారు తమ కులం పేరును ఆరె క్షత్రియ జోషి లేదా శివ క్షత్రియగా మార్చవలసిందిగా విజ్ఞప్తి చేశారు. మేర కులం వారు చిప్పోలు (మేర)గా ఉన్నదాన్ని మేర (చిప్పోలు)గా మార్చాలని, కుమ్మరి కులం వారు ప్రజాపతి పదాన్ని పర్యాయ పదంగా చేర్చాలని, రజక కులం వారు దోబి పదాన్ని పర్యాయ పదంగా చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ యు.శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ జి.సతీష్ కుమార్, రిసెర్చ్ ఆఫీసర్ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అవిశ్వాసంపై రాజ్యసభలో రగడ

(మొదటి పేజీ తరువాయి)

సమయం కేటాయించండి, నా ప్రార్థనను అంగీకరించండి, నా ఛాంబర్‌లో నన్ను కలవండి. నేను సభా నాయకుడికి కూడా అదే అభ్యర్థన చేస్తున్నాను... మేము పని చేయగలిగిన విధంగా విషయాలను నావిగేట్ చేయడానికి ప్రయత్నిస్తాను' అని ఖర్గేకు విజ్ఞప్తి చేశారు. దీనికి ఖర్గే స్పందిస్తూ 'నేను మిమ్మల్ని గౌరవిస్తాను. కానీ మీరు నన్ను అవమానిస్తున్నారు' అని ఖర్గే ఆవేశంతో బదులిచ్చారు. అయితే ఖర్గే మాట్లాడుతుండగా సభాపతి సభను సోమవారానికి వాయిదా వేశారు. బిజెపికి చెందిన రాధా మోహన్ దాస్ అగర్వాల్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తడంతో పాటు, రాజ్యసభ ఎక్స్ అఫీషియో చైర్మన్‌గా ఉన్న ఉపరాష్ట్రపతిపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన విధానాన్ని వివరించిన తర్వాత గందరగోళం ఏర్పడింది. ప్రతిపక్ష పార్టీలు ఇచ్చిన అభిశంసన నోటీసుపై అగర్వాల్ సుదీర్ఘంగా మాట్లాడారు, ఇది దేశాన్ని, ఉపరాష్ట్రపతి కుర్చీని, రైతులను అవమానించిందని అన్నారు. నిబంధనల ప్రకారం నోటీసును 14 రోజుల తర్వాత తీసుకోవలసి ఉందని, అయితే కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతులను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని ఆరోపించారు. రాజ్యాంగంపై కాంగ్రెస్‌కు విశ్వాసం లేదన్నారు. అవిశ్వాస తీర్మానంపై సంతకం చేసిన 60 మంది విపక్ష ఎంపిలు ప్రత్యేకాధికారాల ఉల్లంఘనకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కాగా, గందరగోళం మధ్య, ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపిలు తమ అభిప్రాయాన్ని చెప్పడానికి ప్రయత్నించారు. ఎట్టకేలకు ప్రమోద్ తివారీ (కాంగ్రెస్)ని మాట్లాడేందుకు ధన్‌ఖడ్ అనుమతించారు. చైర్మన్ రైతు కుమారుడైతే, ప్రతిపక్ష నేత ఖర్గే రైతు కూలీ కొడుకు అని దళితుడిని మాట్లాడనివ్వడం లేదని తివారీ మండిపడ్డారు. యుఎస్‌లో లంచం ఆరోపణలను ఎదుర్కొంటున్న బిలియనీర్‌ను రక్షించడానికి పాలక పక్షం ప్రయత్నిస్తోందని అతను సూచించిన విధంగానే, ధన్‌ఖర్ ఏదీ రికార్డు ఉంచడం లేదన్నారు. దీంతో ధన్‌ఖడ్ జోక్యం చేసుకుంటూ తాను రైతు కుమారుడిని, నేతాను బలహీనంగా ఉండనన్నారు. వారు తీసుకువచ్చిన తీర్మానంపై చర్చ జరగడానికి ప్రతిపక్ష పార్టీలు 14 రోజులు వేచి ఉండవలసి ఉంటుంది. 14 రోజుల తర్వాత వస్తుంది అని అన్నారు. దీంతో తమ వాదనను వినిపించేందుకు ప్రతిపక్ష నేతలు గళం విప్పడంతో అధికార సభ్యులు ఎదురుదాడికి దిగారు.

## కొనసాగించండి

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దులో 17రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్న దల్లేవాల్‌ను కేంద్రం, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు వెంటనే కలవాలని న్యాయమూర్తులు సూర్య కంత్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది.'రైతులు హింసాత్మక ధోరణిలో ఉండకూడదు. శాంతియుత పద్ధతిలో ఆందోళన చేయాలి. వారి మనోవేదనలను పరిశీలిస్తున్నందున రైతులు గాంధేయ నిరసనల విధానాన్ని అవలంభించాలి' అని రెండు ప్రదేశాలలో హింసాత్మక ఆందోళనలు సమస్యలను సృష్టించాయని తెలియజేసిన అనంతరం ద్విసభ్యధర్మాసనం రైతులకు ఈ హితబోధ చేసింది. రైతు నాయకుడు దల్లేవాల్ నిరవధిక నిరాహారదీక్షను విరమింపజేసేలా ఒప్పించేందుకు అతడి ప్రాణం అమూల్యమైనదనే విషయాన్ని ఆయనకు తెలియజేయాలని, తక్షణమే వైద్యసహాయం అందించాలని కోర్టు కోరింది. "దల్లేవాల్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన పరిస్థితులలో ప్రాణాపాయం కలిగిఉన్న సమయంలో అతడిని రక్షించేందుకు తప్ప ఆయన నిరాహారదీక్షను విరమింపజేయడానికి బలప్రయోగం చేయరాదని, వెంటనే తగిన వైద్యసహాయం అందించాలని, అన్నిరకాల శాంతియుత చర్యలు చేపట్టడం కేంద్ర, పంజాబ్ ప్రభుత్వాల రెండింటి తక్షణ కర్తవ్యంగా ఉండాలి' అని ధర్మాసనం పేర్కొంది. ఇది కఠినమైన చలికాలమని సుప్రీంకోర్టు గుర్తుచేస్తూ, శంభుఖనౌరీ సరిహద్దు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న రైతులు హింసాత్మక ధోరణిలో వ్యవహరించి హైవే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని అత్యున్నత న్యాయస్థానం ఉపదేశించింది. అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటైందని, దీని ద్వారా తాము ఒక మంచిపని చేస్తున్నామని, నిరసన తెలుపుతున్న రైతులతో మాట్లాడి కోర్టుకు సిఫారసులు చేస్తామని, చివరకు దీనిపై ఒక నిర్ణయం తీసుకునేలా స్టేక్‌హోల్డర్లను దారికి తీసుకువస్తామని సుప్రీంకోర్టు వివరించింది. 'మేం ఏ ఆర్డర్‌ను పాస్‌చేయకూడదు. ఇది అమలు చేయడం చాలా కష్టం. ఇది స్టేక్ హోల్డర్లే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది' అని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. నిరసన తెలియజేస్తున్న రైతులు వారి వేదికను తాత్కాలికంగా మార్చుకుని జాతీయరహదారులపై ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించవచ్చని, అంతేకాకుండా కొనసాగిస్తున్న ఆందోళనను సైతం తాత్కాలికంగా రద్దు చేసుకోవచ్చని సూచించింది. ధర్మాసనం కోర్టుకు హాజరైన మెంబర్ సెక్రటరీ(హైపవర్‌కమిటీ)ని గమనించింది. నిరసనను తాత్కాలికంగా నిలిపివేయాలని లేదా మరొక వేదికకు మార్చుకోవాలని కోర్టు సూచించింది. ఈ నేపథ్యంలో తదుపరి సమావేశంలో రైతులను ఒప్పిస్తామని మెంబర్ సెక్రటరీ హామీ ఇచ్చారు. ఈ మేరకు సంక్లిష్ట స్థితి నివేదిక (షార్ట్ స్టేటస్ రిపోర్ట్)ను దాఖలు చేయాలని కమిటీని ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసు విచారణ సందర్భంగా , సీనియర్ సిటీజన్ అయినటువంటి దల్లేవాల్ గత 17రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారని, ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందని న్యాయవాది ఒకరు మీడియాకు వివరించారు. సంక్షోభాన్ని వ్యాప్తిచేయకుండా ఉండేందుకు కేంద్రం ప్రతినిధులతో పాటు పంజాబ్ డిజిపి, ఆయన అధికారులు ధర్నాలో కూర్చున్న దల్లేవాల్‌ను, ఆయనతో పాటు కూర్చున్న ఇతర రైతు నాయకులను వెంటనే కలుసుకుని వారితో మాట్లాడి ఒప్పించడమే ప్రధాన కర్తవ్యమని, అంతేకాకుండా దల్లేవాల్‌కు తగిన అత్యవసర వైద్యాన్ని సమకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ద్విసభ్య ధర్మాసనం ఈ సందర్భంగా ఆదేశించింది. ఈ విషయంలో ఏదిఏమైనా, ఏది అవసరం ఉన్నా జాప్యం చేయడం తగదని, వెంటనే అమలు చేయాలని జస్టిస్ సూర్యకంత్ సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా, పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్‌కు చెప్పారు. అవసరమైతే దల్లేవాల్‌ను చండీఘడ్‌లోని పిజిఐఎంఇఆర్ లేదా పాటియాలాలోని ఏదైనా ఇతర ఆసుపత్రికి వెళ్లవచ్చని ధర్మాసనం సూచించింది.

## రిజర్వేషన్లు తగ్గొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు రాపోలు జయ ప్రకాశ్ , తిరుమలగిరి సురేందర్ , బాగ్య లక్ష్మి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తాజా పరిస్థితి పై సమీక్షించారు. సమగ్ర ఇంటింటి సర్వే లో ఇంకా ఎవరైనా సమాచారం ఇవ్వని వారి నుంచి సమాచారాన్ని సేకరించేందుకు కుల సంఘాలు చొరవ తీసుకోవాలని వారు సూచించారు. 'ఇంటింటి కుటుంబ కుల సర్వే'లో పల్లె ప్రాంతాల్లో ప్రజలు ఉత్సాహంగా భాగస్వాములై సమాచారాన్ని ఇచ్చారని, కానీ పట్టణ ప్రాంతంలో ఇప్పటి వరకు కుల సర్వేలో సమాచారాన్ని ఇవ్వలేదని, వారు సమాచారాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించి, సమాచారాన్ని ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యంగా సమాజానికి మార్గదర్శకత్వం వహించే ప్రజా ప్రతినిధులు ఐఎఎస్,ఐపిఎస్ లు సమాజాన్ని ప్రభావితం చేసే ముఖ్యమైన వారు, ఈ సర్వేలో భాగస్వాములు కావాలని కోరారు. గతంలో అనేక సందర్భాల్లో కుల సర్వే పై డిమాండ్ చేసిన కుల సంఘాలు దళిత ,గిరిజన ,బిసి సంఘాలు అన్ని కూడా ఈ కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన తీసుకుని సమాజంలో భాగస్వామ్యులయ్యే సంచార జాతులు ,అన్ని వర్గాల వారు సమాచారం ఇచ్చే విధంగా భాగస్వాములు కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సమాచార సేకరణ ద్వారానే రాష్ట్ర ప్రభుత్వం నూతన పథకాలను అమలు చేయాలని బావిస్తున్నదని, వాటికి సమాచారం లేకపోతే భవిష్యత్ లో పథకాలకు కూడా ఇబ్బంది అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు చురుగ్గా పాల్గొనాలని, కుల సర్వేలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పూర్తి వివరాలు సేకరించకపోతే ప్రజలకే నష్టం : నిరంజన్

బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ ప్రభుత్వం అనేక వ్యయాప్రయసలతో సుమారు 85 వేల మంది ఎన్యుమరెటర్స్ తో సర్వే నిర్వహిస్తున్నదన్నారు. పూర్తిగా వివరాలు సేకరించలేకపోతే ప్రజలకే నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో ఎవరు ఎంత సంఖ్యలో ఉన్నారు, అన్ని తెలుసుకుంటేనే ఆయా వర్గాల వారు ఎంత సంఖ్యలో ఉన్నారు?, వారికి న్యాయం జరుగుతుందని సూచించారు. బిసిలకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకోవాలన్న ఈ సర్వే ఒక ప్రధాన ఆధారం అవుతుందన్నారు. ఆయా సంఘాలు అసోసియేషన్‌కు చెందిన వారికి అవగాహన కల్పించి, వారిని ఈ సర్వే లో పాల్గొనేలా చూడాలని సూచించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com